వజ్రోత్సవ సభల ప్రత్యేక సంచిక

సంపుటి : 78 సంచిక : 16 పుటలు : 52

# జాగృతి

కలి 5127 - శ్రీ విశ్వావసు మాఘ బహుళ పాడ్యమి
02-08 ఫిబ్రవరి 2026
వెల : ₹20/-

# నాడు ఆవిష్కరణ, నేడు ఆచరణ

## విజయవంతంగా ఏకాత్మ మానవ దర్శన 'పునర్దర్శన' సభలు



జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.




సభాస్థలిలో మహనీయుల విగ్రహాలు




వందేమాతరం నృత్యరూపకం






శ్రీకృష్ణ దేవరాయ నగర్‌లో సభాస్థలి

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

బ్యాంకు ఖాతా వివరాలు

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

**మ**నం ఎక్కడ నుంచి బయలుదేరామో తెలియాలంటే చరిత్రను ఆశ్రయించాలి. మన పయనం ఎక్కడికో, లక్ష్యం ఏమిటో తెలియాలన్నా చరిత్రలో మనం బయలుదేరిన బిందువునే అడగాలి. జనవరి 23,24 తేదీలలో విజయవాడలో జరిగిన బీజేపీ సభల ఉద్దేశం ఇందుకు సబంధించినదే. తన మూలాలు భారతీయ జనసంఘ్‌లో ఉన్నాయన్న సంగతిని బీజేపీ ఏనాడూ విస్మరించలేదు. విస్మరించదు. జనసంఘ్ ఆశయాలను కాలానుగుణమైన కొన్ని మార్పులతో బీజేపీ స్వీకరించింది. ఇందులో దాపరికం, దాగుడుమూతలు లేవు. దేశానికి ప్రథమ స్థానం అన్నమాట ఆరోజు లేకపోవచ్చు. వినిపించకపోవచ్చు. కానీ జనసంఘ్ గుండె ఘోష అదే. కశ్మీర్‌ను ప్రత్యేక ప్రతిపత్తి నుంచి రక్షించాలన్నది ఆ పార్టీ నినాదం. దేశమంటే భక్తి ఉన్నవారు ఎవరైనా ఆ ఆశయంలోని వాస్తవికతను గుర్తించగలుగుతారు. జనసంఘ్ ఇచ్చిన ఆ నినాదాన్ని బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆచరణలో చూపించింది. ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణాన్ని తొలగించింది. భారత్ నుంచి కశ్మీర్‌ను విడదీయాలన్న వేర్పాటువాదుల కుట్రలను చివరి క్షణాలలో భగ్నం చేయగలిగింది. హిందూత్వ పార్టీ అన్న ముద్ర ఉంటే ఉండవచ్చు గాక. విమర్శలు వెల్లువెత్తితే ఎత్తి ఉండవచ్చు గాక. కానీ ఆ చర్య దేశానికి, దేశ సమగ్రతకు ఎంత అవసరమో భావితరాలు గుర్తించి తీరతాయి. చరిత్ర శ్లాఘిస్తుంది.

1965 నాటి జనసంఘ్ విజయవాడ సభలలో ప్రతిపాదించిన ఏకాత్మ మానవ దర్శనం (ఏకాత్మ మానవవాదం) ఎన్నో కోణాల నుంచి విశిష్టమైనది. కశ్మీర్ అంశం అందులో ఒకటి మాత్రమే. ప్రచ్ఛన్నయుద్ధం ప్రపంచానికి నిద్ర లేకుండా చేస్తున్న కాలంలో ఈ సిద్ధాంతం ఉద్భవించింది. కమ్యూనిజం కోట్ల మందిని వర్గశత్రువుల పేరుతో నిర్మూలిస్తుంటే, రాజ్యాల పాలనకు, పాలన ఇచ్చే ఫలితాలకు మనిషి కేంద్ర బిందువుగా ఉండాలని ప్రతిపాదించిన గొప్ప మానవతా దృష్టి కలిగిన సిద్ధాంతం ఏకాత్మ మానవ దర్శనం. పెట్టుబడిదారీ విధానం మనిషిని నైతిక విలువల నుంచి, మనశ్శాంతిని ఇచ్చే, సాంత్వన కూర్చే ఆధ్యాత్మిక చింతన నుంచి వేరు చేస్తే, వాటిని పునఃప్రతిష్ఠించుకోవలసిన అవసరాన్ని ఏకాత్మ మానవతా దర్శనం లోకానికి చాటింది.

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు మాఘ బహుళ పాడ్యమి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**నాడు ఆవిష్కరణ, నేడు ఆచరణ**

ధారావాహిక నవల

(21) **గణపతిదేవుడు**

– మత్తి భానుమూర్తి



24లో

ఇష్టం

**చెంచాలు, అట్టపెట్టెలే అసలైన ఆటవస్తువులు!**



34లో

# జాగృతి

## సంపాదకీయం

## పునర్దర్శనం

సోవియెట్ రష్యా, చైనా, వియత్నాం, కంబోడియాలలో జరిగిన మానవ హననం అమానుషం. ఆ రక్తపాతం దారుణం. ఏడుపదులు లేదా ఆరుపదులు మాత్రమే మనగలిగిన రాజకీయ సిద్ధాంతం కోసం ఇంత మధ్యయుగాల రక్తదాహాన్ని కొనసాగించాలా? పెట్టుబడిదారీ విధానం అంటే ప్రచ్ఛన్నయుద్ధాన్నీ, కమ్యూనిజాన్నీ నిలువరించే పేరుతో జరిగిన సామ్రాజ్య విస్తరణ. నిజానికి రెండు సిద్ధాంతాల అంతిమ లక్ష్యం సామ్రాజ్యకాంక్ష మాత్రమే. వీటిని సవాలు చేసినవారే దీనదయాళ్.

సిద్ధాంతాలను ప్రవచించడం వేరు. వాటిని ఆచరించడం వేరు. సమాజాల మీద వాటి ప్రభావం ఎంతో గుర్తించగలగడం అసలైన రాజనీతిజ్ఞత. అలాంటి రాజనీతిజ్ఞతను నాడు దీనదయాళ్ ఉపాధ్యాయ, దత్తోపంత్ ఠేంగ్డీ వంటివారు ప్రదర్శించారు. అందుకు కారణం ఒక్కటే. దిగుమతి చేసుకున్న సిద్ధాంతాలు మన నేలను ఉద్ధరించవు. దేశ సమస్యలకు దేశీయమైన పంథాలు మాత్రమే అక్కరకు వస్తాయన్న విజ్ఞత. ఇలాంటి జ్ఞానదృష్టి వారికి ఇచ్చినది, మాతృసంస్థ ఆర్ఎస్ఎస్. ఈ దేశానికి ఘన చరిత్ర ఉంది. ఈ మాట అంటే చాలు వెక్కిరింపులు వచ్చాయి. ఈ దేశానికి రాజనీతి, పాలనావిధానం సమున్నత శిఖరాలను చూసిన చరిత్ర ఉంది. ఈ మాట అంటే అవహేళనలే. కానీ కాలం మారింది. కాలం కప్పిన పొరల నుంచి ఇప్పుడు ఏకాత్మ మానవ దర్శనం విశ్వరూపం దాల్చింది. దానిని ఔదలదాల్చిన భారత్ సాధిస్తున్న విజయాలు విశ్వాన్ని విస్తుపోయేటట్టు చేస్తున్నాయి.

అంత్యోదయ అన్న సూత్రం స్వతంత్ర భారతదేశంలో వినిపించలేదు. సోషలిజం అన్న మాట విన్నాం. కమ్యూనిజం అన్న నినాదం విన్నాం. కానీ అవి అతి తొందరగా రంగువెలిశాయి. లేదంటే రంగే మార్చుకున్నాయి. స్వదేశీని కూడా జోడించుకున్న ఏకాత్మ మానవ దర్శనం ఇచ్చిన మార్గదర్శనంలో భారతావని నిశ్చయంగా సమున్నత శిఖరాల వైపు సాగిపోతున్నది. ఆర్థికవ్యవస్థ, రక్షణ వ్యవస్థ, దేశభద్రత నిలకడగా ఉన్నాయి. ఏకాత్మ మానవ దర్శనం ఆరు దశాబ్దాలక్రితమే దేశం ముందుకువచ్చి ఉండవచ్చు. కానీ పదిమంది ప్రధానులు చేకూర్చలేని మేలును ఇద్దరు బీజేపీ ప్రధానులు కూర్చారు. అలా నిలకడగా సాగుతున్న వ్యవస్థలను ధ్వంసం చేయాలన్న దుర్బుద్ధి మాత్రం స్వైరవిహారం చేస్తున్నది.

అద్దెకు తెచ్చిన గుర్రాలు అగడ్తలు దాటవు. అరువు తెచ్చుకున్న విదేశీ సిద్ధాంతాలైనా అంతే. విదేశీ దురాక్రమణదారులు మిగిల్చిన సమస్యలను విదేశీ సిద్ధాంతాలు పరిష్కరిస్తాయా? ఒకప్పుడు ప్రపంచ జీడీపీలో దాదాపు 25 శాతం ఉన్న భారత్ వాటా 1947 నాటికి కేవలం 4 శాతం. స్వతంత్ర భారతదేశంలో ఓడలలో విదేశాల నుంచి ఆహార పదార్థాలు మన రేవులలో దిగిన తరువాతనే ఇళ్లలో పొయ్యిల మీదకు కుండలు ఎందుకు ఎక్కేవి? సోవియెట్ రష్యా నుంచి దిగుమతి చేసుకున్న పంచవర్ష ప్రణాళికలు ఏం చేశాయి? చైనా చేతిలో దేశం ఎందుకు ఓడింది? పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్న తీరులో సామ్యవాద వ్యవస్థలు ఎందుకు కునారిల్లాయి? ఈ ప్రశ్నలకు భారతీయ హృదయంతో సమాధానాలు వెతికిన ఫలితమే ఏకాత్మ మానవ దర్శనం. ఆ దర్శనం భారత్‌కు ఇచ్చిన వైభవం ఎలాంటిదో, అందుకు ఇటీవల సాగిన ప్రయాణం గురించి విజయవాడ పునర్దర్శన సభలు సమీక్షించుకున్నాయి. అందుకు అరవై ఏళ్ల సందర్భాన్ని ఎంచుకోవడం స్ఫూర్తిదాయకం. సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయకు నమోవాకాలు. దాని అమలుకు శ్రీకారం చుట్టిన అటల్ బిహారీ వాజపేయికి నమశ్శతములు. మరింత ఉధృతంగా ముందుకు తీసుకువెళుతున్న నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ★

02 ఫిబ్రవరి 2026, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**చివరి తీర్పు**

– విహారి





| | | |
|---|---|---|
| ఏకాత్మ మానవ దర్శనమే గెలిచింది | - | 20 |
| మధ్యయుగంలో రాజనీతి (మార్క్సిజం – శ్రీరామరాజ్యం) | - | 23 |
| అమెరికాను ముంచుతున్న 'ట్రంపరితనం'..! (అంతర్జాతీయం) | - | 28 |
| భారత యువరాణి సూరిరత్న కొరియా రాణి హోహ్వాంగ్ ఒక్కరే | - | 32 |
| స్వరాజ్య ఉద్యమ సేవలో స్వయంసేవకులు.. (ఆర్ఎస్ఎస్–100) | - | 36 |
| శునక దాడులకు మద్దతా!? (వీళ్లతో ఎలా?) | - | 38 |
| రాజకీయ సుడిలో నైనీ టెండర్లు (తెలంగాణ) | - | 44 |
| టీ–20 ప్రపంచకప్‌లో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించేనా? (క్రీడ) | - | 43 |
| బాలజాగృతి | - | 46 |
| సినీ ప్రతిభావంతులకు పద్మ పురస్కారాలు! (సినిమా) | - | 50 |




# నాడు ఆవిష్కర

## విజయవాడలో విజయవం

'విజయవాడలో 1965 నాటి భారతీయ జనసంఘ్ సమావేశాలను కళ్లారా చూడలేని వారమంతా ఈ రోజు ఆ చారిత్రక సన్నివేశాన్ని అదే నేల మీద పునర్దర్శనం చేసుకుంటున్నాం. ఆనాడు ఏకాత్మ మానవతావాదం పేరుతో ఇక్కడే ఆవిష్కృతమై ఈనాడు మనమంతా సమున్నతంగా భావిస్తూ, పిలుచుకుంటున్న ఏకాత్మ మానవ దర్శనం నుంచి ఎలా స్ఫూర్తి పొందాలో నేర్చుకోవడానికి ఇక్కడ

ఆనాటి స్ఫూర్తిని కొనసాగించడానికి ఇవాళ కూడా శ్రీకృష్ణదేవరాయ నగర్ అన్న పేరే పెట్టారు. సభా ప్రాంగణం రెండు రోజుల పాటు భారతమాతాకీ జై, వందేమాతరం నినాదాలతో మార్మోగింది. 1965 నాటి సభలకు ప్రత్యక్ష సాక్షులు ఆచార్య ముదిగొండ శివప్రసాద్, జూపూడి హైమవతమ్మ కూడా పాల్గొని సభకు వన్నె తెచ్చారు. నాటి తమ అనుభవాలను, ఆనాటి నేతల విరాడ్రూపాలను, ఆ సిద్ధాంతం స్వతంత్ర భారత చరిత్ర మీద పరిచిన నీడను వారు ఈ తరం జాతీయవాదులకు ఎరుక పరిచారు. ఎన్నో ఆశలతో తెచ్చుకున్న స్వతంత్ర భారతదేశం ఎదుర్కొంటున్న దుస్థితికి ఒకసారి దుఃఖించారు. కానీ ఏకాత్మ మానవ దర్శన ప్రాసంగికతకు మురిసి పోయారు. అంతరాలు లేని, వైషమ్యాలు లేని ప్రపంచ నిర్మాణానికి మిగిలి ఉన్న సిద్ధాంతంగా ఇవాళ్టి జాతీయవాదులు నమ్మకాన్ని ప్రకటిస్తున్నందుకు మాత్రం వారు సంతుష్టులయ్యారు.

నిజంగానే.. 1965 నాటి చారిత్రక దృశ్యాన్ని పునఃసృష్టించేందుకు ఏపీ బీజేపీ నేత మాధవ్, రాష్ట్ర బీజేపీ, విజయవాడ శాఖ కార్యకర్తలు పడిన శ్రమ శతథా శ్లాఘనీయం. జాగృతి వారపత్రిక, సారస్వత నికేతన్ (వేటపాలెం గ్రంథాలయం), ఇతర వనరుల ద్వారా సేకరించిన చిత్రాలతో అప్పటి సభా కార్యక్రమాల సన్నివేశాలను రూపుకట్టించారు. ఆరు దశాబ్దాల నాటి పాత పుస్తకాలలోని ఫొటోలను కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇటీవల తీసిన ఛాయాచిత్రాలతో సమంగా తయారు చేయించారు.

శ్రీకృష్ణదేవరాయ నగర్ పేరుతో నిర్మించిన నాటి సభావేదిక స్వాగత ద్వారాన్ని మరపిస్తూ అదే నమూనాను రమ్యంగా తిరిగి ఏర్పాటు చేశారు. 1965 నాటి ప్రపంచంలోకి ఈ స్వాగత ద్వారమే తీసుకుపోయింది. రాయలు, దీనదయాళ్, వివేకానంద, నేతాజీబోస్ విగ్రహాలు కూడా పెట్టారు. వీటన్నిటి మధ్య అంతర్లీనమైన ఒక ఏకాత్మత ఉంది. శ్రీకృష్ణరాయలవారికీ, విజయవాడకీ అనుబంధం ఉంది. గజపతులమీద విజయం తరువాత తిరిగి వెళుతూ రాయలవారు విజయవాడలో ఆగారు. తెలుగు సాహిత్యంలో అనర్ఘరత్నంగా కీర్తిగడించిన వారి ప్రబంధం 'ఆముక్తమాల్యద' రచన ఇక్కడే జరిగింది. పైగా తిథుల ప్రకారం జనవరి23 ప్రాంతంలో రాయలవారి పట్టాభిషేక చారిత్రక ఘట్టం కూడా జరిగింది. జనవరి 23 నేతాజీ జయంతి. 24వ తేదీ లాలా లాజపతిరాయ్ జయంతి.

ప్రారంభ సమావేశంలో బీజేపీ సంఘటనామంత్రి బీఎల్ సంతోష్, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఏపీ ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌యాదవ్, విష్ణుకుమార్‌రాజు (ఏపీ శాసనసభలో బీజేపీ పక్షనేత) ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షులు సోము వీర్రాజు (ఎమ్మెల్సీ), దగ్గుబాటి పురందేశ్వరి (ఎంపీ), పాకా సత్యనారాయణ (ఎంపీ, రాజ్యసభ), వై.ఆదినారాయణరెడ్డి (జమ్మలమడుగు ఎమ్మెల్యే) పాల్గొన్నారు.

ఆరు దశాబ్దాల తరువాత ఇలాంటి 'పునర్దర్శనం' ఏర్పాటు చేయడం వెనుక భూమికను మాధవ్ వివరించారు. ప్రవచనానికి ఎప్పుడు విలువ వస్తుందో ఒక సందర్భంలో కవి, రాజనీతి కోవిదుడు అటల్ బిహారీ వాజపేయి కవితా రూపంలో చెప్పిన మాటలను మాధవ్ గుర్తు చేశారు. సిద్ధాంతాలు, ప్రవచనాలు వినడానికి పరిమితం చేసుకునేవికావు. వాటిని ఆచరించాలి అప్పుడే అవి అమృత ప్రాయ మవుతాయి అన్నదే దాని సారాంశం. ఈ సందర్భంలోనే దీనదయాళ్ జీవిత విశేషాలను గుర్తు చేశారు. ఎంతో పేదరికం నుంచి ఆయన వచ్చారు. స్వయంసేవక్‌గా, జనసంఘ్ నేతగా, సంఘటనా స్రష్టగా, మహోన్నత చింతనాపరునిగా ఆయన ప్రస్థానం గురించి మాధవ్ చెప్పారు. అలాంటి మహానుభావుడికి ప్రాప్తించిన దుర్మరణాన్ని గుర్తు చేసుకుని విచారం ప్రకటించారు. రైలులో బయలు దేరిన దీనదయాళ్ మొగల్‌సరాయ్‌లోని రైల్వేస్టేషన్ దగ్గర విగతజీవిగా కనిపించారు. ఆయన అప్పుడు జనసంఘ్ జాతీయ అధ్యక్షులు.

ఆరు దశాబ్దాల క్రితం ప్రపంచం దారుణమైన సిద్ధాంత రాద్ధాంతంలో కూరుకుపోయింది. కమ్యూనిజమే అంతిమ సత్యమన్నమన్నది ఒక శిబిరం. పెట్టుబడిదారీ విధానానిదే అంతిమ సత్యమని మరొక శిబిరం విజృంభించి, స్వైరవిహారం చేసిన సమయమది. ఈ రాద్ధాంతంలో మనిషితనం తప్పిపోయింది. బుద్ధి అనే భావన బుట్టదాఖలయి పోయింది. నైతిక సామాజిక విలువల మధ్య శతాబ్దాల పాటు మానవాళి బుద్ధిని భద్రంగా ఉంచిన

# ణ, నేడు ఆచరణ

## తంగా ఏకాత్మ మానవ దర్శన 'పునర్దర్శన' సభలు

సమావేశమయ్యాం' అన్నారు భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్. నిజమైన రాజకీయ తాత్త్వికత కాలపరీక్షకు నిలుస్తుంది. రుషితుల్యుడు పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1965లో విజయవాడలో జరిగిన భారతీయ జనసంఘ్ 12వ వార్షిక మహాసభలలో ఏకాత్మ మానవ దర్శన సిద్ధాంతాన్ని పరిచయం చేశారు. ఆ గొప్ప చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ, జనసంఘ్ ఆధునిక రూపం భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ విజయవాడలో పునర్దర్శన సభలు ఏర్పాటు చేసింది. జనవరి 23, 24–2026 తేదీలలో ఇవి జరిగాయి. ఆనాడు ఆ చారిత్రక సన్నివేశానికి వేదిక అయిన మునిసిపల్ స్టేడియం గ్రౌండ్స్ (నేడు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ క్రీడా ప్రాంగణం, బందర్ రోడ్డు)లోనే పునర్దర్శన సభలు ఏర్పాటయ్యాయి.



ఆధ్యాత్మిక చింతన అపహాస్యానికి గురైంది. ఈ గందరగోళానికి కారణం ఆ సిద్ధాంతాలు ఘర్షణను నమ్మడమే. ఆచరణలో ఆరు లేదా ఏడు దశాబ్దాలు మాత్రమే రాజ్యమేలి నిష్క్రమించాయి అవన్నీ. ఈ పరిస్థితిని ముందే ఊహించింది ఏకాత్మ మానవ దర్శనం. అందుకే ఏకాత్మ మానవ దర్శనం విశ్వానికి ఒక శాశ్వత పరిష్కారమని గుర్తించాలి అన్నారు మాధవ్. ఆనాడు ఇక్కడ చేసిన తీర్మానాలలోని విషయాలు ఇవాళ వాస్తవాలుగా మన కళ్లముందు ఉన్నాయి. ప్రాంతీయ భాషలు బతకాలని నాటి సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. అలాగే సంస్కృత భాష శాస్త్రీయతను గుర్తించాలని కూడా జనసంఘ్ ఆశించింది.

ఒక రాజకీయ తాత్త్వికత జీవితకాలం ఆరు దశాబ్దాలేనా? లేదా ఏడెనిమిది దశాబ్దాలకు అంత మయ్యే సూచనలు స్పష్టంగా ఉన్న విదేశీ రాజకీయ సిద్ధాంతం కోసం కాలపరీక్షకు నిలిచిన జీవన విధానాన్ని, జీవన శైలిని కకావికలు చేసుకోవడాన్ని ప్రగతి పథంగా భావించే దౌర్భాగ్యం ఎందుకు? ఈ ప్రశ్నకు సమాధానం ఒక్కటే – బానిసబుద్ధి. వలసవాద మనస్తత్వం నుంచి బయటపడలేని తనం. మనిషిని యంత్రంలో ఒక భాగంగానే పరిగణిస్తూ, కట్టుబాని సలా బతకమంటుంది కమ్యూనిజం. విచ్చలవిడి స్వేచ్ఛను ఇచ్చి మనిషిని సర్వ విలువల నుంచి సుదూరంగా నెట్టివేసే వాతావరణం పెట్టుబడిదారీ విధానం సొంతం. బలవంతుడిదే రాజ్యమన్న ఆదిమ కాల సూత్రాన్ని కొత్త కొత్త పేర్లతో అమలు చేసేదే పెట్టుబడిదారీ విధానం. ఈ రెండూ కూడా ప్రకృతితో మనిషికి గొప్ప అవినాభావ సంబంధం ఉందన్న మహా వాస్తవాన్ని నిరాకరిస్తాయి. అలాంటి కాలంలోనే పండిట్ దీనదయాళ్ తన ఏకాత్మ మానవదర్శనం అందించారు. కానీ రాజకీయ సిద్ధాంతం అంటే ఆర్థిక, రాజకీయ సూత్రాలే కాదు, మానవీయ ముఖం అనివార్యం అని చెప్పింది ఏకాత్మ మానవవాదం. కానీ నాటికి విపరీతంగా ఉన్న వలసవాద మనస్తత్వం, బానిసబుద్ధి అలాంటి పరిపూర్ణ మానవ వికాస సిద్ధాంతాన్ని గుర్తించడానికి అడ్డుపడ్డాయి. కమ్యూనిజం కూలింది. చరిత్ర మీద నెత్తుటి చారికలను మిగిల్చి వెళ్లింది. బుద్ధి వైకల్యాన్ని దట్టించి మేధావుల పేరుతో విధ్వంసకారులను ప్రపంచం మీదకు వదిలి వెళ్లింది. ధనిక–శ్రమ జీవి మధ్య సంఘర్షణ కాస్తా కులాల మధ్య రగడగా దిగజారింది. స్త్రీ,పురుష ద్వేషానికి సిద్ధాంతాలు సృష్టించింది. కుటుంబ వ్యవస్థకు చేటు తెచ్చింది. ఇక పెట్టుబడిదారీ వ్యవస్థ ఇచ్చిన విపరీత స్వేచ్ఛ తుపాకీ సంస్కృతిగా మారిపోయి చాలాకాలం అయింది. ప్రజాస్వామ్యాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని సమూలంగా నిర్మూలించే ఉద్యమాలను రాజేస్తోంది. డీప్‌స్టేట్‌లకీ, క్రైస్తవ వ్యాప్తికీ శక్తిమేరకు సహకరిస్తున్నది. ఇది నేటి వాస్తవిక చిత్రం. ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ వ్యథ నేపథ్యంలో భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చింది. తమ మాతృక జనసంఘ్ మహానేత దీనదయాళ్ ఆవిష్కరించిన ఏకాత్మ మానవ దర్శనాన్ని చేతులారా, గుండె నిండుగా ఆహ్వానించింది.

ఏకాత్మ మానవ దర్శనం అంటే సనాతన ధర్మ సారం. నీలోను, అవతలి వారిలోను; నీ సమాజం లోను, అవతలి సమాజంలోను ఒకే ఆత్మ ఉందని చెప్పే మహోన్నత సిద్ధాంతం. చరిత్రలో మరుగున పెట్టిన మహా విజయాలకు చోదకశక్తి. అవతలి సమాజాల హృదయాలను గెలిపించిన విజయాలవి. విజయం అంటే ఏమిటో తెలుసుకోవడానికి వంద లాది యుద్ధాలు, రెండు ప్రపంచ యుద్ధాలు చాల వన్నట్టు మరొక యుద్ధంకోసం అస్త్రులు చాస్తున్న దేశాలు,కూటములకు కళ్లు తెరిపించగలిగే సిద్ధాంతం. ఒక్కమాటలో దేశ సమస్యలకు దేశీయమైన పరిష్కారాలే ఎప్పటికీ శరణ్యమని చెప్పిన మార్గం.

దిగుమతి చేసుకున్న సిద్ధాంతాలు, అరువు తెచ్చుకున్న పాలనారీతులు మొదటి ఐదు దశాబ్దాల స్వతంత్ర భారతావనిని ఎంత హింసించాయో, ఏకాత్మ మానవ దర్శనమే ఆలంబనగా సాగిన ఒకటిన్నర దశాబ్దాల పాలన ఏ విధంగా ఉన్నదో 77 ఏళ్ల తరువాత అంచనా వేసుకోవలసిందే. రెండు రోజులలో జరిగిన ఏడు చర్చా కార్యక్రమాలు ఆ రెండు పాలనారీతుల మధ్య తేడాను గొప్పగా ఆవిష్కరించాయి. అంత్యోదయ నినాదంలోని వాస్తవిక తను వివరించాయి. ఆత్మనిర్భర భారత్ విధానం దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపిన సంగతిని గుర్తు చేశాయి. బీజేపీ ఇద్దరు ప్రధానులను దేశానికి ఇచ్చింది. వారే అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ. ఆ ఇద్దరు ఏకాత్మ మానవ దర్శనాన్ని ఆదర్శంగా తీసుకున్నారని, దేశ పురోగతికి నిజమైన దిశా నిర్దేశం దానితోనే జరిగిందని మాధవ్ చెప్పారు.



పీవీఎన్ మాధవ్

# ఏకాత్మ మానవ



ముదిగొండను సత్కరిస్తున్న బీఎల్ సంతోష్

ఏకాత్మ మానవ దర్శనం ఒక ఇజం కాదు, నిజం అని విజయవాడ వేదిక నుంచి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ నిర్ద్వంద్వంగా ప్రకటించారు. 1965 నాటి సభలను చూసిన వారిగా ఆయనను ఏపీ బీజేపీ సభలకు ఆహ్వానించింది. ఆయన అనుభవాలను వినగోరింది. సభానదులు మొట్టమొదట విన్నది కూడా వారి జ్ఞాపకాలనే. రెండు కారణాలతో తాను ఈ సభలలో పాల్గొనడానికి అర్హత సాధించానని అన్నారాయన. ఘట్‌కేసర్ (తెలంగాణ) లో ఆనాడు గురుకులం ఉండేది. అక్కడ ఒక శిబిరం నిర్వహించి, దీనదయాళ్‌ను ఆహ్వానించారు. ఆనాడు ఆయన తన ఉపన్యాసంలో ఏకాత్మ మానవవాదం ప్రాథమిక అంశాల గురించి కొన్ని మాటలు చెప్పారు. అప్పుడు వారి పాదాల దగ్గర కూర్చుని వాటిని రాసుకుని తెలుగులోకి అనువదించానని చెప్పారు. రెండో కారణం– ఆనాడు తాను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా ఎంపికయ్యానని, అందుకే సభలలో పాల్గొన్నానని,

# దర్శనం.. ఇజం కాదు నిజం!

**ఆచార్య ముదిగొండ శివప్రసాద్**

ఆనాడు ఎవరు ఎక్కడ ఎలా ఆసీనులయ్యారో, ఎవరు హాజరయ్యారో ఇప్పటికీ తనకు గుర్తు ఉందని చెప్పారాయన. అందుకే ఆ మహనీయునికి నివాళి ఘటించేందుకు తాను హైదరాబాద్ నుంచి వచ్చానని తెలియచేశారు.

ఏకాత్మ మానవ దర్శనం ఒక ఇజం కాదు, నిజం అని ఘంటాపథంగా ప్రకటించిన ఆచార్య శివప్రసాద్– వికసిత భారత్‌కు అవసరమైనది ఈ దర్శనమేనని చెప్పారు. మన పురాణాలు, ఇతర వాఙ్మయం ఎప్పుడు చెప్పినా ఎలా చెప్పినా ఒక్కటే– కలసి నడుద్దాం. మనుషులంతా ఒక్కటే అంటుంది. శరీరంలో ప్రాణం ఉంటుంది. దానినే విరాట్ అన్నారు దీనదయాళ్. మనిషికి కేవలం అన్నం ఒక్కటే అందిస్తే చాలదని, బుద్ధి కోసం సంస్కృతి కూడా అవసరమని చెప్పారాయన. ఈజిప్ట్, మెసపుటోమియా, చైనాలలోను భారత్‌తో పాటు నాగరికత విలసిల్లింది. ఆ నాగరికతలన్నీ కాలగర్భంలో కలసిపోయినా, భారత నాగరికత మాత్రం జీవించే ఉందని, ఆ నాగరికతాసారాన్నే దీనదయాళ్ తన ఏకాత్మ మానవ దర్శనంలో నిక్షిప్తం చేశారని గుర్తు చేశారు. ధర్మార్థకామమోక్షాలనే అంశం ఆధారంగా దీనదయాళ్ తన సిద్ధాంతాన్ని నిర్మించారని, అందులో ఆధ్యాత్మిక భావనకు స్థానం ఇచ్చారని తెలియచేశారు. ప్రాణశక్తి తగ్గిన భాగాలు చచ్చుపడిపోతాయంటూ, భారతదేశ దక్షిణ ప్రాంతంలో ప్రాణశక్తి కొన్ని చోట్ల తగ్గింది. అలాంటి చోట్లలోనే జాతివ్యతిరేక భావాలు తలెత్తాయని గుర్తించాలని, ఆ భాగాలు ఏవో తెలిసిందేనని అన్నారు. తమిళనాడు, కేరళలలో అరాచకం విరాట్ శక్తి కోల్పోతున్న కారణంగానేనని ఆచార్య ముదిగొండ విశ్లేషించారు.

విజయవాడ సమావేశాలకు ఒకటి రెండు రోజుల ముందే ఖమ్మంలో జరిగిన కమ్యూనిస్టు సభల గురించి డాక్టర్ ముదిగొండ ప్రస్తావించారు. 1925లో డాక్టర్ కేశవరావ్ బలీరామ్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారు. అదే సంవత్సరం ఎంఎన్ రాయ్ భారత కమ్యూనిస్టు పార్టీని నెలకొల్పారు. ఆర్ఎస్ఎస్ సజీవశక్తిగా పురోగమిస్తున్నదని, సంఘం దాని అనుబంధం సంస్థలు ఏ స్థితిలో ఉన్నాయో అందరికీ తెలుసునని అంటూ, భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రం ఖమ్మంలో శవాల దిబ్బల మధ్య తన వందేళ్ల సందర్భాన్ని జరుపుకున్నదని చెప్పారు శివప్రసాద్. కాబట్టి వికసిత భారత్‌కు ఏది అవసరమో ఇప్పుడు రుజువైందని అన్నారు.

**ఏకాత్మ**

పండిత దీనదయాళుడు
పాడిన మానవ గీతం
సురగంగా జలపాతం
విశ్వాత్మకు సంకేతం
సంగచ్ఛధ్వం మంత్రం
సంఘటనం తంత్రం
వసుధైవ కుటుంబకం
కుసుమ కమల సౌగంధ్య
సమ సూత్ర కదంబకం
నరజాతికి వరనీయం
రమణీయాచరణీయం

# అంత్యోదయకు పునాది దీనదయాళ్ చింతనే

**కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి**

‘ఎక్కడ ఏకాత్మ మానవ దర్శన సిద్ధాంతాన్ని ఆవిష్కరించారో, ఆ స్థలంలోనే 60 ఏళ్ల తరువాత మనందరం కలుసుకున్నాం. ఇది మన అదృష్టం. ఇవాళ (జనవరి 23) వసంత పంచమి. నేతాజీ జయంతి. అంటే దేశభక్తుల దినోత్సవం. మనందరికీ పవిత్రదినం’ అన్నారు బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి. స్వతంత్ర భారతదేశాన్ని తీర్చిదిద్దడానికి పంథాను ఎంచుకోవడంలో తొలితరం పాలకులు చేసిన తప్పిదాలను, విదేశీ సిద్ధాంతాలను రుద్ది, అరవిందుడు, బిపిన్‌చంద్రపాల్ వంటి జాతీయవాద రాజనీతిజ్ఞుల ఆలోచనలను త్రోసిరాజని విదేశీ సిద్ధాంతాలను రుద్ది, దేశాన్ని పునర్నిర్మించడానికి బదులు, వలసవాద మనస్తత్త్వం కాపాడడం, ఆ నేపథ్యంలో భారతీయత పునాదిగా పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవ దర్శన చింతనను భారతీయులకు అందించడం వంటి విషయాలను కేంద్రమంత్రి చక్కగా వివరించారు.

పెట్టుబడిదారీవిధానమే ప్రపంచానికి శరణ్యమని కొందరు. సోషలిజమే ప్రగతికి ఏకైక సూత్రమని ఇంకొందరు. కమ్యూనిజం మాత్రమే విశ్వమానవాళి శ్రేయస్సును ఆశిస్తుందని మరికొందరు వాదులాడుకుంటూ ‘మనిషి’ని మరచిపోయారు. ఆ సమయంలో దేశ సమస్యలకు దేశీయమైన పరిష్కారాలు మాత్రమే ఉండాలన్న వాస్తవిక దృక్పథంతో నాటి భారతీయ జనసంఘ్ అధ్యక్షులు పండిత్ దీనదయాళ్ ఏకాత్మ మానవ దర్శనం ప్రతిపాదించారు. అంత గొప్ప సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి విజయవాడను ఎంచుకోవడం అపురూపం. ఆ చరిత్రాత్మక సందర్భాన్ని స్మరించుకుంటూ ఈ జనవరి 23న మనందరం సమావేశం కావడం నిజంగానే అదృష్టం.

కానీ ఈ రోజు పరిస్థితి ఏమిటో మనందరికీ తెలుసు. పెట్టుబడిదారీ విధానాన్ని నమ్మిన దేశాలూ, కమ్యూనిజాన్ని ఎంచుకున్న దేశాలూ కూడా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రపంచం ఎంత సంక్షోభంలోకి వెళుతున్నా గడచిన 12 ఏళ్ల కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం స్థిరంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నదంటే కారణం దీనదయాళ్ ప్రతిపాదించిన సిద్ధాంతం ఆధారంగా పాలనావిధానాన్ని సాగించడమే.



అంత్యోదయ అన్న సమున్నత సంక్షేమ దృష్టితో ప్రస్తుత ప్రభుత్వం సాగుతున్నదంటే కారణం దీనదయాళ్ సిద్ధాంతమే. పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజం, సోషలిజం వంటి సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయంగానే దీనదయాళ్ ఆ సిద్ధాంతాన్ని నాడు ప్రతిపాదించారు. అది ధర్మరాజ్యం గురించి చెబుతుంది. అంటే నిజమైన చట్టబద్ధ పాలన. పెట్టుబడిదారీవిధానం మనిషికి విపరీత స్వేచ్ఛను ఇస్తుంది.

కమ్యూనిజం ఇందుకు విరుద్ధం. ఆ రెండు సిద్ధాంతాలలోను వికేంద్రీకరణ మాత్రం లేదు. వాటిలో ప్రస్తుతం కనిపిస్తున్న వికృతులకు కారణం కేంద్రీకరణ. అవి ఎక్కడ విఫలమైనాయో, సరిగ్గా అక్కడే ఏకాత్మ మానవ దర్శనం వికేంద్రీకరణను ముందుకు తీసుకువచ్చింది.

దీనదయాళ్ చెప్పినది ఒక్కటే. పాలన అంటే సమాజంలోని అత్యంత పేదల సంక్షేమాన్ని మొదట పట్టించుకోవాలి. మనవైన భారతీయ విలువలకు, స్వదేశీ సిద్ధాంతానికి మనమంతా పునరంకితం కావాలని వారు అన్నారు. మనిషి కేంద్రంగా రూపొందిన తొలి సిద్ధాంతం అదే. అంత్యోదయ అందులో పరాకాష్ట. ఆర్థికవ్యవస్థ ద్వారా వచ్చే ఫలితాలు చిట్టచివర ఉన్నవారికి చేరాలన్నదే దాని ఆశయం. ఇంకొక ఉదంతం కూడా ఉంది. 1980లో బీజేపీ ఆవిర్భవించిన తరువాత జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరిగిన స్థలం కూడా విజయవాడే.

మోదీ 12 సంవత్సరాల పాలనకు ఇదే పునాది. ఆయన ఎవరూ ఆకలితో ఉండరాదని స్పష్టం చేస్తూ ఉంటారు. ఐదేళ్ల పాటు ప్రతి పేద కుటుంబానికి ఐదు కిలోల బియ్యం పంపిణీకి ప్రేరణ అంత్యోదయ.

స్వచ్ఛ భారత్‌లో భాగంగా 19 కోట్ల ఇళ్లకు మరుగుదొడ్ల నిర్మాణం పేద ఇంటి మహిళ ఆత్మ గౌరవం కోసం చేపట్టినది. ఇంకా కేంద్ర మంత్రిమండలిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు 60 మందికి స్థానం కల్పించడం కూడా అంత్యోదయలో భాగమే. 56 కోట్ల మందికి జన్‌ధన్ ఖాతాలు, ఓబీసీలకు 10 శాతం రిజర్వేషన్, ఆయుష్మాన్ భారత్ పేరుతో 35 కోట్ల మందికి కార్డుల జారీ, విశ్వకర్మ యోజన, నాలుగు కోట్ల నివాసాలకు నీరు, చిన్న వ్యాపారులకు రుణాలు, ముద్ర యోజన ఇవన్నీ అంత్యోదయలో భాగం. దాని వెనుక ఉన్నది దీనదయాళ్ దృష్టి.

కిషన్‌రెడ్డి ఉపన్యాసంతో ప్రారంభ కార్యక్రమం ముగిసింది. తరువాత నుంచి దాదాపు రోజున్నర ఏకాత్మ మానవ దర్శనం బీజేపీ ప్రభుత్వాల మీద ఎలాంటి ప్రభావాన్ని కలిగి ఉన్నదో వివరించాయి.







## ప్రత్యేక సంచికల ఆవిష్కరణ

ఏకాత్మ మానవ దర్శనం పునర్దర్శనం సందర్భంగా జాతీయ వారపత్రిక 'జాగృతి' వెలువరించిన ప్రత్యేక సంచికను బీఎల్ సంతోష్ ఆవిష్కరించారు. 1965 నాటి అద్భుత జ్ఞాపకాలతో ఉన్న స్మరణికను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. జాగృతి నుంచి సేకరించిన 1965 నాటి పలు క్లిప్పింగ్‌లను ప్రత్యేక సంచికగా వెలువరించారు.



## అలరించిన ఎగ్జిబిషన్

పత్రికలు, గ్రంథాలయాల నుంచి సేకరించిన 1965 నాటి సభల సన్నివేశాలతో రూపొందించిన ఆడియో విడియో ప్రదర్శన ఉత్తేజకరంగా ఉంది. లక్నోలో ఒక బీజేపీ కార్యకర్త ఎంతో భక్తిగా దాచుకున్న దీనదయాళ్ ఆడియో సేకరించి, ఏఐ సాయంతో విజయవాడలో గతంలో ఆయన అన్న మాటలకు అన్వయించి సాక్షాత్తు దీనదయాళ్ నేటి తరాన్ని ఉద్దేశించి ప్రసంగించిన అనుభూతికి కలిగించే ప్రయత్నం స్వాగతించదగినది. జనవరి 23 ఉదయం 9.30 గంటలకు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి దీనదయాళ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తరువాత బీఎల్ సంతోష్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.





## ఆతిథ్యం అద్భుతం

సభాస్థలికి పక్కనే అల్పాహార, భోజనశాల ఏర్పాటు చేశారు. బఫేతో పాటు టేబుళ్ల మీద కూర్చుని తినడానికి కూడా ఏర్పాటు చేశారు. వీరికి అరిటాకులో భోజనం వడ్డించారు. రెండు రోజులు ఉదయం అల్పాహారం, తరువాత తేనీరు, మధ్యాహ్న భోజనం, సాయంత్రం మళ్లీ తేనీరు, అల్పాహారం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. అనుకున్నదాని కంటే ప్రతినిధుల సంఖ్య కాస్త పెరిగినప్పటికి నిర్వాహకులు ఏ లోటూ రాకుండా జాగ్రత్త పడ్డారు.

# చిరుగుల పంచె తనకు కొత్తబట్టలు భిక్షకునికి!



దీనదయాళ్



యజ్ఞనారాయణ

ఎరువు తెచ్చుకున్న ఏ సిద్ధాంతమైనా, తాత్త్వికత అయినా పేదలను దాటుకుని హృదయానికి చేరదు. ఇందుకు అక్షరాలా లక్ష ఉదాహరణలు చూపవచ్చు. మట్టి వాసన ఉన్న మనవైన జీవిత సత్యాల మాదిరిగా ఎరువు సిద్ధాంతాలు రక్తంలో ఇంకవు. పేదరిక నిర్మూలన, విశ్వశాంతి, సమసమాజం వంటి మాటలు, నినాదాలు ఒట్టి శుష్కవాదాలుగా మిగిలి, అపహాస్యానికి గురైనది అందుకే. అవేవీ ఇక్కడ నినదించినవారు ఆచరించలేదు. హృదయపూర్వకంగా స్వీకరించలేదు. సర్వేజనాఃసుఖినోభవంతు అన్న మనదైన భావనతో అవి తూగలేకపోయాయి. సోషలిజం, కమ్యూనిజం శ్రేణులలోనే హెచ్చుతగ్గులు సుస్పష్టం. ఆర్థికవ్యత్యాసాలు ఒక నిజం. ప్రపంచ కార్మికులారా అన్న బరువైన నినాదం పలుకుతున్న, రెండు ప్రధాన చీలిక ఎర్ర శిబిరాలు ఏకమయ్యే ఆలోచన మాత్రం ఆరు దశాబ్దాలుగా చేయడమే లేదు. కానీ నెత్తుటిలోనే సర్వేజనాఃసుఖినోభవంతు, లోకాః సమస్తాః సుఖినోభవంతు వంటి భారతీయమైన మూలసూత్రాలు నింపుకున్న యోగుల పరంపరలోని వారు దీనదయాళ్ ఉపాధ్యాయ. ఆయన చెప్పింది చేసి చూపించారు. సమాజంలోని అట్టడుగు మనిషిని కూడా మనం గమనంలోకి తీసుకోవడమే నిజమైన మానవధర్మం, అదే భారతీయత అని చాటిన మహనీయుడాయన. దీనిని సార్థక నామధేయుడైన ఆ జనసంఘ్ నేత నిజజీవితంలో ఎలా ఆచరించారో నిరూపించే ఒక ఉదంతాన్ని డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ గుర్తు చేసినప్పుడు సభాసదుల కళ్లు చెమర్చాయి. 1965 నాటి సభలలో ప్రతినిధిగా పాల్గొన్న జూపూడి హైమవతి ఈ సభలకు కూడా హాజరై దీనదయాళ్, తన భర్త, జనసంఘ్ నాయకుడు జూపూడి యజ్ఞనారాయణల చింతనలతో తాను ఎంతగా మమేకమైనారో నిరూపించుకున్నారు. ఇది కూడా ఒకరకమైన ఏకాత్మతే కదా! ఆ దంపతుల జీవితంలో జరిగిన ఈ మహత్తర ఉదంతాన్నే శివప్రసాద్ సభలో ప్రస్తావించారు.

దీనదయాళ్ ఒకసారి గుంటూరు పర్యటనకు వచ్చారు. తెలుగు ప్రాంతానికి వచ్చినప్పుడు గుంటూరు కార్యక్రమం ఉంటే తప్పనిసరిగా జూపూడి యజ్ఞనారాయణ ఇంటిలోనే ఆయన బస చేసేవారు. ఒక పర్యటన సందర్భంగా యజ్ఞనారాయణ ఇంటికి వచ్చారాయన. మేడ మీద ఉన్న దీనదయాళ్‌ను భోజనానికి ఆహ్వానించ డానికి ఇల్లాలు హైమవతి పైకి వెళ్లారు. అక్కడ దీనదయాళ్ ఒక పనిలో నిమగ్నమైపోయి ఉన్నారు. ఆమె కళ్లు చెమర్చాయి. చిరిగిన తన పంచెకు స్వయంగా సూది పట్టి కుట్లు వేసుకుంటున్నారు. హైమవతమ్మ గబగబా దిగివచ్చి, 'ఏమండీ! మీ నాయకుల పరిస్థితిని మీరు చూసుకోవాలి కదా! ఆయన చూడండి! చిరిగిన ధోవతికి కుట్లు వేసుకుంటున్నారు. మీరు తక్షణం వెళ్లి వారికి బట్టలు కొని తీసుకురండి' అని పురమాయించారు. మరుక్షణం యజ్ఞనారాయణ వెళ్లి కొత్తబట్టలతో వచ్చారు. అవి దీనదయాళ్ ముందు ఉంచి, 'వీటిని కట్టుకుంటే తప్ప మేం అంగీకరించం. ఇవి కట్టుకున్నాకే భోజనం చేయాలని మా మనవి' అని గట్టిగా విజ్ఞప్తి చేశారు. 'అందుకు అభ్యంతరం ఏమిటి?' అంటూ ఆ కొత్త బట్టలు ధరించి భోజనం చేశారు. మళ్లీ మేడ మీదకు వెళ్లి తను కుట్లు వేసుకున్న పంచెనే ధరించారు. బయటకు వెళ్లినప్పుడు బ్రాడీపేటలో ఒక బిచ్చగాడి చేతికి ఆ కొత్త బట్టలు ఇచ్చేశారు. యజ్ఞనారాయణ నొచ్చుకోకుండా ఎలా ఉండగలరు? 'మేం మీకు ఇస్తే ఇలా చేశారేమిటి?' అని అన్నారు. అందుకు ఆయన చెప్పిన సమాధానం- 'నేను కుట్లు వేసుకున్న పంచె మరొక ఆరు నెలలు పనికి వస్తుంది. కానీ అతడు గోచీతో ఉన్నాడు. కాబట్టి అతడికి ఇవ్వడం న్యాయం కదా!' అన్నారట. ఇది కదా 'సర్వేజనాఃసుఖినోభవంతు' అన్న సమున్నత భావనతో, తాత్త్వికతతో ఏకాత్మత అంటే! స్వతంత్ర భారతంలో అరవయ్యేళ్లు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇప్పుడొక చైతన్యం వచ్చింది. జాతి మేలుకొంటున్నది. చిరకాలం మరుగున ఉండిన ఆయన సిద్ధాంతానికి ఇప్పుడు వెలుగు వచ్చింది. అందుకే దీనదయాళ్ చిరంజీవి. భారతీయ ఆత్మతో కూడిన ఆయన సిద్ధాంతం అజరామరం.



## ఐదు వేళ్లు బిగిస్తే.. పిడికిలి

చేతికి ఐదువేళ్లు ఉన్నా, అవి ఒక్కలా ఉండవు. సమానం కాదు కూడా. కానీ పిడికిలిగా బిగిస్తే అవన్నీ శక్తికేంద్రాలే అవుతాయి. ఇది గమనించాలి. నాకు ఒకటే బాధ అనిపిస్తుంది. స్వతంత్ర భారతదేశంలో అవినీతి పెరిగిపోయింది. అవినీతి వల్ల మొదట నష్టపోయేది పేదవారు. ప్రతీదానికి లంచాలు, ఇతర మార్గాలు అంటే పేదవారికి అసాధ్యం. అది అవాంఛనీయం కూడా. కాబట్టి అవినీతి లేని సమాజం ఆవిర్భవించాలి. ఎవరు ఏ పని చేసినా, ఏ మాట చెప్పినా అందుకు సంబంధించినదే అయి ఉండాలి. లేకపోతే సమాజం మనుగడ సాగించలేదు.

**(1965 నాటి సమావేశాలలో ప్రతినిధిగా హాజరైన జూపూడి హైమవతి చెప్పిన ఈ నాలుగు మాటలు సభను కదిలించాయి. 92 ఏళ్ల ఆమె ఆవేదనతో ఆ మాటలు చెప్పారు. వీటిని ఎవరూ కాదనలేరు.)**



# కాలం కప్పిన పొరలను



రాజకీయ, ఆర్థిక, సామాజిక, పరిపాలనా శాస్త్రానికి సంబంధించి సిద్ధాంతాలు జనించడం ఇప్పటిది కాదు. కౌటిల్యుడు, అరిస్టాటిల్, ప్లేటో, మెకెయవెల్లి, మార్క్స్, హెగెల్, సెయింట్ సైమన్, రాబర్ట్ ఓవెన్, రూసో, ఓల్టేర్, మాంటెస్క్యూ, జీపాల్ సార్త్ వంటి వారంతా రాజకీయ సిద్ధాంతాలు, పరిపాలనా వ్యవస్థల గురించి సూత్రీకరణలు ప్రతిపాదించారు. ఇందులో మార్క్సిజం ప్రపంచాన్ని కబళించింది. కానీ వాటిలో చాలా వరకు ఒక వ్యవస్థ జాడ్యాన్ని నిర్మూలించడానికే పరిమితమయ్యాయి. ఒక ఉద్యమానికో, విప్లవానికో పరిమితమయ్యాయి. తరువాత అంతర్ధానమైనాయి. ఇవన్నీ కూడా ఏదో ఒక వర్గం వైపు మొగ్గి ఉన్నట్టే కనిపిస్తాయి. కానీ పారిశ్రామికీకరణ ముద్దుబిడ్డ పెట్టుబడిదారీ విధానం ఒక రాజ్యవ్యవస్థగా బలపడి వీటన్నిటినీ పక్కకు తోసేయగలిగింది. దానిని సవాలు చేసినది మార్క్సిజం. కానీ ఇవాళ ఆ రెండు సిద్ధాంతాల పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నకు

ఏకాత్మ మానవ దర్శనం రావడానికి ముందు, తరువాత దేశం పరిస్థితి ఏమిటి? అన్న అంశాల మీద మొత్తం ఆరు సదస్సులు జరిగాయి. వందల ఏళ్ల విదేశీ పాలనలోను, నాలుగున్నర దశాబ్దాల కాంగ్రెస్ ఏలుబడిలోను వలసవాద బుద్ధికే పరిమితమైన భారత్ ఏకాత్మ మానవ దర్శనాన్ని ఆశ్రయించిన బీజేపీ హయాంలలో జూలు విదిల్చింది. ఆ ప్రభుత్వాలు చెప్పినవి శుష్కవాదాలు కాదని ఫలితాలు రుజువు చేస్తున్నాయి. అధికార వికేంద్రీకరణ ద్వారా సాధ్యమైన అద్భుతాలను వక్తలు వెల్లడించారు.

**మొదటి సదస్సు**

**ఏకాత్మ మానవ దర్శనం – నేటి ఆవశ్యకత అన్న అంశం మీద బీజేపీ జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ప్రసంగించారు. ఏకాత్మ మానవ దర్శనం దృక్కోణం నుంచి భారత రక్షణ వ్యవస్థలు అన్న అంశం మీద అంతరిక్ష పరిశోధక శాస్త్రవేత్త, డీఆర్‌డీవో విశ్రాంత అధికారి డాక్టర్ జి. సతీశ్‌రెడ్డి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.**

దీనదయాళ్ ప్రతిపాదించిన ఏకాత్మ మానవ దర్శనం కేవలం ఒక పుస్తకం లేదా పత్రం కాదని, భారతీయ సమాజం యుగయుగాలుగా అనుసరిస్తున్న జీవన విధానమని, సనాతన సత్యాన్ని యుగానుకూలంగా ప్రదర్శించడమేనని, భగవద్గీతకు వివిధ భాష్యాల మాదిరి, దానిని దీనదయాళ్ ప్రస్తుత కాలానికి అనుగుణంగా అందించారని బీఎల్ సంతోష్ వ్యాఖ్యానించారు. భారతీయ సంస్కృతి నిరంతరమైనదని, ఆలోచన వేల సంవత్సరాలు ఆచరణలో ఉంటేనే నిలబడుతుందని అన్నారు. ఏకాత్మ మానవ దర్శనం సిద్ధాంతాన్ని బీజేపీ స్వీకరించిందని, ప్రధాని, 18 మంది ముఖ్యమంత్రులు దీనికి కట్టుబడి ఆచరిస్తున్నారని పేర్కొన్నారు. 1992లో బ్రిటిష్ ఎయిర్‌వేస్ ప్రచురించిన 'హిస్టో–మ్యాప్' ప్రకారం ప్రపంచంలో అంతరించిపోకుండా కొనసాగుతున్న రెండే రెండు నాగరికతలలో ఒకటి చైనా కాగా, రెండవది భారతీయ హిందూ సంస్కృతి అని గుర్తుచేశారు. మనది 'సనాతన' సంస్కృతి అని, దీనికి ఆద్యంతాలు లేవని తెలిపారు. ప్రధాని మోదీ చెప్పినట్లు 'బానిస మనస్తత్వం' నుంచి బయటపడాలని పిలుపునిచ్చారు. పాశ్చాత్య విజ్ఞానశాస్త్రాన్ని

# చీల్చుకొచ్చిన 'దర్శనం'



సమాధానం దొరకడం కష్టం. ఆ రెండు సిద్ధాంతాలలోను సామ్రాజ్యవాదం నిజం. ఆ రెండు వాదాలు ప్రపంచాన్ని ఒక సందిగ్ధ సంధ్యలో నిలబెట్టిన కాలంలో వచ్చినదే ఏకాత్మ మానవ దర్శనం. కానీ దాదాపు నాలుగున్నర దశాబ్దాలు మరుగున ఉన్న ఆ సిద్ధాంతం రాజ్యంలో మనిషిని మనిషిగా చూడమని చెప్పింది. మనిషిని యాంత్రికం చేయవద్దని, వారి ఆధ్యాత్మిక అవసరాలను గుర్తించాలని చాటింది. ఆ సిద్ధాంతాన్ని బీజేపీ నాయకత్వంలో కేంద్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు దాదాపు 18 ఏళ్లుగా ఆచరిస్తున్నాయి. ప్రధానులు ఇద్దరే కావచ్చు. భారత్ రూపురేఖలను వారు మార్చగలిగారు. ఏకాత్మ మానవ దర్శనం ఆచరణ ద్వారా సాధించిన ఫలితాలు ఎలా ఉన్నాయి? ఆ ఫలితాలను సమీక్షించడానికి ఏకాత్మ మానవ దర్శనం పుట్టి 60 ఏళ్లు గడచిన సందర్భంగా విజయవాడలో ఏర్పాటయిన రెండు రోజుల సమావేశాలు విశేష సమయం కేటాయించాయి.

స్వీకరించవచ్చు కానీ, పాశ్చాత్య జీవనశైలిని గుడ్డిగా అనుసరించకూడదని సంతోష్ హితవు పలికారు. జనవరి 1న నూతన సంవత్సరం జరుపుకోవడం వంటి ఆచారాలు మన ప్రకృతికి, సంస్కృతికి సంబంధం లేనివని, మన పండుగలు (సంక్రాంతి, దీపావళి) ప్రకృతితో ముడిపడి ఉంటాయని వివరించారు. భారతదేశం రాజులు, రాజ్యాలు లేనప్పుడు కూడా 'ధర్మం' ఆధారంగా నడిచిందని తెలిపారు. గుజరాత్‌లోని ఒక గ్రామంలో గత 137 ఏళ్లుగా ఒక్క పోలీస్ కేసు కూడా నమోదు కాలేదని, అక్కడ ధర్మమే రక్షణగా నిలిచిందని ఉదహరించారు. 'ఏకాత్మ మానవ దర్శనం ఇప్పటికీ సందర్భోచితం. భారతదేశ అతిపెద్ద పార్టీ దీన్ని సిద్ధాంతంగా స్వీకరించింది. ప్రపంచ సుస్థిరతకు సనాతన ధర్మం అవసరం. వ్యక్తి, సమష్టి (సమాజం), సృష్టి (ప్రకృతి), పరమేష్టి (పరమాత్మ) అనే నాలుగు అంశాల అనుసంధానమే ఏకాత్మ మానవ దర్శన సారం' అని వివరించారు. ప్రకృతి వనరులు మనిషి అవసరాలకు సరిపడా ఉన్నాయి కానీ, దురాశకు సరిపోవని మహాత్మా గాంధీ మాటలను గుర్తు చేశారు. పాశ్చాత్య దేశాలు ఆధిపత్యం కోసం చూస్తుంటే, భారతీయ సంస్కృతి అధికారాన్ని బాధ్యతతో కూడినదిగా చూస్తుందని తెలిపారు. మన ప్రార్థనలు కేవలం మనుషులకే కాకుండా, రెండు కాళ్ల జీవులకు, నాలుగు కాళ్ల జంతువులకు కూడా మేలు జరగాలని కోరుకుంటాయని, ఇదే నిజమైన భారతీయ జీవన విధానమని అన్నారు. 1964లో మొదటిసారి ఈ సిద్ధాంతం గురించి ఒక శిక్షావర్గలో దీనదయాళ్ చర్చించారని సంతోష్ చెప్పారు. ఇంకా 1965లో బొంబాయిలోని ఒక కళాశాలలో ఆ సిద్ధాంతం గురించి చర్చ జరిగిందని, ప్రశ్నలూ జవాబులూ కార్యక్రమం కూడా నిర్వహించారని గుర్తు చేశారు. తరువాత విజయవాడలో జరిగిన జనసంఘ్ 12వ వార్షిక సభలలో ప్రతిపాదించారని చెప్పారు. ఈ సిద్ధాంతం వేయేళ్ల తరువాత కూడా సమకాలీన సమస్యల పరిష్కారానికి ఉపకరిస్తుందని అన్నారు. ఇది నాగరికతకు మార్గదర్శి అని వ్యాఖ్యానించారు. అయితే దీనదయాళ్ తన సిద్ధాంతంలో కొత్తగా ఏదీ ప్రతిపాదించలేదని, అదంతా భారతీయమైన చింతన నుంచి స్వీకరించినదేనని సంతోష్ వెల్లడించారు.

ఏకాత్మ మానవ దర్శనం భారత భద్రత, రక్షణ ఉత్పత్తులపై కొత్త వెలుగును ప్రసరించిందని డాక్టర్








సత్యకుమార్ యాదవ్, బీఎల్ సంతోష్ , జి. సతీశ్‌రెడ్డి

సతీశ్‌రెడ్డి తెలియచేశారు. స్వదేశీ పద్ధతులలో రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోని దేశం, ముప్పును ఎదుర్కొనక తప్పదని అన్నారు. ఆ సిద్ధాంతంలో స్వదేశీ, వికేంద్రీకరణ కీలక అంశాలు కావడం వల్లనే ఎన్నో ప్రత్యేకతలు వచ్చాయని, భారత్‌కు అవి ఎంతో ఉపకరించాయని చెప్పారు. ఆయన చెప్పిన ఇంకొన్ని అంశాలు: పారిశ్రామికీకరణ అంతా కేంద్రీకృతం కాకుండా పెద్ద, మధ్య, చిన్న తరహా పరిశ్రమలుగా ఆ రంగం ఉండాలి.

ఏ దేశమైనా సొంత ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తుంది. దేశంలోనే అన్నీ ఉత్పత్తి చేసుకోవాలని 1941లో అమెరికా కూడా నిర్ణయించింది. దీని మీద కాంగ్రెస్‌లో పెద్ద చర్చ జరిగింది. కానీ కొంతకాలం విదేశాల నుంచి దిగుమతులు చేసుకున్నా మళ్లీ సొంత దేశంలోనే ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇచ్చింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చే నాటికి రక్షణ రంగంలో చెప్పుకోవడానికి మనదంటూ ఏం లేదు. 1750 వరకు ప్రపంచంలోని పారిశ్రామిక ఉత్పత్తులలో 24 శాతం ఉన్న మన ఉత్పత్తులు 1947 నాటికి కేవలం 4 శాతం మాత్రమే. రక్షణ రంగమైతే పూర్తిగా దిగుమతుల మీదే ఆధారపడి ఉంది. మన దేశంలో రక్షణ ఉత్పత్తులు చేయాలన్న ఆలోచన కూడా లేదు. డీఆర్‌డీవోను స్థాపించారు, నిజమే. కానీ ఆ సంస్థ అసలు ఉద్దేశం–బయట నుంచి దిగుమతి చేసుకో దలిచిన ఉత్పత్తుల ప్రమాణాలను పరీక్షించడమే. 1965 నాటికి దేశంలో కొన్ని రక్షణ ఉత్పత్తులు చేసుకోవాలని ఆలోచన వచ్చింది. హొమీ జె బాబా వంటివారు అందుకు పూనుకున్నారు. క్షిపణులు, యుద్ధ ట్యాంకులు వంటివి చేసి విజయం సాధించ గలిగారు. అయినా కూడా 2014 వరకు విదేశాల నుంచి ఆయుధాలు దిగుమతి చేసుకొనే దేశాలలో మనదే అగ్రస్థానం. అలాంటి సమయంలోనే నరేంద్ర మోదీ ప్రధాని బాధ్యతలు చేపట్టి శంఖారావం పూరించారు. ఇలాంటి భారతావనికి తాను ప్రధానిఉండాలని అనుకోవడం లేదని అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా ' పిలుపునిచ్చారు. దీనితో ఏజెంట్లు ముందుకు వచ్చారు. తరువాత బయట దేశాల వారు వచ్చారు. తరువాత దశలో మన శాస్త్రవేత్తలు కూడా తగిన పరిజ్ఞానాన్ని పొంది మనమే అన్నీ ఉత్పత్తి చేసుకోవాలని మోదీ కల్పన చేశారు. 2016లో ఆయన మమ్మల్నందరినీ పిలిచారు. ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి పరచే ప్రయోగం ఒకటి చేయాలన్నారు. పక్కనే అజిత్ ధోవల్ కూడా ఉన్నారు. నిర్దేశించుకున్న ఉపగ్రహాన్ని నిర్దేశించుకున్న ప్రదేశంలో కొట్టగలగాలి. అందులో విజయం సాధించాం. సాంకేతిక పరిజ్ఞానంలో భారత్ ప్రపంచంలోనే నాల్గవ స్థానంలోకి వచ్చింది. ఆ తరువాత మరొక మహోన్నత పిలుపు వచ్చింది– 'ఆత్మ నిర్భర భారత్'.

అప్పటి వరకు భారత్ సొంతంగా నిర్మించుకున్న తుపాకులు లేవు. ఆ లోటు తీర్చుకోవాలన్నారు మోదీ. అది కూడా సాధ్యమై, గణతంత్ర వేడుకలో ప్రత్యక్ష మయింది. బ్రహ్మోస్ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారయింది. ఆ సూపర్ సోనిక్ క్షిపణినే ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించారు. ఒక ఇంటిలో ఉగ్రవాదులు దాగుంటే, దాని పక్క ఇంటికి కూడా హాని చేయకుండా సరిగ్గా లక్ష్యాన్ని తాకగల సామర్థ్యం దానికి ఉంది. తేజస్ విమానం, విమానాలను నిలిపే ఓడ కూడా తయారు చేసుకున్నాం. న్యూక్లియర్ సబ్‌మెరీన్‌లు కూడా నిర్మించుకున్నాం. ఇతర దేశాల క్షిపణులు మన దేశం మీదకు దాడికి వస్తుంటే ఆకాశంలోనే నిలిపే వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం.

మోదీ వికేంద్రీకరణకు కూడా పిలుపునిచ్చారు. చాలాకాలం దేశంలో రక్షణ రంగ ఉత్పత్తులు కొద్ది పరిశ్రమల ద్వారానే జరిగేవి. అవైనా చిన్నచిన్న పరికరాలు. దీనిని విస్తరించాలన్నారు ప్రధాని. ఈ రోజు మొత్తం పది సంస్థలు ఉత్పత్తులు చేపట్టాయి. క్షిపణులు, ట్యాంకులు కూడా ఉత్పత్తి చేస్తున్నాయి. ఉత్తర ప్రదేశ్, తమిళనాడులలో డిఫెన్స్ కారిడార్‌లు వచ్చాయి. రక్షణ ఉత్పత్తులు చేసే 20,000 పరిశ్రమలు వచ్చాయి. 2014లో దేశంలో రక్షణ ఉత్పత్తులు 23 శాతం. ఇప్పుడు 65 శాతం. దేశంలోనే ఉండి పనిచేయాలన్న తత్త్వం ప్రజలలో వచ్చింది. గతంలో 75 శాతం భారతీయ నిపుణులు విదేశాలకు వెళ్లేవారు. ఇప్పుడు 75 శాతం ఇక్కడే ఉండి పనిచేస్తున్నారు. దేశంలో ఈ రంగంలో పనిచేసే రెండు లక్షల స్టార్టప్‌లు వచ్చాయి. ఇందులో యువతదే ఎక్కువ భాగం.

తరువాత మోదీ మరొక పిలుపునిచ్చారు. అది–మన రక్షణ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌లో విక్రయించాలి. అది మొదలయింది. ప్రస్తుతం రూ. 23,666 కోట్ల విలువైన ఎగుమతులు జరుగు తున్నాయి. అవి రెట్టింపు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆశిస్తున్నారు.

**రెండవ చర్చా కార్యక్రమం**

**'భౌగోళిక రాజకీయాలు– ఏకాత్మ మానవ దర్శనం' అన్న అంశంతో మొదలయింది. ఈ అంశాన్ని బీజేపీ నాయకుడు వారణాసి రామ్‌మాధవ్**



**తీసుకున్నారు. రెండో భాగం భాష-సంస్కృతి ఏకాత్మ మానవ దర్శనం. ఈ అంశం మీద ప్రాంత ప్రచారక్ విజయాదిత్య ప్రసంగించారు. కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.**

'భారతదేశం 1947లోనే ఆవిర్భవించిందని భావించరాదు. భారత్ అంటే కొన్ని వందల ఏళ్ల నాగరికత కలిగిన దేశం. ఆ నాగరికత ప్రభావం చాలా దేశాల మీద, ప్రాంతాల మీద కూడా ఉంది. దీనినే ఉపఖండం, దక్షిణ ఆసియా అని పిలుస్తున్నారు. వీరంతా కలసి ఉండాలని దీనదయాళ్ ఉపాధ్యాయ ఆకాంక్షించారు' అని గుర్తు చేశారు రామ్‌మాధవ్. భారత్ అంటే భౌగోళికంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న కేంద్రంలో ఉన్నదని చెప్పారాయన. ఇంకా: పాకిస్తాన్ ఏర్పాటు అసహజమైనది. అంటే దీని అర్థం ఆ దేశాన్ని రూపుమాపాలని కాదు. హిందువులు, ముస్లింలు కలసి జీవించలేరన్న ఒక దృష్టితో పాకిస్తాన్‌ను ఏర్పాటు చేశారు. అది తప్పు అన్నారు దీనదయాళ్. అవిభాజ్య భారతదేశంలో అనేక వర్గాలు, తెగలు, జాతులు ఉన్నాయి. వారంతా కలసి ఉండడమే సబబు అని దీనదయాళ్ భావన. భారత దేశ అభివృద్ధి అంటే పొరుగు దేశాల అభివృద్ధి కూడా. ఇంగ్లిష్‌లో రెండు ప్రయోగాలు ఉన్నాయి. ఒకటి ఎల్డర్ బ్రదర్. రెండు బిగ్ బ్రదర్. మనం ఉండాల్సింది ఎల్డర్ బ్రదర్ తీరులోనే. అందుకే నరేంద్ర మోదీ పొరుగుకు మొదటి ప్రాధాన్యం అన్నారు.

చైనా సంబంధాల విషయంలో నెహ్రూ తప్పు చేశారన్నదే దీనదయాళ్ నిశ్చితాభిప్రాయం. చైనాతో వ్యవహారం అంటే కేవలం మాటలతో కూడిన దౌత్యమే సరిపోదు. ఆ దేశంతో సమానమైన సైనిక పాటవం ఉంటేనే సాధ్యం. ఇవి కూడా దీనదయాళ్ అభిప్రాయాలే. చైనా విషయంలో ఆయన దృక్పథం కాలపరీక్షకు నిలిచింది. మనం కూడా సైనిక పాటవం సాధించిన తరువాత మాత్రమే చైనా వెనక్కి తగ్గింది.

అలీన విధానం గురించి దీనదయాళ్ దృక్పథం చాలా నిర్మాణాత్మకమైనది. 1965 ప్రాంతంలో ప్రచ్ఛన్న యుద్ధం పరాకాష్టకు చేరిన కాలంలో భారత్ అలీన ఉద్యమాన్ని ఆశ్రయించింది. ఏ రాజ్యకూటమి లోనూ (అటు అమెరికా, ఇటు సోవియెట్ రష్యా) చేరరాదన్నది విధానంగా ఎంచుకున్నది. ఏ కూటమి లోను చేరరాదన్నది తప్పు పట్టవలసినది కాదన్నది నిజమే. అలా అని నిష్క్రియాపరత్వం సరికాదన్నదే దీనదయాళ్ వాదన. ఇది ఏకాత్మ మానవ దర్శన సూత్రమే. కానీ ఈనాడు భారత్ ప్రపంచంలోని చాలా దేశాలతో సత్సంబంధాలను కలిగి ఉంది. అంతర్జాతీయ సమస్యల మీద మోదీతో చర్చించే ఒక వాతావరణం ప్రపంచంలో ఏర్పడింది. నిజానికి ఇవాళ ప్రపంచ దేశాలు, చాలా వ్యవస్థలు మారుతు న్నాయి. అయినా భారత్ తనదైన ఉనికిని చాటుకో గలుగుతున్నది. దీనికి స్ఫూర్తి ఏకాత్మ మానవ దర్శనం. వికసిత భారత్ అనే గొప్ప మార్గాన్ని దీనదయాళ్ మన తరం కోసం సిద్ధం చేసి పెట్టారు.

17వ శతాబ్దం ఆరంభం వరకు కూడా భారత్ విశ్వగురు స్థానంలోనే ఉన్నది. అదొక ఆర్థిక శక్తి. అయితే ఆనాడు ఏకాత్మ మానవ దర్శనం లేదు. తరువాత ఎప్పుడో దీనదయాళ్ ఒక ధార్మిక, సామాజిక జీవన సారాన్ని ఏకాత్మ మానవ దర్శనంగా పరిచయం చేశారు' అన్నారు.

రెండో కాలాంశాన్ని తీసుకున్న ప్రాంత ప్రచారక్ ఆదిత్య. ఆనాడు ఏ తత్త్వం భారత జన మానసాలలో ఉన్నదో అది ప్రపంచాన్ని ఏలిందని చెప్పారు. దానినే దీనదయాళ్ ఒక రాజకీయ సామాజిక సిద్ధాంతంగా మలిచారని తెలిపారు. ఆదిత్య తన ప్రసంగంలో ఇంకా ఈ విషయాలు వెల్లడించారు...భారతీయుల మానసాలలో ఎలాంటి చింతన ఉన్నదో, శాంతి సౌభాగ్యాలను నిలిపిందో దానినే దీనదయాళ్ కాలానుగుణమైన ఒక రాజకీయ తాత్త్వికతగా మలిచి అందించారు. ఒకనాడు ఇక్కడ ఉన్న సిద్ధాంతానికే ఆధునిక దృష్టిని రంగరించారు, వ్యాఖ్యానించారు. ఇది సామాన్య జనం ఆచరణ నుంచి ఆవిర్భవించింది. ఇది ఇవాల్టి ప్రాపంచిక సమస్యలన్నింటికీ పరిష్కారం చూపగలదు. కలసి సాధించడం, నడవడం అనే ధోరణి ఎంతోకాలంగా ఇక్కడ ఉంది. ఇందుకు ఉదాహరణ ఇంత క్రితం వక్తలు చెప్పిన మాటలలో ఉంది. గుజరాత్‌లోని ఒక గ్రామంలో 137 ఏళ్ల నుంచి ఒక్క పోలీసు ఫిర్యాదు కూడా లేదు. ఇది అంతా కలసి సాధించినది. ఇప్పుడు శాస్త్రవేత్తలు ప్రకృతిలోని చాలా విషయాలను గమనించి విస్తుపోతున్నారు. అవన్నీ ఒకనాడు మన దేశంలోని సాధారణ కుటుంబికులకు కూడా తెలిసినవే. మొక్కలకు ప్రాణం ఉందన్నారు జగదీశ్ చంద్రబోస్. ఇది విని మీరు విస్తుపోతున్నారు కానీ, మొక్కలు నిద్రిస్తాయన్న సంగతి మా అమ్మకు, అమ్మమ్మకు కూడా తెలుసు అన్నారాయన. జేసీ బోస్ చిన్నతనంలో ఒక సంఘటన జరిగింది. ఆయన రాత్రివేళ బంతితో ఆడుతున్నారు. అది వెళ్లి మొక్కల మధ్య పడింది. ఆ బంతిని తెచ్చుకోవడానికి జేసీ బోస్ వెళుతుంటే, ఆయన మాతృమూర్తి వారించారు. రాత్రి మొక్కలు నిద్ర పోతాయి. నిద్రాభంగం చేయడం తప్పు అని చెప్పారు. మొత్తం సృష్టిలో వైవిధ్యం ఉంది. ఒకరి కష్టం అంటే భూమండం మొత్తానికి వచ్చిన కష్టంగా చూడాలి. ఏకాత్మ మానవ దర్శనం మాతృ భాషలను మన్నించమని చెబుతుంది. కేంద్రం తీసుకు వచ్చిన కొత్త విద్యా విధానంలో ప్రాంతీయ భాషలకు విలువ ఇవ్వాలని భావించారంటే అందుకు ఏకాత్మ మానవ దర్శనం ఇచ్చిన ప్రేరణే కారణం.

**మూడో కాలాంశం-**

**ఆత్మ నిర్భర భారత్- ఏకాత్మ మానవ దర్శనం. ప్రముఖ బీజేపీ నాయకుడు మురళీధరరావు ఈ అంశం మీద చక్కని సమాచారం అందించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ ఎంపీ పాకా సత్యనారాయణ అధ్యక్షత వహించారు.**

ఏకాత్మ మానవ దర్శనం అనే గొప్ప చింతనను ఒక్క భారత్ మాత్రమే కాదు, యావత్ప్రపంచం స్మరించుకోవలసిన సందర్భంలో మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం అంటూ మురళీధరరావు ఉపన్యాసం ప్రారంభించారు. బీజేపీ అంటే సిద్ధాంతం ఆధారంగా పనిచేస్తుంది. అధికారంలో లేకున్నా సిద్ధాంతంతోనే ఉంటుంది. కానీ ఇలాంటి సిద్ధాంతంతో ముందుకు వెళ్లాలంటే సాధ్యం కాదు, ప్రభుత్వంలోకి రావడం కల్ల అన్న అభిప్రాయాలూ అనుమానాలూ గట్టిగా వినిపించిన కాలం ఉంది. అలాంటి నేపథ్యంలో బీజేపీలో పనిచేయడం ఎంత కష్టమో ఆలోచించాలి అన్నారాయన. ఇలా సాగింది ఆయన ఉపన్యాసం:

1965లో దీనదయాళ్ ఏకాత్మ మానవ దర్శనాన్ని ప్రతిపాదించిన సమయంలో వాదాలు ఒకదానితో ఒకటి సంఘర్షించుకుంటున్నాయి. కమ్యూనిజమే





శ్రీనివాసవర్మ , వారణాసి రామ్‌మాధవ్, ఆదిత్య



మురళీధరరావు, పాకా సత్యనారాయణ

శాశ్వత సిద్ధాంతమని కొందరు నమ్మారు. చాలా దేశాలలో, మన దేశంలో, నిజాం వ్యతిరేక పోరాటంలో, శ్రీకాకుళంలో ఆ పేరు గట్టిగానే వినిపించింది. కానీ ఇవాళ ఆ పేరే అంతర్థానమై పోయింది. సోవియెట్ రష్యా పతనం సమీపంలోనే ఉందని 1986లో దత్తోపంత్ ఠేంగ్డీ అంచనా వేశారు. ఆయన మాటలకు అంతా విస్తుపోయారు. చైనాలో అమలులో ఉన్నది పేరుకు కమ్యూనిజం. ఈ పరిణామాలన్నిటి కంటే చాలా ముందే అసలు కమ్యూనిజమే కాదు, సామ్యవాదం, పెట్టుబడిదారీ విధానం కూడా కాలగర్భంలో కలసి పోవడం తథ్యమని చెప్పారు దీనదయాళ్. వాటికి ప్రత్యామ్నాయంగా భారతీయ సిద్ధాంత పరంపర ఆధారంగా, మన సంప్రదాయం సంస్కృతి పునాదిగా ఏకాత్మ మానవ దర్శనం ప్రతిపాదించారు. నెహ్రూ, రామమనోహర్ లోహియా వంటి ఉద్దండులు తమ తమ రాజకీయ సిద్ధాంతాలను బలంగా నమ్ముతున్న సమయంలోనే ఏకాత్మ మానవ దర్శనం వెలువడింది. వాస్తవంగా మన పూర్వికులు ప్రవచించిన విశ్వాసాలనే ఆయన రాజకీయ సిద్ధాంతంగా మలిచారు. ప్రపంచీకరణ, డబ్ల్యుటీవో అనివార్యమని అంతా చెబుతున్న సమయంలోను ఠేంగ్డీ ఆ మాటను నిరాకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన 1947లో, జనసంఘ్ స్థాపించిన 1951లో ఒకటే చెప్పాం. ఆత్మనిర్భరత మనకి ముఖ్యం. స్వావలంబన ప్రధానం. నాలుగైదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇదే చెబుతున్నారు. దేశీయమైన రక్షణ ఉత్పత్తులు విశేషంగా పెరిగాయి. సార్వభౌమాధికారాన్ని స్వదేశీ రక్షణ పాటవంతోనే రక్షించుకోగలం. రక్షణరంగ ఉత్పత్తుల సంగతి అటుంచి, 1965లో యుద్ధం వస్తే ఆహార పదార్థాలే లేవు. దేశ ప్రజలు ఉపవాసాలు చేయాలంటూ నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి పిలుపునిచ్చారు. కానీ ఈ రోజు దేశంలో ఆహార ధాన్యాలు మిగులులో ఉన్నాయి. ఆత్మ నిర్భరత వల్ల ఇది సాధ్యమైంది. అసలు మన ఆత్మ నిర్భరత, మన స్వావలంబన ప్రపంచానికి మేలు చేస్తాయి. 140 కోట్ల ప్రజలు ఉన్న మన దేశమే ఆహార ధాన్యాల దిగుమతి మొదలు పెడితే మిగిలిన దేశాల పరిస్థితి ఏమిటి? ఆత్మ నిర్భరత ట్రంప్ వంటి వాళ్ల వ్యూహాలకు కూడా సమాధానం చెప్పగలదు. మన సమాజంలో శాంతికి, సుస్థిరతకి, సౌభాగ్యానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకి, నాటి స్వాతంత్ర్య పోరాట ఫలితాన్ని రక్షించుకోవడానికి ఆత్మ నిర్భరత అత్యవసరం. ఇప్పుడు ప్రపంచం భారత నమూనాను ఆసక్తిగా పరిశీలిస్తున్నది. కొనసాగగల లేదా నిలకడైన పురోగతికి మూలం ఆత్మనిర్భరత. దోపిడీ లేని దేశం కావాలంటే, సజీవమైన దేశం మనం చూడాలంటే ఆత్మనిర్భతతో సాధ్యం.

**నాలుగో చర్చకు అంశం-**

**ఆర్థిక సమృద్ధి- వికేంద్రీకరణ. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఆంధ్రప్రదేశ్ శాఖ మాజీ అధ్యక్షురాలు పురందేశ్వరి, ఈ చర్చా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇద్దరు ప్రముఖులు ప్రొఫెసర్ కనగ సభాపతి, కస్తూరి రాకా సుధాకరరావు వక్తలుగా పాల్గొన్నారు. జనవరి 24వ తేదీన జరిగిన కార్యక్రమాలలో ఇది మొదటిది.**

ఏకాత్మ మానవ దర్శనం ప్రపంచ శ్రేయస్సును కోరే సిద్ధాంతంగా ఆవిర్భవిస్తుందని నమ్ముతూ, అందుకు కనిపిస్తున్న రుజువులను సమీక్షించుకుంటూ బీజేపీ అభిమానులు విజయవాడలో సమావేశాలు జరుపుకుంటున్న సమయంలోనే దావోస్‌లో ఎకనమిక్ ఫోరమ్ సభలు కూడా జరిగాయి. కమ్యూనిజం, సోషలిజం, పెట్టుబడిదారీ విధానం వంటి ఇజాలన్నీ










**విజయవాడ సభలలో మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. 1965 నాటి జాగృతి వారపత్రిక నుంచి తీసుకున్న క్లిప్పింగ్స్‌తో వెలువరించిన పుస్తకం, ఆనాటి సభల తరువాత ముద్రించిన స్మరణికను మరొకసారి ముద్రించి, వెలువరించారు. వజ్రోత్సవం సందర్భంగా జాగృతి వెలువరించిన ప్రత్యేక సంచికను (19-25 జనవరి 2026) కూడా ఆవిష్కరించారు.**




**కనగసభాపతి, పురందేశ్వరి, కస్తూరి రాకాసుధాకరరావు**

చతికిల పడ్డాయని మనం చెప్పుకుంటున్న సమయం లోనే దావోస్ ఎకనమిక్ ఫోరమ్ నుంచి ఒక మాట వినిపించింది. 1990 దశకంలో ప్రపంచాన్ని కలవర పెట్టిన ప్రపంచీకరణ సిద్ధాంతం డొల్ల మాత్రమేనని, అది విఫలమైందని అమెరికా వాణిజ్య మంత్రి హెూవర్డ్ లుట్నిక్ ప్రకటించారు. అప్పుడు వాటిని రుద్దడానికి ప్రయత్నించిన దేశాల ఏలికలే ఆ మాట బాహాటంగా చెబుతున్నారు. ఈ విషయాన్ని విజయ వాడ సభల దృష్టికి తెస్తూ కనగ సభాపతి తన ప్రసంగం ఆరంభించారు. ఆయన ప్రసంగంలోని కొన్ని అంశాలు :

దీనదయాళ్ తన సిద్ధాంతాన్ని ఆవిష్కరించి నప్పుడు మూడో సిద్ధాంతానికి చోటు లేదనే అంతా భావించారు. అవి కమ్యూనిజం లేదా కేపిటలిజం. నెహ్రూ సోషలిజం వైపు మొగ్గారు. అది పాశ్చాత్య దేశానిది. ఏకాత్మ మానవ దర్శనం అంటే మనదైన నాగరికత, మనదైన ఆర్థిక చరిత్ర సారం కలిపి రూపొందించినది. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత జీడీపీ 32.9 శాతం. స్వతంత్ర భారతదేశం తొలి రోజులలో ఆ జీడీపీ కేవలం 4 శాతం. 1765–1900 మధ్య భారతదేశం నుంచి రూ 6.84 లక్షల కోట్ల సంపద తరలిపోయింది. ఇంత సంపదను సృష్టించుకోవడానికి కారణం వికేంద్రీకరణ. మన పూర్వులు మనకు పొదుపును వరంగా ఇచ్చారు. 1947 నాటికి దేశంలో సగం దారిద్ర్య రేఖ దగ్గరే ఉన్నారు. అయినా ఆనాడు ఉన్న పొదుపు 9 శాతం. అంటే తరువాతి తరం కోసం వారు పడిన తపన ఇది తెలియచేస్తుంది. ఆ పొదుపు మొత్తం 30 ఏళ్లలో (స్వాతంత్ర్యం వచ్చాక) 15 శాతానికి పెరిగింది. కాబట్టే దీనదయాళ్ మన దేశ అభివృద్ధికి మనదైన పంథానే అనుసరించాలని గాఢంగా ఆకాంక్షించారు. ఎలాంటి చదువు లేకుండానే, చిన్న చిన్న పెట్టుబడులతో అంతర్జాతీయ మార్కెట్ స్థాయికి చేరిన సాధారణ ప్రజల గురించి కనగసభాపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు.

ఆర్థిక అంశాలను వికేంద్రీకరించాలన్నదే దీనదయాళ్ ఏకాత్మ మానవ దర్శనం ప్రధాన సూత్రమని, విదేశీ పెట్టుబడులపై నియంత్రణ ఉండాలని ఆయన చెప్పారని, ప్రభుత్వ పెట్టుబడిదారి విధానాన్ని పూర్తిగా నిరాకరించారని కస్తూరి రాకా సుధాకరరావు చెప్పారు. ఉద్యోగాలను తొలగించే పారిశ్రామికీకరణకు దీన దయాళ్ వ్యతిరేకి, సగటు ప్రజలు, వారి దక్షత, సృజన ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని ఆయన తమ సిద్ధాంతంలో పేర్కొన్నారని తెలియచేశారు. పలు గ్రంథాలు రచించిన దీనదయాళ్ 'టు ప్లాన్స్' (రెండు ప్రణాళికలు) అన్న పుస్తకం రాశారని, అంతా చదవదగిన పుస్తకమని రాకా చెప్పారు. సోవియెట్ నమూనా ప్రణాళికా వ్యవస్థను భారతదేశంలో అమలు చేయదలచిన నెహ్రూ ఏ విధంగా విఫలమైనది అందులో విశ్లేషించారని తెలియచేశారు. నిరక్షరాస్యులు, సర్వసాధారణమైన ప్రజలలో ఎంత గొప్ప వ్యాపార దక్షత ఉంటుందో తెలియచేసే పలు ఉదాహరణతో రాకా ఉపన్య సించారు. కొన్ని అంశాలు:

సగటు మనిషి లేదా సమాజంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధే దీనదయాళ్ ఆలోచన అంతటికీ కేంద్ర బిందువు. వికేంద్రీకరణతోనే అందరి శ్రేయస్సు

## మేనమామకో ఉత్తరం

అత్యంత సాధారణ కుటుంబం నుంచి వచ్చారు దీనదయాళ్ ఉపాధ్యాయ. ఆయన జీవితాన్ని ఆర్ఎస్ఎస్‌కు అంకితం చేసిన సమయంలో తన మేనమామకు ఒక లేఖ రాశారు. అందులో ఆయన రాసిన ఒక అంశం చిరస్మరణీయమైనది. మునిగిపోవడమే తరువాయి అన్న తీరులో అస్తవ్యస్థంగా ఉన్న సమాజంలో పునరుత్తేజం తేవడానికి ఉపయోగపడే గొప్ప ఆవిష్కరణ వారు చేశారు. అదొక చిన్న కథ వంటిదే. డాక్టర్ వడ్డి విజయసారథి ముగింపు కార్యక్రమానికి ముందు దీనదయాళ్ గురించి నాలుగు మాటలు చెప్పారు. అందులో ఇది ఒకటి.

గొప్ప నిధిని పట్టుకుని ఒక వ్యక్తి పడవ ఎక్కాడు. కొంతదూరం ప్రయాణించిన తరువాత పడవలోకి హఠాత్తుగా నీరు రావడం మొదలయింది. రాను రాను పడవకు ప్రమాదం పెరుగుతున్నది. అప్పుడు ఆ గొప్ప నిధిని ఎక్కడ దాచగలడు? ఎలా రక్షించగలడు? భుజం మీద పెట్టుకుంటాడా? నెత్తి మీద ఉంచుకుంటాడా? లేదంటే అంగీ వెనుక దాస్తాడా? నిజానికి ఆ ఆలోచనలేవీ ఆ సమయంలో ఆ నిధిని రక్షించగలిగేందుకు ఉపకరించేవి కావు. నిధిని తప్పక రక్షించుకోవాలంటే ఒక్కటే మార్గం ఉంది. పడవలోకి నీరు రాకుండా ఆపడమే. అందుకు తగ్గ చర్యలకు ఉపక్రమించడమే. ఇప్పుడు దేశంలో జరగవలసినది కూడా అదే అని ఈ కథ ద్వారా పండిత్ దీనదయాళ్ తన మేనమామకు తెలియచేశారు.



డాక్టర్ వడ్డి
విజయసారథి





సీఎం రమేశ్, అతుల్ జైన్, రాఘవకృష్ణ

సాధ్యమవుతుంది. తూర్పు గోదావరి జిల్లా కడియం, దాని పరిసరాలలోని మరొక 11 గ్రామాల ప్రజలు మొక్కల పెంపకం, అమ్మకం (నర్సరీ) వ్యాపకంగా చేసుకున్నారు. వాళ్లు చదువుకున్నవారు కాదు. కానీ 3500 ఎకరాలలో నర్సరీలు పెంచుతున్నారు. వాళ్ల దగ్గర నుంచి మొక్కలు ప్రపంచ దేశాలకు ఎగుమతి అవుతాయి. 20,000 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారు.వాళ్ల దగ్గర ఎంబీఏలు కూడా పనిచేస్తున్నారు. వారి కుటుంబాలలోని కుర్రాడు పాఠశాల నుంచి సాయంత్రం వచ్చి, జాతీయ రహదారి పక్కన నిలబడి పూలు అమ్ముతాడు. తన చదువుకు తానే డబ్బు సంపాదించుకుంటున్నాడు. ఈ నర్సరీల మీద నివేదికలు వచ్చాయి. కానీ అవి కీలకమైన అంశాలేవీ ఇవ్వకుండా వాళ్ల కష్టాలను ఏకరువు పెట్టాయి. అక్కడ ఎకరాకు రూ. 8 లక్షలు పెట్టుబడి పెడితే రూ 20 లక్షలు లాభం వస్తుంది.

మహారాష్ట్రలోని సాంగ్లీకి సమీపంలో ఇచ్చాల్ కరంజీ అనే ఊరు ఉంది. అక్కడి జనాభా 3 లక్షల 30 వేలు. ఆ ఊరు 9 గజాల చీరలకు ప్రసిద్ధి. దానికి మాంచెస్టర్ ఆఫ్ మహారాష్ట్ర అన్న పేరు. ఇక్కడి చీరల వ్యాపారంలో సంవత్సరానికి జరిగే లావాదేవీలు రూ. 150 కోట్లు. ఇందోర్ రాణి అహల్యాబాయి హోల్కార్ మహేశ్వరి చీరల పరిశ్రమను ప్రోత్సహించారు.

1980 రాజస్తాన్‌లో నాటి ముఖ్యమంత్రి భైరాన్‌సింగ్ షెకావత్ మొదటిసారి అంత్యోదయ పథకం ప్రవేశపెట్టారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది. దానికి ప్రేరణ దీనదయాళ్ సిద్ధాంతమే.

ధర్మార్థకామమోక్షాల మధ్య ఉండే మనిషి జీవితానికి కేవలం ఆర్థిక అవసరాలే ఉండవని, బుద్ధికి, శరీరానికి బలం చేకూర్చాలని ఈ చర్చకు అధ్యక్షత వహించిన పురందేశ్వరి అన్నారు. దేశ అభివృద్ధి అరువు తెచ్చుకున్న సిద్ధాంతాలతో సాధ్యం కాదని మన పరంపర నుంచి వచ్చిన విధానాలతోనే సాధ్యమని దీనదయాళ్ భావించారని ఆమె అన్నారు.

**ఐదో చర్చా కార్యక్రమం-**

**'కొనసాగగల అభివృద్ధి లక్ష్యాలు- ఏకాత్మ మానవ దర్శనం' అనే అంశం మీద జరిగింది. దీనదయాళ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ సంచాలకుడు అతుల్ జైన్, రాఘవకృష్ణ వక్తలుగా పాల్గొన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అధ్యక్షత వహించారు.**

నరేంద్ర మోదీ తీసుకున్న కొన్ని ప్రధాన పథకాలకు మూలం దీనదయాళ్ సిద్ధాంతమేనని అతుల్‌జైన్ పేర్కొన్నారు. స్వచ్ఛభారత్, అంత్యోదయ ఆ సిద్ధాం తంలో భాగమేనని గుర్తుచేశారు. పోషణ్ అభియాన్ కూడా ఆ సిద్ధాంతం ప్రేరణతో తీసుకున్నదే నని తెలియచేశారు.

ఏదైనా కొనసాగగలిగితేనే వికాసానికి అవకాశం ఉంటుందని రాఘవకృష్ణ అన్నారు. ఏకాత్మ మానవ దర్శనం అర్థం కావాలంటే మనిషికీ ప్రకృతికీ మధ్య ఉన్న బంధం అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

**ఆరో చర్చ -**

**'ఏకాత్మ మానవ దర్శనంలో రాజకీయ సాంస్కృతిక కోణాలు' పై ఆచార్య బి. సారంగపాణి, వినయ్ సహస్రబుద్ధే మాట్లాడారు. సోము వీర్రాజు అధ్యక్షత వహించారు. ఇది చివరి కాలాంశం. అయినా సభా ప్రాంగణమంతా నిండుగానే ఉంది. జరిగినవన్నీ గహనమైన అంశాలపై ప్రసంగాలు. అయినా ప్రతినిధులలో ఉత్సాహం తగ్గలేదు. భారత్‌మాతాకీ జై అంటూ, వందేమాతరం అంటే నినాదాలు చేస్తూనే ఉన్నారు. సరిగ్గా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రతినిధుల నిబద్ధతను శ్లాఘిస్తూ రచయిత, మేధావి వినయ్ సహస్రబుద్ధే ప్రసంగం ఆరంభించారు. అందులో కొన్ని అంశాలు:**

భారతదేశంలో దాదాపు 3000 రాజకీయ పక్షాలు ఉన్నాయి. వాటిలో బీజేపీ ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇందులో మన మట్టి వాసనలు ఉన్నాయి. ఈ పార్టీ విచారధార ఏమిటి? ఎలాంటిది? దానికి చాలా కోణాలు ఉన్నాయి. బీజేపీకి పునాది జనసంఘ్. జనసంఘ్ ద్వారా బీజేపీకి లభించినదే ఏకాత్మ మానవ దర్శనం. ఇందులో నాలుగు మౌలికాంశాలు ఉంటాయని ఇంతవరకు అంతా చెప్పారు. అవి ధర్మార్థకామమోక్షాలు. ఇంకా స్వదేశీ ఉంది స్వధర్మం, స్వభాష, స్వభోజనం, ఇంకా స్వభూష ఉన్నాయి. భారత్ అంటే భారత్. అలాగే ధర్మం అంటే బాధ్యత. మోక్షం అంటే ఆధ్యాత్మిక స్పృహ. మన జీవితాలు సులభంగా సాగడానికి ఉపకరించేవే పంచభూతాలు. మన సమాజంలోనే కాదు, దేశదేశాలతో మనం నెరిపే సంబంధాలను ఇవి నిర్దేశించాలని ఏకాత్మ మానవ దర్శనం చెబుతుంది. మనం మానవ సంబంధాల యుగంలో ఉన్నాం. వ్యక్తి, సమాజం, దేశం ఒకే వ్యవస్థలో భాగమన్నారు దీనదయాళ్. ఈశాన్య భారత రాష్ట్రాలను చిరకాలం పరాయిగానే నాటి ప్రభుత్వాలు భావించాయి. కానీ వాజపేయి తొలిసారి ఈశాన్య భారత రాష్ట్రాల అభివృద్ధి మండలిని ఏర్పాటు చేశారు. అందరినీ కలుపుకొని వెళ్లాలన్న ఏకాత్మతకు ఇది ప్రతిబింబం. నరేంద్ర మోదీ సబ్‌కా సాత్, సబ్‌కా



సోము వీర్రాజు

వికాస్ అన్న నినాదం వెనుక ఉన్నది కూడా ఏకాత్మ మానవ దర్శనమే. తరువాత సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్.. సబ్‌కా ప్రయాస్ అంటూ తన ఆశయాన్ని విస్తరించారాయన. రాజకీయ సిద్ధాంతాల విషయంలో దీనదయాళ్ పాశ్చాత్య పోకడలకు సవాలు విసిరారని ఆచార్య బి. సారంగపాణి అన్నారు. స్వతంత్ర భారత దేశంలో రెండు పంచవర్ష ప్రణాళికలు విఫలమై నాయని రూఢి అయిన తరువాత, చైనా యుద్ధంలో అపజయం తరువాత దీనదయాళ్ ఏకాత్మ మానవ దర్శనం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని ఆయన చెప్పారు. ఆయన ఇంకా ఇలా అన్నారు:

గణితం దీనదయాళ్ అభిమానాంశం. తరువాత సంస్కృతం అంటే అపారమైన గౌరవం ఉంది. అలాగే ఆర్థికశాస్త్రం విశేషంగా అధ్యయనం చేశారు. అందుకే పాశ్చాత్య రాజకీయ సిద్ధాంతాలను సవాలు చేస్తూ ఏకాత్మ మానవ దర్శనాన్ని ప్రతిపాదించారు. స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ విధానాలు, కమ్యూనిస్టుల నినాదాలు దేశాన్ని ఉగ్రరూతలూగిస్తున్న కాలంలో దీనదయాళ్ ఈ సిద్ధాంతాన్ని ప్రవచించారు. వికేంద్రీకరణలో భాగంగా స్థానిక సంస్థలకు అధికారాలు అప్పగించాలని గాంధీజీ గట్టిగా కోరేవారు. అలాంటి వాస్తవికమైన ప్రతిపాదనను గాంధీజీ తరువాత బలంగా వినిపించినవారు దీనదయాళ్. కేంద్రీకరణ భారతీయ విచార ధారకు వ్యతిరేకమైనది కాబట్టి, అధికారం, ఆర్థిక వ్యవహారాల కేంద్రీకరణ ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆరు దశాబ్దాల నాడే దీనదయాళ్ చెప్పారని గుర్తించాలి. ఏకాత్మ మానవ దర్శనంలో మరొక కీలక అంశం అంత్యోదయ. సమాజంలోని అట్టడుగు వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలితాలు అందాలంటుంది అంత్యోదయ.

ప్రజల సామూహిక చైతన్యాన్ని నాశనం చేయడం తగదని దీనదయాళ్ చెప్పారు. కాబట్టి రాజ్యం ప్రజా వ్యవహారాలలో ఎంత తక్కువ జోక్యం ఉంటే అంతమంచిది అన్నదే దీని అర్థం. పెట్టుబడిదారీ విధానంలో పరాయీకరణ జరుగుతుంది. ఆ పరాయీకరణ దేశం నుంచి, ప్రకృతి నుంచి కూడా జరుగు తుంది. కానీ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలకు మించి కమ్యూనిస్టు వ్యవస్థలలో పరాయీకరణ జరుగుతుంది. ఇది సరికాదు. వ్యక్తి, సమష్టి, సృష్టిల మధ్య సమన్వయం ఉండాలి. 'స్వ' భావన పట్ల చైతన్యం తేవడానికి పాటు పడాలి. భారతీయ ఆత్మను దర్శించాలనుకున్నా, అభివృద్ధి అనే అంశంలో మనదైన దృక్పథాన్ని వీక్షించాలన్నా ఏకాత్మ మానవ దర్శనం అధ్యయనం చేయాలి. ఏకాత్మ మానవ దర్శనం మనలో గొప్ప చైతన్యానికి అవసరమైన భూమికను నిరంతరం నిర్మిస్తూనే ఉంటుంది.

వక్తలను, చర్చ ఉద్దేశాన్ని వివరిస్తూ మొదట సోము వీర్రాజు గంభీరోపన్యాసం చేశారు. ధర్మం, సంస్కృతి పునాదిగా ఉండే ఒక రాజకీయ పక్షాన్ని ఏర్పాటు చేసుకుని మనం నడుస్తున్నాం. ఆ ఆశయాలను నాడు అటల్ బిహారీ వాజపేయి, నేడు నరేంద్ర మోదీ ముందుకు తీసుకునే బాధ్యత స్వీకరించారని ఆయన చెప్పారు.

ఈ సభల వైశిష్ట్యం గురించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు మనోభావాలను వెల్లడించారు. సభా నిర్వహణలో పాటించిన మర్యాదలను, అతిథుల పట్ల చూపిన మన్ననను, సభా స్థలి అలంకరణలో పాటించిన సంప్రదాయ పద్ధతులను వారు వివరించారు. ఏకాత్మ మానవ దర్శనాన్ని పునర్దర్శనం చేసుకున్న తరువాత తమ ఆలోచన మరింత విశాలమైందని ముక్తకంఠంతో తెలియ చేశారు. వక్తలంతా వారికి కేటాయించిన వ్యవధికి పరిమితం కావడం విశేషం.

23వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వందేమాతరం ఆధారంగా రూపొందించిన నృత్య రూపకం, భారతీయుడు అనే నాటిక, వాయులీన సంగీత కార్యక్రమం అందరినీ అలరించాయి.



వినయ్ సహస్రబుద్ధే



బి. సారంగపాణి

కథనాలు : జాగృతి డెస్క్

# ఆత్మ.. ఏకాత్మ.. భారతీయ మానసం...



ఏకాత్మ భారతదేశంలోనే సహజంగా ఉందని రాఘవకృష్ణ తెలియచేశారు. కొన్ని కొన్ని సంప్రదాయాలు దేశమంతటా ఒకే విధంగా కనిపిస్తాయి. సాటి మనుషుల పట్ల చూపవలసిన గౌరవంలో కూడా ఆ ఏకాత్మత కనిపిస్తుంది. ఇందుకు సంబంధించి ఆ మధ్య ఒరిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం తరువాత దృగ్గోచరమైంది. ఎందరో అభాగ్యులు కన్నుమూశారు. అంత్యేష్టి జరగపోతే సద్గతులకు ఆత్మ సాగించవలసిన ప్రయాణం ఆగిపోతుందని భారతీ యుల ప్రగాఢ విశ్వాసం. ఇది భారతీయ మానసం. అందుకే ఆ ప్రమాదం జరిగిన 11వ రోజున చుట్టుపక్కల గ్రామాల వారంతా అక్కడకు వచ్చారు. మరణించిన వారందరికీ యథావిధిగా, శాస్త్రోక్తంగా శ్రాద్ధకర్మలను సామూహికంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా శ్రాద్ధకర్మ చేయడానికి నిష్ఠ, నియమం అవసరం. ఉపవాసం ఉండాలి. శిరోముండనం చేయించుకోవాలి. ఆ ప్రమాదంలో మరణించినవారి కులాల గురించి తెలియదు. గోత్రాలు అసలే తెలియదు. ఇతర మతాలు వారూ ఉన్నారు. అయినా చుట్టుపక్కల గ్రామాల వారంతా వచ్చి ఆ నియమాలను పాటించి శ్రద్ధగా అంత్యేష్టి నిర్వహించారు. అలాంటి ఒక కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించలేదు. లేదంటే ఏదో సంఘం వచ్చి ప్రేరేపించలేదు. ఏ పీఠాధిపతి ఆదేశించలేదు. స్వచ్ఛందంగా వారే కూడబలుక్కుని వచ్చారు. అందుకే ఈ చర్యలో చాలామంది భారతీయ మానసాన్ని దర్శించారు.

మన రక్తసంబంధీకులు మరణిస్తే ఎలాంటి గౌరవ ప్రతిపత్తులతో వారిని సాగనంపుతామో, సద్గతులు కలగాలని కోరుకుంటామో, అదే గౌరవం ఇతరులకూ దక్కాలన్న గొప్ప దృష్టి ఆ గ్రామీణుల హృదయాలలో ఉంది. ఏకాత్మత అంటే ఇదే కదా!

# ఏకాత్మ మానవ


అర్జున్‌రామ్ మేఘువాల్

రెండురోజుల సభల తరువాత జనవరి 24న ముగింపు కార్యక్రమం జరిగింది. గంభీరమైన ఉపన్యాసాలతో, స్ఫూర్తిదాయకమైన మార్గదర్శనంతో ఇవి ముగిశాయి. కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘువాల్, బీజేపీ జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి

'ఏకాత్మ మానవత దర్శనాన్ని దీనదయాళ్ ఇస్తే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాల ద్వారా దానిని ఆచరణలో పెడుతున్నారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘువాల్ పేర్కొన్నారు. ఆయన మాటలలోనే ఆయన ప్రసంగం– విజయవాడ గడ్డ పవిత్రమైనది. ఇక్కడ వేదికపై అలంకరించినట్లుగా వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం, మానవత్వం అన్నీ ఒకే మాలలో ఉంటాయి. 1980లో అటల్ బిహారీ వాజపేయి ముంబైలో చెప్పినట్లు 'చీకటి విడిపోతుంది, సూర్యుడు ఉదయిస్తాడు, కమలం వికసిస్తుంది'. ఆ మాటను నిజం చేస్తూ విజయవాడ మార్గం చూపింది. చివరగా, ఈ రోజే రాజ్యాంగ సభ జాతీయ గీతాన్ని, జాతీయ గేయాన్ని ఆమోదించిందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. నేను రాజస్థాన్ వాసిని. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ కూడా రాజస్థాన్‌లోని పిలానీలో విద్యాభ్యాసం చేశారు. అక్కడ ప్రచారంలో ఉన్న ఒక గాథ ద్వారా 'ఏకాత్మ మానవ దర్శనం' ప్రభావం గురించి వివరిస్తాను. దీనదయాళ్ విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక పెళ్లికి వెళ్లారు. అక్కడ మిఠాయిలు వండే వ్యక్తిని, ఆసనాలు ఏర్పాటు చేసిన వ్యక్తిని, బూట్లు పాలిష్ చేస్తున్న వ్యక్తిని, బట్టలు ఇస్త్రీ చేసే వ్యక్తిని... 'ఎవరి కోసం ఈ పనులు చేస్తున్నారు?' అని అడిగితే, వారందరూ 'మా ఊరి అమ్మాయి పెళ్లి, మా ఊరి అమ్మాయి అంటే ఈమె నా కూతురే' అని సమాధానం ఇచ్చారు. వృత్తులు వేరైనా, ఊరంతా ఏకమై ఒక అమ్మాయిని సొంత కూతురిలా భావించడమే 'ఏకాత్మ దర్శనం'. ఒకసారి పార్లమెంటులో సాంస్కృతిక జాతీయవాదంపై జరిగిన చర్చలో సుష్మా స్వరాజ్ గొప్ప సమాధానం ద్వారా మరొక అంశాన్ని జాతి ముందు ఉంచారు. అస్సాంకు చెందిన ప్రముఖ న్యాయవాది ఎన్‌సీ చటర్జీ, గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయానికి ఎప్పుడూ వెళ్లకపోయినా, తన కుమారుడికి 'సోమనాథ్' (సోమనాథ్ చటర్జీ) అని పేరు పెట్టారు. దేశంలోని ఒక మూల ఉన్న వ్యక్తి, మరో మూల ఉన్న సంస్కృతిని


ముగింపు సభ

# దర్శనమే గెలిచింది!


శివప్రకాశ్

**శివప్రకాశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నాయకులంతా చివరి వరకు ఉండి సభల పట్ల, దీనదయాళ్ పట్ల తమ గౌరవ ప్రతిపత్తులను చాటుకున్నారు. ముగింపు సమావేశానికి సైతం సభాస్థలి కార్యకర్తలతో కళకళలాడింది. అదే ఉత్సాహంతో వారు నినాదాలు చేశారు.**

గౌరవించడమే సాంస్కృతిక జాతీయవాదం అని స్వరాజ్ గుర్తు చేశారు. మనిషికి శరీరం, మనసు, బుద్ధి, ఆత్మ ఉంటాయని దీనదయాళ్ చెప్పారు. వీటి అవసరాలు వేరు. వాటిని సమన్వయం చేస్తూ, అందరికీ అందేలా చూడటమే 'ఏకాత్మ మానవతా వాదం'. దీనదయాళ్ ఈ దర్శనాన్ని ఇస్తే, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాల ద్వారా దానిని ఆచరణలో పెడుతున్నారు.

60 ఏళ్ల క్రితం విజయవాడ వేదికగా జరిగిన సదస్సు ఇవాళ పార్టీకి దిశానిర్దేశం చేస్తున్నది. దీనదయాళ్ ఉపాధ్యాయ సాత్విక దర్శనం వల్లే నేడు వాజపేయి, మోదీ వంటి నాయకులు దేశాన్ని ఏలుతున్నారు. వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం, మానవత్వం.. ఇవన్నీ ఒకే సూత్రంతో ముడిపడి ఉన్నాయి. ఇదే 'ఏకాత్మ మానవ దర్శనం'. చివరగా, రాజ్యాంగ సభ జాతీయ గీతాన్ని, జాతీయ గేయాన్ని ఆమోదించిన రోజు ఇదేనని ప్రధాని మోదీ చేసిన ట్వీట్‌ను చేశారు. ఇంతటి చారిత్రక వాతావరణం నేపథ్యంలో ఇలాంటి కార్యశాలలను నిర్వహించిన నేతలకు, కార్యకర్తలకు అభినందనలు.

**శివప్రకాష్, భాజపా**

ఇది కేవలం ఒక ప్రదర్శన కాదు, మన సిద్ధాంత వికాస పరిణామక్రమాన్ని పునశ్చరణ చేసుకునే అద్భుత అవకాశం. 1952 నుండి 2025 వరకు భారతీయ జనసంఘ్ , భారతీయ జనతా పార్టీ సాగించిన ప్రయాణం ఎన్నో సంఘర్షణలు, బలిదానాలు, విజయాల సమాహారం. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ కలలుగన్న 'గతం కంటే వైభవపేతమైన భారత్'ను నిర్మించడమే మన లక్ష్యం అంటూ బీజేపీ జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ తన ప్రసంగం ప్రారంభించారు. ఆయన ఇంకా ఇలా మాట్లాడారు.... స్వామి వివేకానంద చెప్పినట్లు, ప్రపంచానికి శాంతి, ప్రేమ, సహనం, సమన్వయ సందేశాన్ని అందించడం కోసం భారత్ శక్తివంతంగా ఎదగడం అనివార్యం. ప్రపంచంలోని ఇతర దేశాలకు భిన్నంగా, భారత్ మాత్రమే సమస్త



చరాచర జగత్తును తన కుటుంబంగా భావిస్తుంది. ‘వసుధైవ కుటుంబకం’, ‘సర్వేభవంతు సుఖినః’ అనేవి మన మూలసూత్రాలు. కేవలం మానవ క్షేమమే కాదు, ప్రకృతిని, జంతుజాలాన్ని గౌరవించే సంస్కృతి మనది. ఈ ఉన్నతమైన భావనలు ప్రపంచంలో నిలవాలంటే భారత్ శ్రేష్ఠమైన దేశంగా నిలవాలి. నేడు భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ‘వైచారిక గందరగోళం’. దేశ వికాసాన్ని అడ్డుకోవడానికి విదేశీ శక్తులు, ఎన్జీవోలు ఒక పథకం ప్రకారం అరాచకత్వాన్ని సృష్టిస్తున్నాయి. దీనినే ‘ఫిఫ్త్ జనరేషన్ వార్’ అని పిలుస్తారు. రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు వంటి అసత్య కథనాలు, ప్రచారాలు సృష్టించి ప్రజల్లో అయోమయం కలిగిస్తున్నారు. CAA వంటి చట్టాలపై అల్లర్లు రెచ్చగొట్టడం, నేరగాళ్లను సన్మా నించడం ఈ కుట్రలో భాగమే. సాయుధ నక్సలిజం అంతమవుతున్న తరుణంలో, ‘అర్బన్ నక్సలిజం’ రూపంలో కొత్త ముప్పు పొంచి ఉంది. వీరు బౌద్ధికంగా యువతను తప్పుదోవ పట్టిస్తూ ఉత్తర–దక్షిణ విభేదాలను, కుల ప్రాతిపదికన చీలికలను ప్రోత్సహిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మతపరమైన ఛాందసవాదం కూడా బాధితుల కార్డును వాడుకుంటూ దేశ సమగ్రతకు సవాలు విసురుతోంది. శతాబ్దాల బానిసత్వం మన మెదళ్లలో మన భాష, సంస్కృతి పట్ల ప్రతికూల భావాలను నింపింది. అందుకే మోదీ ‘పంచ ప్రాణ’ సంకల్పం ద్వారా బానిసత్వపు మానసికత నుండి విముక్తి పొందాలని పిలుపునిచ్చారు. మన మాతృ భాషలను గౌరవించుకుంటూ, స్వదేశీ ఆత్మనిర్భరతతో ముందుకు సాగాలి. ఆర్థికంగా భారత్ ఎదగడాన్ని అడ్డుకోవడానికి వస్తున్న ‘టారిఫ్ టెర్రరిజం’ వంటి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

అవినీతిరహిత పాలన, డిబిటి వంటి పారదర్శక పద్ధతుల ద్వారా మనం అభివృద్ధిని సాధిస్తున్నాం. కుటుంబ రాజకీయాల నుండి విముక్తి పొంది, ఏకాత్మ మానవ దర్శనం ప్రాతిపదికన దేశాన్ని ఏకం చేయాలి. 2047 నాటికి ‘వికసిత్ భారత్’ సాధనే మన లక్ష్యం. అటల్ జీ చెప్పినట్లు, ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ప్రళయ మేఘాలు కమ్ముకున్నా, మనం కలిసికట్టుగా అడుగులో అడుగు వేస్తూ విజయపథంలో సాగాలి. 60 సంవత్సరాల నాటి చారిత్రక సందర్భాన్ని నేటి తరానికి సజీవంగా పరిచయం చేస్తూ, నాటి కళాకృతులు, భోజన పద్ధతులను యథాతథంగా పునఃసృష్టించిన నిర్వహణ బృందం కృషి అభినందనీయం.

అంతకు ముందు ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అందరికీ కృతజ్ఞతలు తెలియచేశారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్



జనసంఘ్, బీజేపీలలో పనిచేసిన కొల్లిమర్ల వెంకటేశ్వర్లు కుమార్తెలు ఇద్దరినీ ఈ సమావేశాలలో సత్కరించారు. వారు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిత్రంలో బీజేపీ నాయకులు మురళీధరరావు, పాకా సత్యనారాయణలను చూడవచ్చు

## సముచితం కదా!

1965 నాటి జనసంఘ్ 12వ వార్షిక సభలు చరిత్రాత్మకమైనవి. ఒక కొత్త రాజకీయ శక్తి పురుటి నొప్పులు అక్కడ వినిపించాయి. అదే భారతీయ జనతా పార్టీ. ఆ సభల దృశ్యాలను తలపునకు తెస్తూ, సభాస్థలిని అలంకరించారు. అలాగే నాడు పాల్గొన్నవారు అదృష్టవశాత్తు కొందరు మన మధ్య ఉన్నారు. వారిని ఆహ్వానించారు. ఆచార్య ముదిగొండ శివప్రసాద్, జూపూడి హైమవతి అలాంటి పెద్దలు. అలాగే ఆ సభలలో పాల్గొని నాడు జనసంఘ్ నిర్మాణం కోసం చెమటోడ్చిన వారి సంతానాన్ని ఈ సభలకు ఆహ్వానించడం ముదావహం. కొల్లిపర వెంకటేశ్వర్లు గారి కుమార్తెలు ఈ సభలకు హాజరయ్యారు. వారితో పాటు అలాంటి మరికొందరిని, విశాఖ నుంచి వచ్చిన సత్యారావు మాస్టారిని వేదిక మీదకు ఆహ్వానించి సన్మానించారు.



సుదూర ప్రాంతాల నుంచి కూడా జనసంఘ్ అలనాటి నేతల వారసులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. వారందరినీ నిర్వాహకులు సత్కరించారు. ★



## మార్క్సిజం-శ్రీరామరాజ్యం

# మధ్యయుగంలో రాజనీతి

**మానవులు సామాజిక జీవనంలో నీచ ప్రకృతిని కలిగి ఉంటారు. తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికే సమాజాన్ని సరిగా అర్థం చేసుకోవాలని భావిస్తుంటారు... అని అరిస్టాటిల్ చెప్పాడు. సరిగ్గా ఇలాంటి భావనలే మేకియవెల్లీ వంటి కూటరాజనీతిజ్ఞుని కారణంగా మధ్య యుగాలనాటి రాజనీతిని చిందరవందర చేశాయి. రాజ్యసత్త నిరంకుశరూపాన్ని ధరించడానికి కారణమయ్యాయి.**

రోమ్ సామ్రాజ్యం తరువాత యూరోపియన్ ఇతిహాస కాలం మధ్యయుగం నుంచి ఆరంభం అవుతుంది. మధ్యయుగాన్ని రెండుగా విభజించ వచ్చు. మొదటిది పూర్వార్థం (అంధకార యుగం), రెండోది ఉత్తరార్థం. పూర్వార్థంలో రోమన్లు వేయించిన రోడ్లు నిర్మాణాల వంటివి కొనసాగాయి. గ్రీకు – రోమన్ నాగరికతలు క్రమంగా అంతరించిపోయిన తరువాత ప్రపంచ దేశాలలో విప్లవాలు చెలరేగాయి. క్రమబద్ధమైన రాజ్యపాలనా విధానాలు లుప్తమై పోయాయి. సంస్కృతి – ధర్మాల భ్రష్ట స్వరూపాలు మునుముందుకు తోసుకుని రాసాగాయి. క్రైస్తవులు తమవైన సంప్రదాయాలను ఏర్పరుచుకున్నారు. ఉన్నతి – ఆదరం, సౌహార్ద్రం వంటివన్నీ సంప్రదాయా నికి లోబడినవిగా మారిపోయాయి. పరిణామ స్వరూపంగా ధర్మసత్త – రాజ్యసత్తల మధ్య సంఘ ర్షణలు ఆరంభం అయ్యాయి. ధర్మం– సంస్కృతుల వాస్తవిక స్వరూపం లేనేలేనందువల్లనే రాజ్యసత్త నిరంకుశమై ముందుకు పోగలిగింది.

పదమూడో శతాబ్దిలో ధార్మికసత్త పరాకాష్ఠ స్థితికి చేరుకుంది. పద్నాలుగో శతాబ్ది ఆరంభమవుతూనే దీనికి విరుద్ధమైన ప్రతిక్రియ మొదలైంది. రాజ్యాధికారులు పోప్ ప్రాధాన్యాన్ని అమనస్కంగానే స్వీకరించ సాగారు. పోప్‌లు ఆత్మబలం లేనివారైన కారణంగా తమ నాశనాన్ని తామే కొనితెచ్చు కున్నారు. అధికార – ఆర్థిక సంపత్తుల కారణంగా... సంయమన లోపం వల్ల వారిలో విలాసాలు ఎక్కువయ్యాయి.

అరిస్టాటిల్ వాదానికి పెరుగుతున్న ఆదరణ ప్రభావం కూడా ధార్మికతకు ప్రాధాన్యం తెచ్చిపెట్ట దానికి బదులుగా విరుద్ధంగా మారి పోయింది. వివేకము, బుద్ధి, ఆత్మప్రేరణల ఉత్పత్తి చేత ధార్మిక విశ్వాసం నష్టమై పోసాగింది. జాతీయ భావనలు ఉదయించడం వల్ల ధార్మిక సత్త ప్రాధాన్యతకు ప్రతికూల పరిస్థితులు తలెత్తాయి. రాజకీయ సత్తకు ప్రాధాన్యం పెరగడానికి కాలం అనుకూలంగా మారింది.

ఫ్రాన్స్‌లో ధర్మాధికారులు, ధార్మిక భావనల కంటే కూడా జాతీయ భావనలు పెంపొందడం ముఖ్యమని తలచారు. పోప్ నుంచి వచ్చే ఆదేశాలను పెడచెవిన పెట్టి రాజ్యాధికారులకు లొంగిపోయారు. క్రైస్తవులలోనే పోప్ అనియంత్రిత అధికారాలతో విరోధించేవారు పెరగసాగారు. ఈ పరిణామాల వల్ల రాజకీయ నాయకులపై ధర్మమనే అంకుశం తప్పిపోయింది. ధర్మవిహీనమైన లౌకిక రాజనీతి ఉదయించింది. ఇట్టి లౌకిక రాజనీతి స్వరూప నిర్ధారణ అనేది మాకియవెల్లీ వంటి కూటనీతిజ్ఞుల చేతుల మీదుగా జరిగింది.

మేకియవెల్లీ కాలంలో విద్యల పునరుద్ధరణ జరిగింది. ఈ పునరుత్థానం అనే దానిలో మళ్లీ రెండు పక్షాలున్నాయి. మొదటిది... ఈర్ష్య, స్పర్థ, స్వార్థం మొదలైనవి ప్రధానంగా ఉండే స్వార్థపరులు.... రెండోపక్షంలో సహిష్ణుత, ప్రేమ, సహయోగిత ప్రధానంగా తలచే మానవతావాదులు చేరి ఉంటారు. మేకియవెల్లీ దీనిలోని మొదటి పక్షాన్నే స్వీకరించాడు. అతడి అభిప్రాయంలో, 'మానవులు స్వభావసిద్ధంగా కృతఘ్నులు, ఉన్మాదులు, మోసకారులు, భీరువులు, లాలూచీ పడేవారు. వారు తమ స్వార్థపూరిత కోరికలను నెరవేర్చుకోవడం కోసం సతతమూ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. వారికి తమ ఇష్టాలను నెరవేర్చుకునేందుకు ధర్మాధర్మాలు, నీతి – అవినీతుల మధ్య భేదాలేమీ కనబడవు. ప్రేమబంధము ఎంతకాలం స్థిరంగా ఉంటుందో... అంతవరకూ తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకుంటూనే ఉంటారు.'

మధ్యయుగంలో రాజనీతికి, ధర్మానికి ఏకత్వం ఉండేవి. మాకియవెల్లీ ఆ రెండింటినీ విడదీశాడు. ధర్మం విషయంలో అతడు, 'మన ధర్మాన్ని అనుసరించి... సాంసారిక విరక్తిచేత పరమానందం, వినమ్రత, తుచ్ఛత ఏర్పడతాయి. వాటి స్థానంలో రోమన్ చర్చి ఆత్మకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. శారీరక శక్తి వంటి విషయాలను నొక్కి చెబుతున్నాయి. ఇవి మానవులను దుర్బలులుగా చేస్తాయి' అని చెప్పాడు.

అతడి ప్రకారం, 'రాజ్యానికి ధర్మం ఆవశ్యకత ఉంది. కానీ అదే రూపంలో రాజ్యపు లక్ష్యాలను అది పూర్తి చేస్తుంది.' 'రాజనీతి, ఇంకా ధర్మాలను వేర్వేరుగా విభాజితం చేయడం అనేది మానవుల స్వాభావిక జీవనానికి అనుకూలంగా ఉంటుంది' అని కూడా చెప్పాడు. అతడి ప్రకారం, 'సమాజం – దానిపై ఆధారపడిన రాజులు పుట్టుకురావడం అనేది స్వార్థ ప్రయోజనాల సాధనార్థమే అయి ఉంటుంది.' 'స్థాయిత్వంపై ఆధారపడి ఏ రాజ్యం అయితే సంఘటితం అయిందో... ఆ రాజ్యం పతనోన్ముఖం కావడం మినహా మార్గాంతరం లేదు' అని కూడా మేకియవెల్లీ చెప్పాడు. పాలకులైన రాజులకు సలహానిస్తూ, 'పురుషార్థ సాధనలో సింహంలాగా, తెలివిలో నక్కలాగా వ్యవహరించండి' అని చెప్పాడు. అయితే మేకియవెల్లీని ఆనాటి ప్రజలు నిందించారు. కానీ అప్పటి యూరోప్ అంతటా రాజనీతి అతని పరామర్శయందే సంచలితం అవుతూ వచ్చింది.

ఆ తర్వాత ధర్మం (మతం) అభివృద్ధి చెందిన యుగం వచ్చింది. మార్టిన్ లూథర్, కెల్విన్ అటువంటి వారిలో ప్రముఖులైన తత్త్వజ్ఞులు. వారు నైతికతను స్థాపించేందుకు ప్రయత్నించారు. వారి అనుయాయులు ఒక అడుగు ముందుకు వేసి... లౌకిక రాజనీతిని ప్రతిష్ట చేశారు. రాజశక్తిని దైవీసిద్ధాంతం కంటే తక్కువ చేయడానికి కావాల్సిన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

**(వచ్చేవారం... రాజనీతిశాస్త్ర వికాసం)**

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**
**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

# గణపతిదేవుడు




21

సోమలదేవికి, చిల్లాదేవికి మధ్య వ్రాసుకున్న ఉత్తరాలు అంతఃపురంలో దొరికితే వాటిని చదువుతున్నాడు.

'ఆ చనిపోయిన పెద్ద కవ్వల కోసం బాలకవ్వల వీళ్లతో కలిసి ఆ దేవతను కొలుస్తున్నట్లుంది. అయితే ఈ బాలకవ్వల ప్రస్తుత స్థితిగతులు.. ఆమె ఎక్కడ.. ఎలా.. జీవిస్తుందో చిల్లాదేవికి, సోమలకు తెలుసన్న మాట!?'

ఈ ముగ్గురూ కలసి కవ్వల ఆత్మశాంతి కోసం ఎవరో దేవతను పూజించడం..'

గణపతికి అంతగా హర్షణీయంగా లేదు. ఇందులో ఏదో తిరకాసు ఉన్నట్లు ఆయన మనసు చెబుతోంది.

నిజమేనా.. కేవలం సందేహమేనా??

* * *

నాలుగవ మెట్టు: కన్నడరాజ్య హద్దులలో

"కాకతీయ రాజ్యానికి తూర్పుదిక్కున రాజ్యం పొడవునా పూర్తిగా సముద్రతీరం ఉంది. పటమట దిక్కున ఖచ్చితంగా అంత పొడవునా కన్నడ భాషా రాజ్యాలున్నాయి. హద్దు వెంట ఉన్న గ్రామాలలో కన్నడ తెలుగు భాషా గ్రామాలున్నాయి. వాయవ్య మూలగా దేవగిరి రాజ్యముంది. భాషాపరంగా చూస్తే అక్కడ మూడు భాషలు.. తెలుగు, మరాఠి, కన్నడభాషల ప్రజలున్నారు. తెలుగు గ్రామాలు తక్కువ కాని అది పూర్తిగా కన్నడభాషా రాజ్యమో..మరాఠ భాషా రాజ్యమో తేల్చుకునే ప్రయత్నంగా నిర్విరామంగా దిగువ కన్నడ రాజ్యాలతో యుద్ధాలు చేస్తోంది దేవగిరి రాజ్యం. అలాగే నైరుతి మూలగా దిగువన అనేక త్రిభాషా (కన్నడ తమిళ తెలుగు) గ్రామాలున్నాయి. వాటిలోని మన తెలుగు గ్రామాలను.. తెలుగు భాషారాజ్యంలో కలుపుకోవాలి. అందుకు గణపతిదేవుని మహా చాణక్యం, యుద్ధ తంత్రజ్ఞత అవసరం."



మత్తి భానుమూర్తి

తిమ్మప, కన్నడ తెలుగురాజ్య సంబంధాల నిపుణుడు, చింతనా శిబిరంలో..

* * *

కురుమద్దహళ్లి గ్రామం, బెలగావి, దేవగిరి రాజ్యం.

గ్రామమంతా హడావిడిగా ఉంది. ఇది కదంబుల రాజధాని బెలగావి నుండి తూర్పువైపు తెలుగు రాజ్యాల హద్దులవద్ద ఉన్న గ్రామం. కదంబ రాజ్యాన్ని దేవగిరి మహారాజు సింఘణదేవుడు ఓడించి కదంబ వంశాన్ని నామమాత్రం చేసి తన దేవగిరి రాజ్యంలో కలిపేసుకున్న రోజులు.

పాలకుడు ఎవరైనా ప్రజలకొచ్చిన నష్టం ఏమీ లేదు. రాజ్యపాలకులు మారినప్పుడు తాత్కాలికంగా వచ్చే కొన్ని ఇబ్బందులు మాత్రమే ఉంటాయి. కాని ఈసారి సమస్య భాషా సమస్య. ఈ రాజ్యంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాష కన్నడ. తూర్పువైపు తెలుగు రాజ్యాలున్నాయి. అంచులలో ఉన్న గ్రామాలలో తెలుగన్నడ (తెలుగు కన్నడ మిశ్రమ భాష) మాట్లాడతారు. ఇప్పుడు అందరూ మరాఠి మాట్లాడాలన్నది కొత్త పాలకుల ఆజ్ఞ. అందుకు రాజ్యమంతా ఒకలా స్పందిస్తే తెలుగన్నడ మాట్లాడే గ్రామాలు ఒకలా స్పందించాయి. కారణం ఇప్పుడు తెలుగన్నడ అనే మిశ్రమభాష మాయమై తెలుగు, కన్నడ స్పష్టమైనాయి. పూర్తిగా తెలుగు మాట్లాడేవారు మేము తెలుగు రాజ్యంలో కలుస్తామని అంటుంటే.. పూరిగా కన్నడ మాట్లాడేవారు తాము కన్నడ రాజ్యంలో కలుస్తామంటున్నారు. వీరిద్దరి గొడవ ఇలా ఉంటే.. ఇప్పుడు ఇది మరాఠి పాలకుల రాజ్యం కాబట్టి మీరంతా మరాఠి మాట్లాడాలని కొత్త పాలకుల దాష్టీకం పెరిగింది.

కురుమద్దహళ్లి గ్రామ సమయసెట్టి కన్నడవాడు. ఆ ప్రాంతంలోని ప్రముఖ వణిజశెట్టి మరాఠివాడు. సమయ శెట్టి కూడా వణిజశెట్టి మాట జవదాటలేదు. వర్తమానంలో వణిజ శెట్టి మాట సమాజంలో బాగా చెల్లుబాటు అవుతోంది. కురుమద్దహళ్లి గ్రామంలో కన్నడ, మరాఠి భాషల ప్రజలు ఏమి మాట్లాడాలో తేల్చుకోలేకపోతున్న సమయంలో తెలుగుభాషా కుటుంబాలు మెల్లగా మూటాముల్లె సర్దుకుని తూర్పుదిక్కుగా హద్దులు దాటి తెలుగు రాజ్యం అద్దంకి వెళ్లి పోవాలని చూస్తున్నాయి.

కురుమద్దహళ్లి సమయశెట్టి చాటింపు వేయించాడు.

"మన గ్రామం ఇప్పుడు మరాఠి మహారాజ్యం దేవగిరి రాజ్యంలో భాగం అయ్యిందని మీకు అందరికి తెలుసు. రాజ్యమంతా ఇకపై మరాఠిలో మాట్లాడాలని మహారాజులవారి ఆజ్ఞ అని తెలియవచ్చింది. కాబట్టి అంతా ఆ భాష గురించి యోచించవలసినదిగా కోరుతున్నాను. వచ్చే ఆదివారం జరగబోయే సంతలో మరాఠి మాట్లాడేవారికి మాత్రమే సరకు అమ్ముతామని వణిజశెట్టి తెలియజేశాడు. సంత నిర్వాహకులు, సుంకాధికారులు కూడా మరాఠి వాళ్లే ఉంటారని గుర్తుపెట్టుకోండి."

ఈ చాటింపు వేయించిన సమయశెట్టి సమయానుకూలంగా ఉంటాడని గ్రామస్తులందరికి తెలుసు. కన్నడం వాళ్లు విచికిత్సలో పడిపోగా తెలుగువాళ్లు మెల్లగా హద్దు దాటడానికి బయటకు తెలియకుండా సిద్ధమౌతున్నారు. ఆ సమయంలో దేవగిరి రాజ్య వాణిజ్య సంధివిగ్రహిట. ఓ మరాఠి మహాతల్లి రాజ్యంలోని వణిజశెట్టిల అతిథిగా ఉంటూ.. ఆయా గ్రామాలను దర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తోందని కురుమద్దహళ్లి గ్రామస్తులకు తెలియవచ్చింది.

తెలుగుభాషా కుటుంబాలవాళ్లు తాత్కాలికంగా వల్లప్పనాయుడు అనే వ్యక్తిని సమయశెట్టిగా ఎన్నుకున్నారు.

వల్లప్ప గ్రామ సమయశెట్టి ముద్దగండయను కలిసి "మా తెలుగువాళ్లు అవతల అద్దంకి రాజ్యంలోకి వెళ్లిపోదామని అనుకుంటున్నారు శెట్టి. మీ సహకారం కావాలి" అని కోరాడు.

"నాదేముంది వల్లప్పా. మన గ్రామస్తులందరం ఇంతకాలం ఒక్కటిగా ఉన్నాం. మన కష్టాలు సమస్యలు ఐక్యంగా పరిష్కరించుకున్నాం. అప్పుట్లో మాట్లాడేది మన భాషా.. పరాయి భాషా అనే తేడా రాలేదు. ఇప్పుడు వచ్చింది. సరే సరే. ఇది కాలధర్మం.

కాబట్టి భాషాపరంగా మనం వేరువేరు అనుకున్నప్పుడు మీరంతా గ్రామం విడిచిపోతామంటే నేను చేసేది ఏముంది? అయితే ఎవరో మరాఠీ మహిళ.. దేవగిరిరాజ్య వాణిజ్య సంధివిగ్రహి.. పేరు బాల కవ్వలాబాయి గారట. కొత్త రాజ్యం తరపున అన్ని గ్రామాలు తిరుగుతూ అందరిని బెదిరిస్తోందని విన్నాను. రేపోమాపో మన గ్రామం కూడా రావచ్చు. ఆమెను కలిసి చెప్పుకో." అన్నాడు ముద్ద గండయ.

ఆయన చెప్పినట్లుగా ఆ మరాఠా వాణిజ్య సంధివిగ్రహి బాలకవ్వలాబాయి ఓ రోజు కురుమద్ద హళ్లి గ్రామానికి విచ్చేసింది. వెంట పెద్ద రక్షణ వలయం. పూర్తి మరాఠీ కట్టుబొట్టు.. దూరానికి కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న ముక్కుకున్న నత్తు, చెవులకు వ్రేలాడుతున్న జుమకి, కాన్ వెలి.. చేతులకు కాకన్, థోడా, పాటిల్య.. చేతులకు బాజూబంద్, వేళ్లకు వింతవింత అంగుటిలు.. ఇక మెడనిండా మిలమిల మెరిసిపోతున్న తుషిమాల, తన్మణి, బోర్ మాల, సూర్య, చంద్ర లక్ష్మీ హారాలు, జబ్బలకు వాక్య.. ఇక ఉన్నదో లేదో తెలియని సింహమధ్య లాంటి నడుముకు కమర్ పట్టా.. ఓహ్.. అచ్చమైన మరాఠీ పరిపూర్ణ మహిళ..

పల్లకి నుంచి కిందికి దిగిన ఆమె.. కేవలం రాజవంశ అంతఃపురకాంతలా లేదు. రాజసంతో కూడిన కుందనపు బొమ్మలా, సన్నగా ఏపుగా చివారుకొమ్మలా ఎదిగి.. ఎదుటివారిని ఉక్కిరి బిక్కిరి చేయగల అందచందాలతో పాటు యుద్ధ విద్యలు సైతం నేర్చిన యోధురాలిగా తెలుస్తోంది. చూపుల్లో, కదలికల్లో రాచరిక దర్పం ఎక్కువగా ప్రదర్శిస్తోంది. ఆమెను చూస్తుంటే వంగి దండాలు పెడితే గాని ఆమె కరుణించదు అనిపించింది వల్లప్పకు.

దండాలు పెడుతున్న ఆ గ్రామీణులను క్రీగంట చూస్తూ సమయ భవనపు చావడిలోకి వెళ్లిపోయింది. వల్లప్పకు చిరాకు కలిగింది. స్వతహాగా ఆయన పెద్ద భూస్వామి. ఎవరివద్దకో వెళ్లి తలవాల్చి దండాలు పెట్టడం అతడెప్పుడూ చేసినవాడు కాదు. ఆమె దర్పం చూసి చిరాకు పుట్టి ఆమె వద్దకు వెళ్లకుండా వెనుదిరిగాడు. ఎలాగూ ఈ ఊరు విడిచి పోతున్నాం కదా.. ఇక కలిసి ఆమెను వంగివంగి దండాలు పెట్టడం ఎందుకు? అనుకున్నా డు వెళుతూ...

అయితే ఆ రాత్రి జరిగింది చూసి ఆమె శక్తియుక్తులేమిటో అర్థమై పిచ్చికేకలు వేశాడు భయంతో.

* * *

దేవగిరి పాలకుడు సింఘణదేవుడు దక్షిణాది వైపుగా దండెత్తి రావడం సరిహద్దు గ్రామాల ప్రజలకు భాషాపరంగా కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టింది. కన్నడ, తెలుగు భాష కుటుంబాలు మౌనంగా ఎవరి భాషా రాజ్యాలకు వాళ్లు వెళ్లిపోతున్నారు. గొడవలు లేవు. అంతా సామరస్య పూర్వక సర్దుబాటు. కాని మరాఠీ భాషీయులైన దేవగిరి యాదవ పాలకులు గెలవడంతో ఈ సరిహద్దు గ్రామవాసులకు కొత్త భాష సమస్య వచ్చింది.

సింఘణదేవుడు దేవగిరి మహారాజుగా దినదినప్రవర్థమానంగా ఎదిగి పోతున్నాడు. సింఘణ మీద ఓ కన్నువేసి ఉంచాడు గణపతిదేవుడు. కారణం కవ్వలను అతడే చంపించి ఉంటాడు అనే వదలని సందేహం. దానిని అలా పక్కన ఉంచి చూస్తే దేవగిరి మహారాజుగా ఆతని పాలన దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఉత్తరం వైపు సౌరాష్ట్ర రాజ్యాలు, దక్షిణంగా కన్నడభాషా రాజ్యాలు జయించుకుంటూ అడ్డొచ్చిన వారిని తొక్కుకుంటూ విజయ దండ యాత్రలు చేసుకుంటూ తాత, తండ్రిని మించిన పరాక్రమశాలిగా గుర్తింపు పొందుతున్నాడు. అయితే ఊహాతీతంగా అతడు గణపతిదేవుని పట్ల పూర్తి అభిమానంతో ప్రవర్తిస్తున్నాడు. అందువల్ల తనకూ కొన్ని ప్రయోజనాలున్నాయి కాబట్టి గణపతిదేవుడు కూడా అంతే అభిమానం ప్రదర్శిస్తున్నాడు.

కాకతీయులకు అత్యంత ప్రీతిపాత్రుడు ద్వారసముద్రం పాలకుడు బల్లాల దేవుడు. ఇప్పుడు బల్లాల దేవునికి, సింఘణకు పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోంది. నిజానికి జైత్రపాలుని కాలం నుండి ఈ రెండు రాజ్యాల మధ్య వైరం ఉంది. ఇప్పుడు బల్లాలదేవుడు వార్ధక్యం వల్ల.. యువకుడైన సింఘణ దేవునిదే పైచేయిగా ఉంది. బల్లాలను సైతం విజయ వంతంగా ఓడించి మరింత క్రిందికి దూసుకు పోతున్నాడు దేవగిరి సింఘణదేవుడు.

దక్షిణాపథం అంటే దక్షిణానికి రహదారి. దక్షణాది అంటే వింధ్య పర్వతాల క్రిందనున్న రాజ్యాలు అనేది ప్రాచీనం నుండి ఉన్న భావన. దక్షిణావర్తానికి రావడానికి ప్రధానమైన దక్షిణాపథాలు రెండు. మధ్యగా వింధ్య పర్వతాలు ఉంటే దానికి పడమరగా ఉన్నది ఒక రహదారి అయితే.. తూర్పున ఓఢ్ర రాజ్యాలు, కళింగం మీదుగా ఉన్నది మరో రహదారి. సాధారణంగా దక్షిణాపథం అంటే.. పడమటి రహదారిని చెబుతారు. ఉత్తరావర్తం నుండి

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

దక్షిణావర్తానికి వచ్చే వాళ్లంతా ఈ దక్షిణాపథాన్నే ఎంచుకుంటారు. పాటలీపుత్ర మహారాజైన అశోకుడు లాంటి ఈశాన్య రాజ్యాల పాలకులు కళింగం మీదుగా దక్షిణావర్తానికి వస్తుంటారు.

దక్షిణాపథంలో ఉన్న రాజ్యాలు దేవగిరి రాజ్యం, కాకతీయ రాజ్యం మాత్రమే.

దేవగిరి రాజ్య చరిత్ర చిన్నది కాదు. శత్రుదుర్భే ద్యంగా రూపొందించారు జైత్రపాలుడు, ఆయన తండ్రి భిల్లమదేవుడు. తురుష్కులు దక్షిణాదికి విస్తరించలేదు కాని ఉత్తరాదిలో వాళ్లు సృష్టిస్తున్న వైపరీత్యాలను దక్షిణావర్తపు రాజులంతా విభ్రమంగా పరికిస్తున్నారు. రేపు వాళ్లు మనపైకి వస్తే అనే ఆలోచనలతో జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే సహ్యాద్రి పర్వతశ్రేణుల పాదాల



వద్ద ఉన్న రాజధాని దేవగిరి చుట్టూ బలిష్టమైన కోటను నిర్మించారు యాదవ రాజులు.

ఇప్పుడు భాష ప్రధానమయ్యే నాటికి దేవగిరి రాజ్యంలో మూడు భాషలు మాట్లాడే ప్రజలున్నారు. అన్ని రాజ్యాలలో సమస్య ఇదే అయినా ఆయా రాజ్యాలలో అధిక శాతం ప్రజలు మాట్లాడేది ప్రధాన భాష అనుకుంటే రెండు మూడు భాషలు మాట్లాడే హద్దుల గ్రామాల వద్దే అసలు గొడవంతా వస్తోంది.

ఇప్పుడు కురుమద్దహళ్లి గ్రామ పరిస్థితే హద్దు పొడవునా ఉన్న ద్విభాషీయ గ్రామాలన్నిటా కనిపిస్తోంది. మరాఠీ వాడైన సింఘణ కన్నడరాజ్యాల్లో దక్షిణంగా చొచ్చుకుపోతున్నకొద్దీ.. ప్రజలు ఏది మాట్లాడాలో మరాఠా అధికారులు ఆజ్ఞాపిస్తుండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

నిజానికి హద్దు గ్రామాలలోని తెలుగువారు హద్దు దాటి తెలుగు రాజ్యాలలోకి వెళ్లిపోవడానికి ఏ అడ్డూ రాదనీ భావించారు. అదే ఆలోచనలో కురుమద్దహళ్లి గ్రామ తెలుగువారు కూడా నిశ్శబ్దంగా మూటాముల్లె సర్దుకుంటున్నారు. ఈ గ్రామంలో మొత్తంగా తెలుగు

ఎవరికోసమైతే ఈ పదేళ్లుగా ప్రతినిత్యమూ ఆయన శరీరంలోని ప్రతి అణువణువూ స్మరిస్తుందో.. కంటిపై రెప్ప వెయ్యకుండా ఎవరికోసం ఆయన ఎదురు చూస్తున్నాడో ఆ వ్యక్తి ఊహాతీతంగా కళ్లముందు నిలబడటం.. పిచ్చెక్కినట్లయింది గణపతిదేవునికి. చేతులు కట్టుకుని కొంచెం వంగి తలెత్తి చిన్నగా కంపిస్తున్న శరీరంతో తన వైపు చూస్తోన్న కేయూరను రెప్పవేయకుండా చూస్తున్నాడు.

వారివి ఓ నలభై కుటుంబాలు ఉన్నాయి. ఏ రాత్రి వేళలో రాజ్యహద్దులు దాటిపోవచ్చు అనుకుని సిద్ధంగా ఉన్నారు. కాని ఆ రాత్రి జరగరానిది జరిగిపోయింది.

ఎవరో తెలుగువారి నివాసాలను తగలబెట్టారు.

ఇది కార్చిచ్చులా హద్దు గ్రామాలకంతా పాకిపోయింది. దాదాపు అన్ని గ్రామాలలోనూ హద్దు దాటిపోదామన్న తెలుగువారిని అడ్డుకుంటున్నారు మరాఠీ పాలకులో.. వారి అనుయయులో..

అమాయక ప్రజల మధ్య ఇంతవరకు లేని కొత్త చిచ్చు పెట్టారు. ఇక ఆ మూడు భాషల గ్రామాలలో కొత్త సమస్యలు ఆరంభం అయ్యాయి.

ఈ చిచ్చు పెట్టింది ఓ మహిళ ఎందుకు కాకూడదు అనే సందేహం అప్పటికి ఎవ్వరికీ రాలేదు.

* * *

కాకతీయరాజ్యపు నిండు సభామందిరం, అనుమకొండ రాజప్రాసాదం..

మొదటి కొలువు అప్పుడే ప్రారంభం అయ్యింది.

కాకతీయ మహామండలేశ్వరుడు గణపతిదేవుని పాలనా విధానం అంతా పాతతరం పాలన నుండి పూర్తిగా మారిపోయింది.

మహావీరులకు, అనేక యుద్ధాలలో పోరాడి అలసిన సర్వసైన్యాధ్యక్షులకు, వృద్ధులైన యుద్ధ మంత్రజ్ఞులకు కూడా వేరువేరు మండలాలను కేటాయించి ప్రశాంతంగా ప్రజలకు సహాయ సహకారాలు అందించవలసినదిగా ఆదేశం చాడు. యుద్ధాలు, యుద్ధ మంత్రాంగాలను పక్కన పెట్టేసి మండలేశ్వరులుగా ప్రజలకు సమస్త సౌకర్యాల కల్పనతో కూడిన ప్రజాహితం, ప్రశాంత సమాజం దిశగా ఆలోచించమన్నాడు.

ఇప్పుడు ఆయన ఎప్పుడు చూసినా సైనిక వీరులతో కాక ప్రజాపాలనలో నిపుణులైన ప్రతిభామూర్తులతోనే పరివేష్టించి కనిపిస్తున్నాడు. నిర్ణయించిన సమావేశాలు, కలవవలసిన విదేశీ, స్వదేశీ వణిజులు, వివిధ అంశాల నిపుణులతో చర్చలకు సంబంధించిన చిట్టా ముందే రోజే సిద్ధమైపోతుంది. ఎంతో అత్యవసరం అయితే తప్ప ఈ నిర్ణీత అంశాల నుంచి మరో అంశాన్ని చూడడు మహారాజు గణపతిదేవుడు.

హఠాత్తుగా రాజధానికి వచ్చి మహారాజును కలవాలని ఎవరైనా ప్రత్యేకంగా అభ్యర్థిస్తే మహా మండలేశ్వరుల ఆంతరంగిక కార్యదర్శి మయభట్టు.. ఆయనకు దగ్గరగా నిలబడి ఆయన కన్నెత్తి చూసినప్పుడు మాత్రమే ధైర్యం చేసి వచ్చిన ప్రముఖుల సంగతి చెవిన వేస్తాడు.

ఈ రోజు కూడా అదే జరిగింది.

తీవ్రమైన ఆర్థిక అంశంపై సంబంధిత నిపుణులతో మహారాజు పూర్తి ఏకాగ్రతతో చర్చిస్తున్నాడు. అప్పటికి గంట నుండి ఆయన దగ్గరగా చేతులు పిసుక్కుంటూ కదలాడుతున్నాడు మయభట్టు. ఓ లిప్తకాలంలో ఆయన గుర్తించాడు.

“ఏమి భట్టూ.. ఏమైనా చెప్పేదిది ఉందా ఏమి?”

“అవును ప్రభూ.. దేవగిరి.. నుంచి?!”

ఆయన చివ్వున చూశాడు, “ఆ.. దేవగిరి నుంచి??”

“దేవగిరి రాజ్యం నుండి తమరికి ఏకాంతంగా కలవాలని ఓ బృందం??” ...

సభామందిరానికి పక్కగా ఆంతరంగిక మందిరం ఉంటుంది. అక్కడ అతిథులను, ప్రత్యేక వ్యక్తులను పక్కన సహాయకులు లేకుండా కలుస్తాడు మహా మండలేశ్వరుడు.

“అంతరంగిక మందిరంలో కూర్చుండబెట్టు..”

దేవగిరి రాజ్యం నుంచి ఎవరో రావడం కలిగించిన ఆలోచనలతో మరో అంశంపై దృష్టి పెట్టలేక వడివడిగా ఉత్సుకతతో ఆ మందిరంలోకి ప్రవేశించాడు గణపతిదేవుడు. అక్కడి బృందమంతా.. దాదాపు పాతికమంది చివ్వున లేచి నమస్కరించారు.

వాళ్లు మరాఠీయులని లిప్తకాలంలోనే గుర్తుపట్టిన గణపతిదేవుడు ముందున్నవ్యక్తిని చూసి చివ్వున అడుగు వెనక్కు వేశాడు. నిలువెల్లా కదిలి పోయాడు.

అతడు కేయూర.. కేయూరదేవుడు!!

ఎవరికోసమైతే ఈ పదేళ్లుగా ప్రతినిత్యమూ ఆయన శరీరంలోని ప్రతి అణువణువూ స్మరిస్తుందో.. కంటిపై రెప్ప వెయ్యకుండా ఎవరికోసం ఆయన ఎదురు చూస్తున్నాడో ఆ వ్యక్తి ఊహాతీతంగా కళ్లముందు నిలబడటం.. పిచ్చెక్కినట్లయింది గణపతిదేవునికి. చేతులు కట్టుకుని కొంచెం వంగి తలెత్తి చిన్నగా కంపిస్తున్న శరీరంతో తన వైపు చూస్తోన్న కేయూరను రెప్పవేయకుండా చూస్తున్నాడు.

పదేళ్లనాడు తానొక యుద్ధఖైదీ అయితే అతనొక విస్మృత రాజకులీనుడు. ఆగామి రోజులలో తాను తప్పక కాకతీయ సింహాసనం అధిష్టిస్తానని ప్రగాఢంగా నమ్ముతూ.. అప్పుడు తనకు తప్పక సహాయం చేయాలని ఆనాడే అర్థించిన వాడు. చివరిరోజు ఆ వివాహమందిరంలో కనిపించాడు. అంతే. ఆరోజు నుంచి మరెక్కడా.. తనవివాహ సమయంలో కూడా కనిపించలేదు. ఇప్పుడు హఠాత్తుగా ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. నోట మాట రావడం లేదు గణపతి దేవునికి.

“మహారాజా.. కాకతీయ మహామండలేశ్వరా.. శతకోట వందనాలు ప్రభూ.”

కాళ్లపై పడబోయాడు కేయూర. చటుక్కున ఆపి హత్తుకున్నాడు.

ఎంతగా హత్తుకున్నాడంటే వెంటవచ్చినవాళ్లు వీరి అన్యోన్యతను.. ఎన్నోఏళ్ల తరవాత కలసిన ఉద్వేగాన్ని.. కళ్లప్పగించి చేష్టలుడిగి దిమ్మెరబోయి చూస్తూ ఉండిపోయారు.

“కేయూరా..! ఏమై పోయావూ. నన్ను.. నన్నెంత అన్యాయం చేశావూ..! నేను నీకు చేసిన ద్రోహం ఏవిటి??”

ఒక మహామండలేశ్వరుడు అలా ఓ సాధారణ వ్యక్తిలా ఉబికివస్తున్న కన్నీటిని ఆపుకుంటూ కేయూర లాంటి సాధారణ రాజకుటుంబికుడిని గాఢంగా హత్తుకుని మాట్లాడటం చూసి కేయూరతో వచ్చిన వారందరికీ మతిపోయింది. వారందరూ గణపతిదేవుడు అద్భుత కరుణామూర్తి అని విన్నారు కాని ప్రత్యక్షంగా చూసేసరికి వారికి నోట మాట లేదు. మిడిగుడ్లతో చూడసాగారు.

మహారాజ వైభవంతో వెలిగిపోతున్న గణపతిని అబ్బురంగా ఆత్మీయంగా పైనుండి కింది వరకు తడిసిన కన్నులతో చూడసాగాడు కేయూర. కంటి చూపుతో అందరిని బయటకు వెళ్లవలసినదిగా సౌంజ్ఞ చేశాడు. అందరూ వెళ్లాక కేయూరను ఓ ఆసనంలో కూర్చుండబెట్టి మళ్లీ అడిగాడు గణపతిదేవుడు.

"మిత్రమా.. నీ అదృశ్యం.. ఇంతకాలం దూరంగా ఉండటం.. అన్నీ నన్ను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏమి జరిగింది చెప్పు. నేనిప్పుడు పూర్తిస్థాయి మహామండ లేశ్వరుడను. దేవగిరివారికి అల్లుడను. ప్రస్తుత మహారాజు సింఘణదేవుడు నాతో పూరి స్థాయి గౌరవాభిమానాలతో ప్రవర్తిస్తున్నాడు. నీకొచ్చిన ఆపదలు ఇకపై ఉండవు. నాది హామీ. సరేనా.?? చెప్పు చెప్పు.. మీ తల్లిగారు ఎలా ఉన్నారు?"

ఇవన్నీ కేయూర ఎదురైతే అడగాలనుకున్న మాటలు.. ఆయన నాలుక చివరనే ఉన్నాయి.. పదేళ్లుగా.

"నా తల్లి కాలం చేసింది ప్రభూ... అప్పటినుండే నాకు మరిన్ని కష్టాలు వచ్చిపడ్డాయి."

ఆగి, అటూఇటూ చూసి, "కవ్వల.." చెప్పబోయి ఆగాడు కేయూర.

ఆ ఒక్క మాట.. గణపతిదేవుని పూర్తిగా వణికించింది. ఏమి చెప్పబోతున్నాడు కేయూర??

గబుక్కున తన స్థాయిని మరచి అతని ముందు మోకాళ్లపై కూర్చుండి పోయాడు గణపతి.

"కవ్వల??.. చెప్పు కేయూరా.. కవ్వల.. ఆమెను నాకు దగ్గర చేసిన వాడివి నువ్వే. నేనే ఆమెను దూరం చేసుకున్నాను. ఆ రాత్రి నేను ఆ పెళ్లికి వెళ్లకుండా ఉంటే ఎంతో బావుండేది. ఆ రాత్రే మావాళ్లు నా కోసం మెరుపుదాడి చేశారు. నన్ను తప్పక విడిపించి అనుమకొండ తీసుకుపోయేవారు. నేను మహారాజుగా పట్టాభిషక్తుడనై తిరిగి దేవగిరి వచ్చి ఆమెను.నా కవ్వలను వివాహం చేసుకునే వాడిని. ఇప్పుడు నా పట్టమహిషిగా.. ఈ రోజు కవ్వల నిన్ను ఆప్యాయంగా అంతఃపురంలోకి ఆహ్వానించి.. నీకు పంచ భక్ష్య.."

"కవ్వల??.. చెప్పు కేయూరా.. కవ్వల.. ఆమెను నాకు దగ్గర చేసిన వాడివి నువ్వే. నేనే ఆమెను దూరం చేసుకున్నాను. ఆ రాత్రి నేను ఆ పెళ్లికి వెళ్లకుండా ఉంటే ఎంతో బావుండేది. ఆ రాత్రే మావాళ్లు నా కోసం మెరుపుదాడి చేశారు. నన్ను తప్పక విడిపించి అనుమకొండ తీసుకుపోయే వారు. నేను మహారాజుగా పట్టాభిషక్తుడనై తిరిగి దేవగిరి వచ్చి ఆమెను.నా కవ్వలను వివాహం చేసుకునే వాడిని. ఇప్పుడు నా పట్టమహిషిగా.. ఈ రోజు కవ్వల నిన్ను ఆప్యా యంగా అంతఃపురంలోకి ఆహ్వానించి.. నీకు పంచ భక్ష్య.."

"నాకా అదృష్టం లేదు మహారాజా.. లేదు గాక లేదు." భోరుమని ఏడుస్తూ నెత్తి బాదుకున్నాడు కేయూర.

గణపతిదేవుడు తానొక మహారాజు అనే స్పృహ వదిలేశాడు. కేయూరకు పరిచయమైన చెరసాలవాసిగా ఆ రోజులలో మిగిలి ఉన్న సందేహాలను కేయూరను అడిగి నివృత్తి చేసుకోవాలని ఆరాటపడుతున్నాడు.

"ఏమైంది చెప్పు కేయూరా. బాధపడకు. నా వద్దకు వచ్చావ్..ఇక నీ సమస్యలన్నీ తొలగిపోయాయి. చెప్పు. కవ్వల అంటూ ఏదో చెప్పబోయావ్. చెప్పు.. ఆమెను ఎవరు చంపారు? ఆ రాత్రి కాకతీయ సైనికులు, ఇటు దేవగిరి సైనికులు చాలా ఉద్రేకంగా యుద్ధోన్మాదంతో ఉన్నారు. అప్పుడొక అమ్మాయి వారికి తారసపడితే ఆమెను మానభంగం చేసినా ఆశ్చర్యం లేదు. అతి దారుణంగా ముక్కలు ముక్కలుగా ఆ లేత శరీరాన్ని నరికి నరికి చంపేశారు.. అది దుర్మార్గులైన సైనికుల పనే కావచ్చు.. అవునా??"

కాస్త తేరుకున్నాడు కేయూర.

"ఆమె మరణం దారుణం. కాని కానీ ఆమెను.. ఎవరు అలా.. అంత దారుణానికి ఒడికట్టారో.. ఫ్. నాకు తెలియదు ప్రభూ...! కాని ఆమెను సింఘణ పెళ్లి చేసుకుంటానని ఆ సంఘటనకు కొన్ని రోజుల ముందు మహారాజు, రాణిగార్ల వద్ద ప్రస్తావించిన మాట నిజం. అదే నేను ఆ వివాహ మండపంలో మీతో చెప్పాను. ఆ రాత్రి అక్కడ కొందరు వేగుల వాళ్లున్నారు. నేను వాళ్లను చూశాకే భయంతో దూరంగా పరుగుపెట్టాను. కారణం సింఘణ దేవుడు ఎంత దుర్మార్గుడో నాకు తెలుసు. ఆ వేగులు మిమ్మల్ని గుర్తించారు కూడా. మీరిద్దరూ కలిసి మాట్లాడుకోవడం.. బయటకు వెళ్లడం కూడా వాళ్లు గుర్తించారు. ఈ సంగతులు వాళ్లు తప్పక సింఘణ చెవిన వేసే ఉంటారు."

ఆపాడు కేయూర. ఆలోచనలో పడిపోయాడు గణపతిదేవుడు. చాలాసేపు అలా ఉండిపోయాడు. కేయూర చెబుతున్న వివరాలలో ఆయనకు కావాల్సిన ప్రధాన అంశం.. కవ్వల మరణ రహస్యం.. ఏ మాత్రం తెలియక పోవడం ఆయనను నిరుత్సాహ పరచింది.

కాస్త తెప్పరిల్లాడు. లేచి నిలబడ్డాడు.

"సరే.. ఇన్నేళ్లూ ఈ పదేళ్లు ఎక్కడున్నావ్.. ఈ రోజు ఇలా ఇక్కడికి రావడానికి కారణం ఏవిటి"

కేయూర లేవబోయాడు. భుజాలు పట్టి కూర్చోబెట్టాడు గణపతి. పదేళ్లలో కేయూరలో వచ్చిన మార్పులు తొలిచూపుతోనే గుర్తించాడు. అప్పుడు బట్టల చిరుగులను కప్పిపెట్టుకోవడానికి యత్నించేవాడు. ఇప్పుడు మంచి రాచరిక దుస్తులలో ఉన్నాడు. నడుముకు విలువైన కత్తి కలిగిన వొర వేలాడుతోంది. తలకు ఖరీదైన ఉష్ణీషం ధరించాడు. పాదరక్షలు కూడా మహారాజులు ధరించేవే.

స్థాయి పెరిగినట్లు కనపడుతున్నా ముఖంలో దర్పం లేదు అప్పటిలాగే దైన్యం గానే ఉన్నాడు.

"స్వామీ మీకొక సంగతి చెప్పాలి. నన్నొక 'విషయ'కు పాలకుడిగా నియమించారు మా మహారాజు సింఘణ దేవులవారు."

కనుబొమలు ఎగరేసి ఆశ్చర్యంతో కూడిన అభినందనగా భుజం తట్టాడు గణపతిదేవుడు.

"ఓహో.. సంతోషం. తమరు ఇప్పుడొక విషయాధిపతి అన్నమాట."

"అవును ప్రభూ. దేవగిరి ఉత్తర హద్దు. సౌరాష్ట్ర రాజ్యాల వద్ద. కల్వకోల రాజ్యం.."

ఒక్కొక్క అంశమే కేయూర మెల్లగా ఆపి ఆపి చెబుతున్నట్లు భావించాడు. పదేళ్ల తర్వాత కనిపించి మెరుగైన తన జీవితాన్ని చెబుతున్నప్పుడు సహజంగా ఉండే ఆత్మవిశ్వాసపు గర్వం, దర్పం.. ఏమీ లేవు. గణపతిదేవుని ముఖంలోకి చూస్తూ ఒక్కొక్క సంగతే చెబుతున్నాడు.

"వివాహం కూడా సింఘణదేవులవారే జరిపించారు."

(సశేషం)






# అమెరికాను ముంచుతున్న ‘ట్రంప

**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన రెండో విడత పదవీ కాలంలో ఏడాది కాలాన్ని జనవరితో విజయవంతంగా పూర్తిచేశారు. మొదటి విడత అధ్యక్షుడిగా ఉన్నప్పటి ట్రంప్‌తో పోలిస్తే నేటి ట్రంప్ పూర్తి భిన్నం. కార్యనిర్వాహక అధికారాలను విచ్చలవిడిగా ఉపయోగించడమే కాదు, విదేశాంగ విధానంలో మిత్రులు, శత్రువులు అనే తేడా లేకుండా తన చిత్తం వచ్చిన రీతిలో నిర్ణయాలు తీసుకుంటూ ఇంటా బయటా పలు వివాదాలకు కారణమవుతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా తాను చెప్పిందే వేదమన్న రీతిలో ప్రవర్తించడంవల్ల విదేశాంగ విధానం పూర్తి అసంబద్ధంగా మారింది. ఒబామాకు నోబెల్ బహుమతి ఇచ్చారు కనుక తాను కూడా ఆ బహుమతిని స్వీకరించడానికి అర్హుడినే అనేది ఆయన ప్రగాఢ విశ్వాసం.**

ఎనిమిది దేశాల మధ్య యుద్ధాలను ఆపేశానని, ముఖ్యంగా భారత్–పాకిస్తాన్‌ల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని పదేపదే చేసుకుంటున్న స్వోత్కర్ష అంతర్జాతీయ సమాజానికి విసుగు తెప్పిస్తున్నది. ట్రంపరితనానికి వెనుజులా, ఇరాన్, గ్రీన్‌ల్యాండ్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేవలం ప్రధాని మోదీ ఫోన్ చేయలేదన్న కారణంగా మనదేశంపై 50శాతం టారిఫ్‌లు విధించిన ఆధునిక తుగ్లక్ ట్రంప్! తన మాట వినని దేశాలపై ఎడాపెడా టారిఫ్‌లు విధిస్తుండటం బూమరాంగ్ అయి సగటు అమెరికన్ పౌరులు ద్రవ్యోల్బణంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. పెరిగిన ధరలతో సామాన్యులు సతమతమవుతుంటే, ఖజానాకు ఆదాయం బాగా వస్తున్నదంటూ తనకు తాను భుజాలు చరుచుకోవడం ట్రంప్‌కే చెల్లింది.

**అమెరికన్లకు భారంగా ట్రంప్**

మేక్ అమెరికా ఫస్ట్ నినాదంతో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ తీసుకుంటున్న చర్యలు ప్రపంచ దేశాలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది కాలంలో ట్రంప్ మొత్తం 200 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు ఇచ్చి రికార్డు నెలకొల్పారు. అధికారంలోకి వచ్చీరాగానే రెండు నుంచి మూడు లక్షల వరకు ఉద్యోగులను తొలగించి పెద్ద వివాదానికి తెరతీశారు. “ఎలైన్ ఎనిమీస్ యాక్ట్” కింద పెద్ద ఎత్తున విదేశీయులను స్వదేశాలకు పంపించడం మొదలైంది. ఈ చట్టం కింద తాజాగా మిన్నెసోటాలోని కొలంబియా హైట్స్‌లో ఐదేళ్ల బాలుడు లియాం కొనెజో రామోస్‌ను ఇమ్మిగ్రేషన్ అధికార్లు అదుపులోకి తీసుకోవడం పరాకాష్ట. దీంతో దేశంలో పెద్ద దుమారం చెలరేగింది. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ వివిధ నగరాల్లో ఇప్పటికీ ఆందోళనలు కొనసాగుతున్నాయి. “ఎలిగేటర్ ఆల్‌కాట్రజ్” వంటి డిటెన్షన్ సెంటర్లను తెరవడం, గత ఏడాది మార్చిలో వందమంది వెనుజులా పౌరులను అతి క్రూరమైనదిగా భావించే “సాల్వ డోరాన్ జైలు”కు తరలించడం పెద్ద వివాదానికి దారితీసింది. అమెరికా వాణిజ్య భాగస్వాములపై 10% బేస్‌లైన్ టారిఫ్‌ల పేరుతో, ఇక చైనాపై ఏకంగా 145% సుంకాలను విధించారు. ఈ దెబ్బకు అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్యారిస్ పర్యావరణ ఒప్పందం, యు.ఎన్.ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమెట్ ఛేంజ్ నుంచి యు.ఎస్.ను ఉపసంహరింపజేశారు. శిలాజ ఇంధనాల ఉత్పత్తికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా, పవన విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అన్ని అనుమతులను రద్దుచేశారు.

ఇక అధికార పగ్గాలు చేపట్టిన రోజునే “ప్రౌడ్ బోయ్స్”, “ఓథ్ కీపర్స్” పేరుగల ప్రభుత్వ వ్యతిరేక తీవ్రవాద సంస్థలకు చెందిన సభ్యులు 1500 మందిని జైళ్ల నుంచి విడుదల చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీచేశారు! వీరు గతంలో డోనాల్డ్ ట్రంప్‌కు మద్దతిచ్చారు. జనవరి 6 క్యాపిటల్ దాడికి బాధ్యులు. వీరిపై హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడినట్టు నేరం రుజువైంది. దేశవ్యాప్తంగా డైవర్సిటీ, ఈక్విటీ అండ్ ఇంక్లూజన్ (డీసీఐ) కార్యక్రమాలను రద్దుచేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. జాతీయ పార్కుల్లోకి ఉచిత ప్రవేశాన్ని తన పుట్టినరోజు తేదీకి మార్చేశారు. బహుళ ట్రంప్ బ్రాండ్‌లతో క్రిప్టో బిజినెస్‌లను ప్రారంభించడం మరో వివాదానికి దారితీసింది.

**పెరిగిన సొంత ఆస్తులు**

అమెరికా ఫస్ట్ పేరుతో ట్రంప్ అనుసరిస్తున్న అసంబద్ధ విధానాల వల్ల దేశం పరిస్థితి ఎట్లా ఉన్నా, ఆయన ఆస్తులు మాత్రం గణనీయంగా పెరిగా యని న్యూయార్క్ టైమ్స్ తాజా కథనం వెల్లడించింది. రెండోసారి అధ్యక్షుడైన ఏడాది కాలంలోనే ట్రంప్ ఆస్తులు ఏకంగా 1.4బిలియన్లు పెరిగాయట! తన క్రిప్టో కరెన్సీ వెంచర్ల నుంచి ఇంత పెద్దమొత్తంలో సంపాదించగలిగాడన్నది ఆ విశ్లేషణ సారాంశం. “వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్”, “మీమ్ కాయిన్” ద్వారా వందల మిలియన్ల డాలర్లు ట్రంప్ కుటుంబానికి



# రితనం'..!

వచ్చాయని వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఒమన్, సౌదీ అరేబియా, వియత్నాం వంటి దేశాల్లో ట్రంప్ బ్రాండెడ్ ప్రాజెక్టుల ద్వారా కోట్లాది రూపాయలు, లైసెన్సింగ్ ఫీజుల రూపంలో 23 మిలియన్ డాలర్లు సంపాదించినట్టు తెలుస్తోంది.

**తగ్గిన సానుకూలత రేటింగ్**

ట్రంప్ చేపడుతున్న ఇటువంటి తిక్క పనులతో విసిగెత్తిన అమెరికన్లలో ఆయన పట్ల ప్రతికూలత రేటింగ్ 2025 చివరి నాటికి గణనీయంగా పెరిగి ఏకంగా 60%కు చేరడం గమనార్హం. సివిల్ సర్వెంట్లపై సామూహిక కాల్పులు, ట్రంప్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా 2025 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా "నో కింగ్స్" పేరుతో ఆందోళనలు నిర్వహించారు. పుట్టుకతో పౌరసత్వ హక్కు రద్దు, పవన విద్యుత్ ఉత్పత్తికి అనుమతులను నిలిపేయడం వంటి చాలా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లకు వ్యతిరేకంగా ఫెడరల్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ కొనసాగుతోంది.

**నోబెల్ ప్రైజ్ నుంచి యుద్ధాల దిశగా...**

ఎంత మొత్తుకున్నా నోబెల్ ప్రైజ్ రాకపోయేసరికి తన పంథాను మార్చుకొని డెన్మార్క్ ఆధీనంలోని గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటిం చారు. ఇందుకోసం అక్కడి పౌరులకు కొంతమొత్తంలో చెల్లింపులు జరుపుతామన్నారు. డెన్మార్ ఎదురు తిరగడంతో, బలప్రయోగం తప్పదని హెచ్చరించి నప్పటికీ, నాటో దేశాలనుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఇప్పుడు బలప్రయోగం మాటను పక్కనబెట్టి, అక్కడ లభించే అరుదైన ఖనిజాలకోసం కాదని, కేవలం అమెరికా రక్షణకు గ్రీన్‌ల్యాండ్ చాలా అవసరమంటూ స్వరంలో తీవ్రత తగ్గించారు. రష్యా, డెన్మార్క్, అమెరికాల మధ్య ఉన్న ఈ భూభాగంలో చైనా కార్యకలాపాలు పెరగడం ట్రంప్‌కు ఎంతమాత్రం ఇష్టంలేదు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని పదేపదే ప్రకటనలు గుప్పించడం వెనుక ప్రధాన కారణం ఇదే! ఇక జనవరి మొదట్లో వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను పదవినుంచి తప్పించాలని ఆదేశాలు జారీచేయడమే కాకుండా, సైన్యాన్ని పంపి అర్ధరాత్రి దాడి చేసి మరీ మదురోను, ఆయన భార్యను అరెస్ట్ చేయించి అమెరికాకు తరలించారు. వెనుజులా అధ్యక్షుడిని తానేనంటూ ప్రకటించారు. అంతకుముందు వెనుజులా నుంచి ఏ దేశమూ చమురు కొనడానికి వీల్లేదని హుకుం జారీచేసిన ట్రంప్, ఇప్పుడు ఈ దేశంనుంచి చమురు కొనుగోలు చేయాలని మనదేశంతో సహా వివిధ దేశాలను కోరుతున్నారు. ఇక గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును ఏకంగా గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చేశారు. ఏకంగా ఖతార్ నుంచి బోయింగ్-747 విమానాన్ని బహుమతిగా స్వీకరించడం పెద్ద దుమారమే లేపింది. ప్రపంచంలోనే స్వేచ్ఛకు మారుపేరుగా ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే అమెరికాను పాలిస్తున్న ట్రంప్ ఇప్పుడు స్వేచ్ఛ ముసుగులో నియంతగా వ్యవహరిస్తూ దేశీయంగా, అంతర్జాతీయంగా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారు.

**శాంతి వర్సెస్ యుద్ధం**

కాసేపు శాంతి...మరికొంతసేపు యుద్ధం...ఇదీ ట్రంప్ వ్యవహారం. తాను ఏది కోరుకుంటే అది కావాల్సిందే. సహకరించనివాళ్లను గుర్తుపెట్టుకొని మరీ వేధించడం ఆయన నైజం. మొదట్లో నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ నానా యాగీ చేసి సాధ్యం కాకపోవడంతో వెనుజులా, సిరియాలపై యెమెన్, దాడులు చేశారు. తాజాగా ఇరాన్‌వైపునకు అమెరికా సైన్యాలు వెళుతున్నాయి. మరోవైపు గ్రీన్‌లాండ్ తమకు ఇవ్వాల్సిందేనని నాటో వ్యవస్థాపక దేశం డెన్మార్క్ పై కారాలు మిరియాలు నూరడం వర్తమాన చరిత్ర. ఇక గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేయాలంటూ ట్రంప్ చేస్తున్న డిమాండ్‌తో నాటో దేశాల మధ్య ఐక్యత బీటలువారే పరిస్థితి నెలకొంది. మిగిలిన నాటో దేశాలు డెన్మార్క్‌కు మద్దతుగా నిలిచాయి. ట్రంప్ మొండిపట్టుపై తమ తదుపరి కార్యాచరణపై చర్చలు జరిపేందుకు యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు జనవరి 22న బ్రెస్సెల్స్‌లో అత్యవసర సమావేశం జరిపాయి. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఈ సమావేశానికి నేతృత్వం వహించారు. గ్రీన్‌లాండ్ విషయంలో తనకు మద్దతివ్వని పది ఈయూ దేశాలపై పదిశాతం సుంకాలు విధిస్తానని హెచ్చరించిన ట్రంప్ తర్వాత వెనక్కు తగ్గారు. నాటో చీఫ్ మార్క్ రుట్టేతో జరిగిన చర్చల్లో ఆర్కిటిక్ భద్రతపై భవిష్యత్ ఒప్పందానికి అంగీకారం కుదిరిన నేపథ్యంలో ఈ సుంకాల ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటున్నానని ట్రంప్ సోషల్ మీడియా అకౌంట్‌లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా గ్రీన్‌లాండ్ విషయమై రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ "ఇది మాకు సంబంధించిన వ్యవహారం కాదు. వాళ్లూ వాళ్లూ చూసుకుంటారు" అని స్పష్టం చేయడం ద్వారా అమెరికాకు సానుకూలంగా వ్యవహరించారు. 1917లో డెన్మార్క్ వర్జిన్ దీవులను అమెరికాకు అమ్మేసింది. 1867లో రష్యా అలాస్కాను 72లక్షల డాలర్లకు అమ్మేసిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేయడం గమనార్హం.

**బోర్డ్ ఆఫ్ పీస్ ప్రహసనం**

మరోవైపు గాజా పునర్నిర్మాణ, అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన. ఇందులో భాగంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాలు జరుగుతున్న దావోస్ వేదికగా శాంతి మండలి (బోర్డ్ ఆఫ్ పీస్)ను ఏర్పాటు చేశారు. ఈ మండలిలో చేరేవాళ్లు ఒక బిలియన్ డాలర్లు చెల్లించాలి. దీనికి 35 దేశాలు మద్దతు తెలిపినా, మనదేశం ప్రస్తుతానికి తటస్థంగా వుంది. ముఖ్యంగా ఈ మండలి చట్టబద్ధత విషయంలో సందేహాలే మనదేశ వైఖరికి ప్రధాన కారణం. కాగా ఐరోపా సమాఖ్య దేశాల్లో కొన్ని ఈ శాంతి మండలిలో చేరేందుకు సుముఖంగా లేవు. ఇదిలా ఉండగా అమెరికా అనుంగు మిత్రుడు ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు మొదట దీన్ని వ్యతిరేకించినా తర్వాత అంగీకరించారు. కానీ తాజాగా ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బర్కత్ మాట్లాడుతూ, ఈ శాంతి మండలిలో ఖతర్, టర్కీవంటి ఉగ్రవాదులకు మద్దతిచ్చే దేశాలను సభ్యులుగా అంగీకరించబోమని స్పష్టం చేశారు. గాజాలో పాకిస్తాన్ బలగాలను విశ్వసనీయ భాగస్వామిగా పరిగణించబోమని కూడా కుండబద్దలు కొట్టడంతో ఇప్పుడు గాజా శాంతి మండలి (బోర్డ్ ఆఫ్ పీస్) వ్యవహారం గందరగోళంగా మారింది.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్




**ట్రంప్ వర్సెస్ ఇండియా**

ట్రంప్‌తో మనదేశం ఎదుర్కొన్న ప్రధాన సమస్య టారిఫ్‌లు. ప్రస్తుతం అమెరికా మనదేశంనుంచి వచ్చే దిగుమతులపై 50% టారిఫ్ అమలు చేస్తోంది. ఇందులో 10% బేస్‌లైన్ డ్యూటీ కాగా, 25% మార్కెట్ యాక్సెస్ కోసం విధించే రెసిప్రోకల్ టారిఫ్. ఇక 15% నుంచి 20% వరకు రష్యా చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు విధించిన పెనాల్టీ టారిఫ్. అమెరికా విధించిన ఈ టారిఫ్‌ల వల్ల మనదేశం నుంచి ఎగుమతి అయ్యే వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ టారిఫ్‌ల వల్ల మన ఎగుమతుల్లో 36% వరకు తగ్గుదల నమోదు కావచ్చని, ఫలితంగా జీడీపీ 0.5% నుంచి 1% వరకు పడిపోతుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేసినా, వాస్తవంగా మన జీడీపీ ఎక్కడా తగ్గలేదు సరికదా వృద్ధి నమోదు చేసి అందరినీ ఆశ్చర్యపరచింది. ఇదిలా ఉండగా ఔషధాలు, సెమికండక్టర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను ఈ సుంకాల నుంచి మినహాయించింది. ఇరాన్‌తో వ్యాపారం చేస్తున్న దేశాలపై ఈనెల 13 నుంచి మరో 25% సుంకాలను విధిస్తూ ట్రంప్ చేసిన మరో ప్రకటన వల్ల మనదేశం నుంచి ఎగుమతి అయ్యే బియ్యం, రసాయనాలు, టీ వంటి వాటిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముంది.

భారత్ మిగిలిన దేశాల మాదిరిగా ట్రంప్ టారిఫ్‌లకు బెదిరిపోలేదు. తక్షణమే ప్రత్యామ్నాయ మార్కెట్లను విస్తృతం చేసుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా 2025 చివరి నాటికి చైనాకు మనదేశంనుంచి ఎగుమతులు 70%-80% పెరిగాయి. ఇదే సమయంలో ఈయూ, యురేసియన్ ఎకనామిక్ యూనియన్ (ఈఏఈయూ), ఒమన్ దేశాలతో ఫాస్ట్ ట్రాక్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇక దేశీయంగా ప్రభుత్వం జీఎస్టీలో కోత, పన్నుల మినహాయింపు వంటి ఆర్థిక ఉద్దీపన చర్యలు చేపట్టింది. ముఖ్యంగా శ్రామికులు అత్యధికంగా అవసరమైన వస్త్ర, చిన్నకార్ల తయారీ రంగాలను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న చర్యలు దేశీయ వినియోగాన్ని భారీఎత్తున పెంచాయి. యు.ఎస్.పై ఆధారపడటాన్ని మరింతగా తగ్గించేందుకు, డీడాలరైజేషన్ ప్రక్రియను నిశ్శబ్దంగా అమలు చేయడం మొదలుపెట్టింది. ఇందులో భాగంగా రష్యాతో రూపీ-రూబుల్ వాణిజ్యం కొనసాగిస్తోంది. ఇదే ప్రక్రియను బ్రిక్స్, ఈఏఈయూలతో కూడా కొనసాగిస్తూ క్రమంగా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గిస్తూ వస్తోంది.

భౌగోళిక రాజకీయాల్లో నియంత్రించేందుకు ట్రంప్ ప్రయోగిస్తున్న టారిఫ్ అస్త్రాన్ని మనదేశం సమర్థవంతంగా ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ నిలిపివేయడానికి తానే ప్రధాన కారణమని చేస్తున్న ట్రంప్ ప్రచారాన్ని భారత్ అంగీకరించలేదు. కేవలం పాకిస్తాన్ కాళ్లబేరానికి రావడం వల్లనే ఈ ఆపరేషన్‌ను నిలిపేశామని స్పష్టం చేసింది. అయినప్పటికీ ట్రంప్ తన అబద్ధపు ప్రచారాన్ని ఆపలేదు. ఇప్పటివరకు 51 సార్లు ఇదే అంశాన్ని ప్రస్తావించినా మనదేశం ఏమాత్రం చలించలేదు. ఇరుదేశాల మధ్య ఉన్నతస్థాయి రక్షణ సంబంధాలు కొనసాగుతున్నప్పటికీ, మనదేశ నాయకత్వం ఆత్మనిర్భర్ భారత్‌వైపు దృష్టి కేంద్రీకరించి ఆ దిశగా వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఇక హెచ్1బీ వీసాలపై అమెరికా మరింత కఠినంగా వ్యవహరిస్తుండటం ప్రస్తుతం మన ఐటీ రంగం, అక్కడి మన ఐటీ నిపుణులకు ఇబ్బందికరంగా మారింది.

**చైనాయే ప్రధాన ప్రత్యర్థి**

చైనాపై కూడా ట్రంప్ ప్రభుత్వం టారిఫ్ లతో పాటు వివిధ రకాల ఆంక్షలను విధించింది. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని ప్రకటించడం వెనుక, అక్కడ చైనా కార్యకలాపాలు పెరుగుతుండటమే ప్రధాన కారణం. చైనా మిలిటరీ కంపెనీలైన "టెన్‌సెంట్", "కాస్‌కో షిప్పింగ్" సంస్థలపై యుఎస్ ఆంక్షలు విధించింది. చైనా సాంకేతిక, సంక్లిష్ట మౌలిక రంగాలు, వ్యవసాయ రంగాలపై గత ఏడాది యు.ఎస్. ఆంక్షల కొరడా ఝుళిపించింది. ఇరాన్ చమురును శుద్ధి చేస్తున్న చైనా కంపెనీలను కూడా వదిలిపెట్టలేదు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ట్రంప్-జిన్‌పింగ్‌ల మధ్య భేటీ జరగనుంది. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య నెలకొన్న విభేదాలకు ఒక పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరిగే అవకాశముంది. ★



# సమాజానికి స్ఫూర్తిదాయకంగా యువత ఉండాలి

**సికింద్రాబాద్ :** ఒక సంస్థ తమ కార్యకర్తలను ఏ విధంగా తయారు చేస్తుందో ప్రత్యక్షంగా తెలుసు కున్నానని, ప్రస్తుతం యువత సమాజానికి స్ఫూర్తి దాయకంగా ఉండాలి అని ఎంపీజో ఐటి సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు డా. కాశీనాథుని శిరీష అన్నారు.

రాష్ట్ర సేవికా సమితి సికింద్రాబాద్ విభాగ్ ఆధ్వర్యంలో జనవరి 25న అల్వాల్ పల్లవి మోడల్ స్కూల్‌లో జరిగిన సంక్రాంతి ఉత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ప్రధానవక్తగా పాల్గొన్న సమితి అఖిల భారత ప్రముఖ కార్యవాహిక అన్నదానం సీతాగాయత్రి ప్రసంగిస్తూ సంఘ ప్రేరణతో అనేకమంది వ్యక్తులు, సంస్థలు ఏ విధంగా పరివర్తన చెందారో, చెందు తున్నారో ప్రస్తుత సమాజంలో చూస్తున్నాము. 925లో డాక్టర్‌జీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభించడం గురించి ప్రస్తావిస్తూ వ్యక్తి నిర్మాణం చేస్తూ సామాజిక మార్పును చూడగలగాలి అనేది వారి సంకల్పం అని అన్నారు. 1940 శిక్షావర్గలో వారు మాట్లాడుతూ నేనిక్కడ సంపూర్ణ భారతదేశాన్ని దర్శించుకుంటున్నా నని సంతోషపడుతూ స్వయంసేవకులు భావితరాల్లో తీసుకుని రాబోయే సామాజిక మార్పును వారు దర్శించారని వివరించారు.

భారతదేశంపై ఎన్నిసార్లు దాడులు జరిగి నప్పటికీ స్వరాజ్యానికి అతీతంగా మాతృమూర్తులు పనిచేశారని, ధర్మాన్ని నిలబెట్టగలిగే సంతానాన్ని భారతమాతకు అందించారని అన్నారు. మాతృ మూర్తులలో నిగూఢమైనటువంటి శక్తిని బహిర్గతం చేసే వ్యక్తి నిర్మాణం దిశగా 1936లో రాష్ట్ర సేవికా సమితి స్థాపితమైందని తెలిపారు. సంఘ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచపరివర్తన అనే ఒక కొత్త ఆలోచన సమాజంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, కుటుంబం ప్రబోధన,నాగరిక కర్తవ్యం మొదలైనటువంటి పరివర్తన అంశాలను గురించి ప్రస్తావించారు. సంక్రాంతి అనగా సమ్యక్ క్రాంతి అని కొత్తదనాన్ని, కొత్త కాంతిని జీవితాల్లోకి తెచ్చు




కుంటున్నామని తెలిపారు. ఆ సందర్భంగా నువ్వులు, బెల్లము కలగలిపి అందరము పంచుకొని తింటున్నా మని ప్రస్తావించారు. ప్రస్తుతం కుటుంబ వ్యవస్థలో అనవసరమైనటువంటి విషయాలు చొచ్చుకొని వచ్చి, మనుషులు దగ్గరగా ఉన్నప్పటికీ మనసులను దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమన్వయం, సంతులనం చేసుకోగలిగితే మనం విజయాలు సాధించగలుగుతామని అన్నారు.

ఒక సందర్భంలో చంద్రయాన్ విజయంలో పాల్గొన్నటువంటి ఒక శాస్త్రవేత్తని నేను కలిసినప్పుడు, తనకు, తన వృత్తికి ఇబ్బంది కలగకుండా తన మాతృమూర్తి సమన్వయం చేసుకున్న వైనాన్ని ఆ శాస్త్రవేత్త వెల్లడించారని తెలిపారు. స్త్రీలో నిద్రాణమైన శక్తిని జాగృతం చేయడం కోసం రాష్ట్ర సేవికా సమితి 90 సంవత్సరాల నుండి పనిచేస్తోందని సీతాగాయత్రి తెలియజేశారు. ఈ ఉత్సవంలో ప్రాంత కార్యవాహిక రాధక్క ప్రాంత కార్యకారిణి సభ్యులు, సేవికలు పాల్గొ న్నారు. ఉత్సవానికి ముందు అల్వాల్ పురవీధులలో సేవికలచే ఘోష్ సహిత పథసంచలన్ జరిగింది.

# శ్రీశ్రీశ్రీ కైలాసానందగిరి స్వామి సంస్మరణ సభ




**నెల్లూరు:** ఆర్‌ఎస్‌ఎస్ నెల్లూరు జిల్లా కార్యవాహగా, విభాగ్ సేవాప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీశ్రీశ్రీ కైలాసానందగిరి స్వామి (పూర్వాశ్రమంలో జయరామరాజు) జనవరి 16న శివైక్యం చెందారు. చిత్తూరు జిల్లా భట్టికండ్రిగ గ్రామంలో జన్మించి, విద్యానగర్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేసి తెలుగు పండితులుగా నెల్లూరుజిల్లాలో పలుచోట్ల పనిచేసి పదవీ విరమణ తర్వాత కైలాసకోన శాంతి ఆశ్రమ పీఠాధిపతులుగా శ్రీశ్రీశ్రీ కైలాసానందగిరి స్వామి పేరుతో సన్యాసం స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామి సంస్మరణ సభ జనవరి 22న నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్ ప్రాంగణంలో జరిగింది. ప్రధానవక్తగా పాల్గొన్న సామాజిక సమరసత వేదిక అఖిల భారత సంయోజక్ కె. శ్యాంప్రసాద్ ప్రసంగిస్తూ తరచూ ఆయనను బదిలీచేసేవారని, వెళ్లిన ప్రతిచోటా సంఘకార్యాన్ని వృద్ధిచేసి కార్యకర్తలను అధిక సంఖ్యలో తయారుచేసేవారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘచాలక్ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, విభాగ్ సంఘచాలక్ పల్నాటి రామదండు, వారితో అనుబంధం ఉన్న అనేకమంది కార్యకర్తలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.




**చరిత్ర గురించి తెలియకుండా ఉండటం అంటే ఎప్పటికి పిల్లవాడిగా ఉండటమే – మార్కస్ తుల్లియస్ సిసిరో. మన అయోధ్య, కొరియా దేశాల నడుమ శతాబ్దాలుగా విడదీయరాని బంధం ఉంది. అది కూడా రక్తసంబంధం. ఇవాళ్టికీ కొనసాగుతున్నది కూడా. హన్యాంగ్ విశ్వవిద్యాలయం ఆచార్యుడు ప్రొఫెసర్ బూయాంగ్ మాకిమ్ (2010లో) ఒక సందర్భంలో అన్నమాటలు పరిశీలించండి! 'భారత్–కొరియాలు సరుకులనే కాదు, జన్యువులను కూడా**

# భారత యువర
# కొరియా రాణి

అయోధ్య–కొరియాల ఆ విడదీయరాని బంధం ఎలా మొదలయింది? క్రీ॥శ॥ 48లో అయోధ్య యువరాణి 'సూరిరత్న' సముద్రమార్గంలో కొరియా చేరుకుంది (కొన్ని రచనలు ఆమె పాండ్య రాజ్యం నుంచి వెళ్లిందని అంటున్నాయి). రెండు చేపలు ముద్దాడుతున్నట్టు ఉండే ఓ శిల్పాన్ని వెంట తీసుకెళ్లిందామె. ఆ రాతిశిల్పం ఉంటే సముద్రం ఆటుపోట్లను తగ్గిస్తుందని నమ్మకం. ఆ శిల్పం కూడా కొరియా సంస్కృతీ చిహ్నంగా మారిపోవడం మరొక విశేషం. కొరియా చేరుకున్న సూరిరత్న తన పేరును హోహింగ్ ఓక్ అని మార్చుకుంది. కారా వంశానికి చెందిన తొలి రాజు కిమ్‌ను వివాహం చేసుకుంది. వీరికి పదిమంది పిల్లలు. వారి సంతానమే కిమ్ హే కిమ్ పరంపర. రెండు కొరియాల్లోనూ కిమ్ వంశీకులే ఎక్కువ. సూరిరత్న తీసుకువెళ్లిన శిల్పం తరువాత కిమ్‌హే అనే పురావస్తు శాస్త్రవేత్తకు దొరికింది. ఆ గుర్తు, అలాంటి శిల్పం కొరియాలో ఉండే అవకాశం లేదు. అదే ఆయనను పరిశోధనకు ప్రేరేపించింది. అలా కొరియాను పాలించిన కారా రాజులకూ, అయోధ్య మిశ్రా రాజులకూ వియ్యం ఉందని కనుగొన్నాడు.



రాణి ప్రతిమ, వారణాసి

కొరియా తూర్పు ఆసియాలోని ఒక ద్వీపకల్పం. కొరియా అనే పదం గొరియో అనే పదం నుండి వచ్చింది. ఇది రెండో ప్రపంచ యుద్ధం తరువాత రెండు దేశాలుగా (ఉత్తర కొరియా, దక్షిణ కొరియా) విడిపోయింది.కొరియా భాషను దక్షిణ కొరియాలో 'హంగూ జియో' అనీ, ఉత్తర కొరియాలో 'చోసోనో' అంటారు. భారత్‌తో తమ బంధం గురించి బీజమాత్రంగా తెలిసిన పాత కొరియా వాసులకు దక్షిణ కొరియా టీవీలో 2010లో వెలువడిన ఒక ధారావాహిక కార్యక్రమం ఆ బంధంలోని గాఢతను వెల్లడించింది. నిజానికి 2001లోనే వందమంది కొరియన్ల ప్రతినిధి బృందం అయోధ్యకు వచ్చింది. తమ రాణి పేరిట సరయూ తీరంలో ఓ స్మారకాన్ని నిర్మించింది. దక్షిణ కొరియా మాజీ ప్రధాని కిమ్ జాంగ్‌పిల్ 2001లోనే అయోధ్య రాజ వంశీకుడు బిమలేంద్ర మోహన్ ప్రతాప్ మిశ్రాకు ఓ లేఖ రాశారు. అది ధన్యవాదాల లేఖ. ఆ మార్చిలో తాము చేసిన భారత్ పర్యటన ప్రత్యేకమని, అయోధ్యలో పర్యటించాలన్న తన ఆకాంక్ష నెరవేరిందని కిమ్ తెలిపారు. సూరిరత్న– రాజు సురో వారసుల్లో తాను 72వ తరానికి చెందినవాడినని తెలియచేశారు కూడా. అయోధ్యను తమ పుట్టిల్లుగా భావిస్తామని వెల్లడించారు. అయోధ్య (సాకేత)ను సూర్యవంశ రాజులు పాలించారు. ప్రస్తుతం ఆ వంశానికి చెందినవారున్నారు. వీరిలో భీమేంద్ర మోహన్ ప్రతాప్ మిశ్రా ముఖ్యులు. తమ మూలాలను తలుచుకుంటూ ఏటా వందలాది మంది కొరియన్లు నేటికీ అయోధ్యను సందర్శిస్తారు. దక్షిణ కొరియా రాయబారి షిన్ బాంగ్ కిల్ కూడా ఇదే గుర్తు చేసుకున్నారు. కొరియా పురాతన చరిత్ర పుస్తకంలో అయోధ్యకు చెందిన యువరాణి రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నట్లు రాశారని ఆయన చెప్పారు. రాజు సమాధి వద్ద జరిపిన పురావస్తు తవ్వకాలలో అయోధ్యకు చెందిన కళాఖండాలు బయటపడిన సంగతి చెప్పారు.

చారిత్రక గాథల ప్రకారం సూరిరత్న పేరు ఉన్న అయోధ్య యువరాణి హియో క్రీ॥శ॥ 48లో సముద్రమార్గం ద్వారా కొరియాకు ప్రయాణించి, గయా రాజ్యస్థాపకుడైన రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నారు. ఈ రాణి పేరిట హియో మెమోరియల్ పార్క్ (రాణి హో మెమోరియల్) హియో హ్వాంగ్ ఓక్ స్మారకం అయోధ్యలో సరయూ తీరాన ఉంది. గతంలో ఇదే రామకథా పార్క్. భారత్‌లో డిసెంబర్ 25, 2025న 12 అడుగుల హియో రాణి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొరియా నుండి తెచ్చిన భారీ శిలా ఫలకం, రాణి సముద్ర ప్రయాణాన్ని సూచించేలా నిర్మించిన ఒక చెరువు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఇక్కడ ఉన్నాయి. దక్షిణ కొరియాలోని కారక్ (కారా వంశానికే భారత్‌లో పేరు) వంశీకులు సుమారు 60 లక్షల మంది ఈమెను మూల రాణిగా భావిస్తారు. వారు కూడా రావణుడు సీతాపహరణం చేసి చావు కొనితెచ్చుకున్నాడని నమ్ముతారు. సెంట్రల్ కరాక్‌క్లాన్ సొసైటీ సెక్రటరియేట్ జనరల్ కిమ్ చిల్ రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ వేడుక జనవరి 22, 2024)న హాజరయ్యారు.'అయోధ్యను మా అమ్మమ్మ ఇల్లుగా చూస్తాము' అని చెప్పారు. దక్షిణ కొరియాలో భారత రాయబారిగా పనిచేసిన ఎన్.పార్థసారథి సూరిరత్న జీవితం ఆధారంగా 'ది లెజెండ్ ఆఫ్ అయోధ్య ప్రిన్సెస్ ఇన్ కొరియా' నవల రాశారు. దీనిని కొరియన్ భాషలో 'బి డాన్ హ్యాంగ్ హలా' (సిల్క్ ప్రిన్సెస్) పేరుతో అనువదించి సియోల్‌లో ప్రచురించారు. నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఈ నవల ఆధారంగా పిల్లల పుస్తకాన్ని ప్రచురించింది.

కొరియన్ యువరాణి చేపబొమ్మ కథ కారక్ రాజ్యంలో చారిత్రక, పురాణగాథగా ప్రసిద్ధమయింది. అవి చెప్పేది కూడా సుమారు 2000 సంవత్సరాల క్రితం సూరిరత్న భారతదేశం వచ్చి సురోను వివాహం చేసుకున్నది అనే. ఇక్కడ కొంత భిన్నమైన కథనం వినిపిస్తుంది. ఆమె అయోధ్య నుండి కాక దక్షిణ భారత్‌లోని పాండ్యరాజ్యం నుండి

పంచుకునేవి. కారా వంశానికి తల్లి అయోధ్య (భారత్‌) నుంచి సముద్రమార్గంలో వచ్చింది. అందుకే అయోధ్య అంటే మా అమ్మగారి పుట్టిల్లు. ఉత్తరప్రదేశ్‌లో ప్రాచుర్యంలో ఉండే రెండు చేపల ముద్ర ఉమ్మడి కొరియాలో అధికంగా కన్పించేది. తరతరాలుగా కొరియన్లు రాముడిని కొలుస్తున్నారు కూడా!' కాబట్టి పురాతన భారత నాగరికత సుదూర దేశ సంస్కృతిని ఏ విధంగా ప్రభావితం చేసిందో ఈ ఉదంతం చెబుతున్నది. అందుకు మాధ్యమం చరిత్ర.



దక్షిణ కొరియా అధ్యక్షుని సతీమణి కిమ్‌ జంగ్‌ సూక్‌ 2018లో అయోధ్య క్వీన్‌పార్క్‌కు వచ్చినప్పుడు సీఎం ఆదిత్యనాథ్‌ స్వాగతం పలికినప్పటికి చిత్రం

# ాణి సూరిరత్న
# హోహింగ్ ఒక్కరే

వెళ్లిందని ఎ.జె.ఓవియా తన సిద్ధాంత వ్యాసంలో వాదించారు. పాండ్య రాజ్యానికి చెందిన యువరాణి సూరిరత్న ఒక పడవలో ప్రయాణించి కారక్‌ రాజ్యానికి చేరుకుంది. కారక్‌ రాజు ఆమెను ఆహ్వానించి, గౌరవించి వివాహం చేసుకున్నాడు. ఇది రెండు రాజ్యాల మధ్య సంబంధాలకు నాంది పలికింది. ఇక్కడ పాండ్య రాజ్యానికి చేప బొమ్మే చిహ్నం. కొరియన్లు ఆమె రాకను, ఆమె వెంట వచ్చిన సంస్కృతిని గౌరవిస్తూ చేప బొమ్మనే రాజచిహ్నంగా స్వీకరించారు. 13వ శతాబ్దానికి చెందిన ఒక కొరియా గ్రంథంలో ఒక రాణి 'అయుత' నుంచి వచ్చిందని కనిపిస్తుంది. బహుశ ఇది అయోధ్యకు భ్రష్టరూపమని చరిత్రకారుల భావన. పురాతన తమిళులు సముద్ర వాణిజ్యం, మృదువైన దౌత్యంతో ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారని చారిత్రక ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. 'యాదుం ఊరే యావరుమ్‌ కేలిర్‌' (మనకు అన్ని పట్టణాలు ఒకటే, అందరు మనుషులు ఒకటే. మనది ప్రపంచ రాజ్యం) అనే ప్రసిద్ధ తమిళ ఉల్లేఖన ఇలా వచ్చినదే కావచ్చు. దీనినే ఐక్యరాజ్యసమితి నినాదంగా స్వీకరించింది కూడా.

ఆరు మిలియన్ల కొరియన్‌లు లేదా కొరియా జనాభాలో 10% మంది తమ పూర్వులు ఒక భారతీయ యువరాణి సంతానమంటే నమ్ముతున్నారా? అన్నది ప్రశ్న. కానీ ఇదే నిజమని 13వ శతాబ్దం నాటి బౌద్ధ సన్యాసి కొరియన్‌ రచన 'సంగుక్‌ యుసా'లో పేర్కొన్నారు. దీని అర్థం మూడు రాజ్యాల కథ. 16 ఏళ్ల భారతీయ యువరాణి 'సెంబావలం' గురించి ఆ రచయిత ప్రస్తావించారు. ఆమె 'హియో–హ్వాంగ్‌ ఓక్‌' అని, ఆమె కిమ్‌ సురోను వివాహం చేసుకుని 'గెమ్వాన్‌ గయ' రాజ్యానికి మొదటి రాణి అయిందని ఆ రచన కూడా చెబుతున్నది. ఆమె తన సేవకులతో ఇక్కడకు చేరింది. ఆ పరివారం అక్కడే స్థిరపడిపోయింది. దీనితో తమిళ సంస్కృతి వ్యాప్తికి దోహదపడింది. హియో, లీ, కిమ్‌ వంశాలు తాము ఆ రాణి వారసులమేనని అభిప్రాయ పడుతున్నారు. హియో వంశీకులు భారతదేశ దక్షిణ భాగంలోని అయుత రాజ్యాన్ని అయోధ్యతో తప్పుగా పోలుస్తున్నారన్న వాదన ఉంది. ఇది నిజం. ఎందుకంటే ఆ సమయంలో అయోధ్యను 'సాకేత' మనేవారు. సంగుక్‌ యుసా గ్రంథం 13వ శతాబ్దం నాటి రచన. కాబట్టి అది అయోధ్యను సూచించలేదు. ఇక్కడ అయుత రాజ్యం పురాతన పాండ్యన్‌ రాజవంశానికి చెందిన 'ఆయ్‌ రాజ్యం'ను సూచిస్తుంది. యువరాణి తనతో త్రిశూలంలో జంట చేపలు చిహ్నాన్ని తీసుకువెళ్లింది. పాండ్యన్‌ రాజ్య పతాకాలు, నాణేలపై ఉన్నదీ రెండు చేపల గుర్తే. యువరాణి హియోను తమిళంలో సంబావలం (ఎర్ర పగడం') పేరుతోనూ పిలుస్తారు. అలానే కొరియా భాషలో హియో హ్వాంగ్‌–ఓక్‌ అంటే అర్థం కూడా ఎర్ర పగడమే.

చిత్రంగా తమిళ–కొరియన్‌ సంస్కృతుల మధ్య సారూప్యతలున్నాయి. ప్రాచీన తమిళులు ఆగ్నేయాసియా దేశాలు సహా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలతో నౌకా వ్యాపారం చేశారని చెప్పే చారిత్రకాధారాలున్నాయి. పాండ్య రాజ్యం కూడా 2000 సంవత్సరాల క్రితం కొరియాతో సముద్ర వాణిజ్య సంబంధం కలిగి ఉంది. భాష, సాంస్కృతిక వ్యక్తీకరణలు, ఆహారం, ఆటల విషయంలో ఆ ప్రజల నడుమ సారూప్యత ఉంది. భవిష్యత్తును అంచనా వేయడానికి గతాన్ని అర్థం చేసుకోవాలి. ఇనుపయుగం నుండి భారతదేశం, కొరియా వాణిజ్య భాగస్వాములు. ఇది చాలామందికి తెలియదు. అలాగే కొరియాలో అత్యధికంగా ఆరాధించే రాణి భారతీయురాలేనని కూడా మనకు తెలియదు.

కొరియన్ల 'గొంగి' ఆట, తమిళుల 'అన్నంగల్‌' ఆట ఒకటే. వాటి నియమాలు ఒకటే. గులకరాళ్లతో కొరియా పిల్లలు, మహిళలు ఆడేదే గొంగి. ఇది తమిళనాడు, కేరళలోను ప్రసిద్ధి. కొరియన్లు వరి అన్నంతో పచ్చళ్లతో కూడిన భోజనం ఇష్టపడతారు. తమిళులూ అంతే. కొరియన్ల ఆహారం వరి. వరి సాగును తమిళులే నేర్పారు. తమిళుల మాదిరిగానే బిడ్డ పుట్టినా, గృహప్రవేశం చేసినా కొరియన్లు బియ్యంతో చేసిన మిఠాయిలను తప్పక పంచుతారు.



వారణాసిలో స్మారక స్థలి

ఉరుగై (కిమ్చి), కోజు కట్టై (సాంగ్‌ప్యోన్) నువ్వుల కేకు (యెూటిగాంగ్ జియెూంగ్) అపైదోసై (కిమ్చి–జియోన్) స్వీట్ పొంగల్ (యాక్సిక్) వంటి వంటకాలు కొరియా, తమిళ ప్రాంతంలో సారూప్యతను కలిగి ఉంటాయి. తమిళనాట 'సుందకంజి', కొరియా వారి 'మక్గోల్లి' (పులియబెట్టిన బియ్యంతో చేసే మద్యం) ఒకే విధంగా ఉంటాయి. కుమ్మి తమిళ నాడు, కేరళలో ప్రసిద్ధిచెందిన నృత్యం. ఇది మహిళలు చప్పట్లు కొడుతూ లయబద్ధమైన సంగీతానికి వృత్తాకారంలో చేసే నృత్యం. దీనిని పంటల పండుగ పొంగల్ సందర్భంలో చేస్తారు. 'గంగ్ గాంగ్ సూల్లె' అనేది కూడా సమృద్ధిగా పంట పండాక కొరియా ప్రజలు చేసే నృత్యం. భాషా పరంగానూ సారూప్యతలు ఉన్నాయి. కొరియా, తమిళ భాషలలో ఒకే అర్థాన్నిచ్చే 500 పదాలను పరిశోధకులు కనుగొన్నారు. మోర్గాన్ ఇ.క్లిప్పింగర్ పరిశోధన ప్రకారం కొరియా, ద్రావిడ భాషల మధ్య ఎల్లప్పుడు లెక్సికల్ సంబంధం ఉంది. సంప్రదాయా నికి వస్తే తమిళులు అనుసరించే నడుక్కల్ సాంప్రదాయాన్ని క్వీన్ హియెూహింగ్ – ఓక్ సమాధిలో చూడవచ్చు. హియెూను కొరియాలో దేవతగా పూజిస్తారు. ఈ రెండు ప్రాంతాల మధ్య మరొక ప్రత్యేక సారూప్యత 'ముత్యాల వేట'. పగడాల కోసం జరిపే ముత్యాల వేట తమిళనాడులో 2000 సంవత్సరాల క్రితం ఉంది. ఇది యువరాణి హియెూ సురోను వివాహం చేసుకున్న తరువాత కొరియాలో ప్రారంభమైంది. ముత్యాల కోసం లోతైన సముద్రంలో కొరియన్లు డైవింగ్ చేస్తారు.

ఆ యువరాణి అయోధ్య లేదా తమిళ వనిత అయినా భారతీయ వనిత అన్నది నిజం. మన పూర్వీలు నెలకొల్పిన దౌత్య సంబంధాన్ని కొనసాగించి కొరియా–భారత్ మధ్య భాషా సాంస్కృతి వాణిజ్య, ఆర్థిక సంబంధాలు పెంపొందించుకోవడం ఉభయులకు ఎంతో మేలు.

**మూలం:**

1. ది ఆర్మ్ చైర్ జర్నల్ (అక్టోబరు 29, 2021)
2. కొరియా యువరాణి సెంబావలం గురించి చెప్పని కథ– ఎ.జె.ఓవియా
3. సంగుక్ యూసా–ఇలియాన్ (ఎ మెమోరబులియా ఆఫ్ త్రీ కింగ్‌డమ్స్).



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు



# చెంచాలు,



**ఏదైనా బొమ్మల దుకాణంలోకి అడుగు పెట్టండి లేదా ఆన్‌లైన్‌లో చిన్నారుల కోసం అమ్ముతున్న బొమ్మలను ఒకసారి పరిశీలించండి. రంగులు, శబ్దాలు, హామీలతో కూడిన ఒక వర్ణవిలాస ప్రపంచం మన ముందుకు వస్తుంది. లాలిపాటలు పాడే మృదువైన బొమ్మల నుంచి, శిశువు చేసే చిన్న శబ్దాలకు స్పందించే ఇంటరాక్టివ్ రోబోల వరకు, అన్నీ అక్కడే ఉంటాయి. ఇవన్నీ "వికాసానికి అవసరం", "ఉత్తేజకరం", "బుద్ధి వికాసానికి అత్యంత కీలకం" అని ప్రచారం చేస్తారు. కానీ కాస్త ఆగి ఒక ప్రశ్న వేసుకుందామా! నిజానికి ఈ బొమ్మలు ఎవరి కోసం?**

నిజం చెప్పాలంటే, ఆరు నెలల బిడ్డకు టెడ్డీ బేర్ రూ.200 ఖర్చయిందా? లేక రూ.2,000 ఖర్చయిందా? అన్నది ఏ మాత్రం పట్టదు. రెండేళ్ల చిన్నారిని టచ్ స్క్రీన్ లెర్నింగ్ టాబ్లెట్, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలలో ఏదీ కావాలో చెప్పమంటే, టంబ్లర్ లాంటి స్టీలు పాత్రల వైపే చేతులు చాస్తుంది. ఇదీ అసలు సంగతి.

**ఈ బొమ్మలు పిల్లల కోసమా మరి పెద్దల కోసమా?**

ఆధునిక బొమ్మల మార్కెటింగ్ చాలా అరుదుగా పిల్లలను లక్ష్యంగా చేసుకుంటుంది. ఎందుకంటే పిల్లలు చిన్నవాళ్లు. ఆ ప్రకటనలను అర్థం చేసుకునే వయసు, జ్ఞానం వారికి ఉండదు. మరి అసలు లక్ష్యంగా పెట్టుకునేది ఎవరిని? తల్లిదండ్రులు, తాతమ్మలు, మేనమామలు, అత్తలు, స్నేహితులు. వీరందరూ సున్నిత మనస్కులు. పర్సుల నిండా డబ్బులు కలిగిన పెద్దలు.

మన పిల్లలకు "అత్యుత్తమమైనది ఇవ్వాలి" అనే భావోద్వేగ తపన ఈ పరిశ్రమకు సారవంతమైన నేలగా మారుతుంది. తయారీదారులకు ఇది బాగా తెలుసు. వారు అపరాధభావాన్ని రేకెత్తిస్తారు, వారు పెట్టే క్యాప్షన్లు "మీ బిడ్డ వెనుకబడిపోవాలని మీరు కోరుకుంటున్నారా?", "మీ బిడ్డకు ముందస్తు ఆధిక్యం ఇవ్వండి!", ప్రతిష్ఠను చూపిస్తారు "మన చిన్న రాజు/రాణికి ఉత్తమమైనదే కావాలి" అని ఉంటాయి. వీటన్నింటికి ప్రకాశవంతమైన రంగుల్లో ముసుగువేసి, అర్ధశాస్త్రీయ పదజాలంతో

# అట్టపెట్టెలే అసలైన ఆటవస్తువులు!



అలంకరిస్తారు. దాంతో ఒక సాధారణమైన బొమ్మ కూడా నోబెల్ బహుమతికి అర్హమైన ఆవిష్కరణలా అనిపిస్తుంది.

ముందర తరానికి చెందిన మనమంతా, నిజానికి ఇంకా మన మధ్య ఉన్న ఎందరో మేధావులు ఈనాటి ఆధునిక బొమ్మలతో ఆడుకున్న తరం మాత్రం కాదు. అలాగని మనం మన రంగాలలో రాణించ లేదా?! ఎంతో ప్రతిష్టాత్మక పదవుల్లోనూ, ఇంటిని చక్కగా తీర్చిదిద్దినవారమే కదా!! కాస్త ఆలోచిద్దామా?

**బొమ్మల సంస్కృతిలో మార్పు**

1990ల చివరి వరకు బొమ్మల ఎంపికలు చాలా సాదాసీదాగా ఉండేవి. చెక్కతో చేసిన సంప్రదాయ బొమ్మలు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొండపల్లి బొమ్మలు, లోహం లేదా మట్టితో చేసిన బొమ్మల వంటగది సెట్లు, ప్లాస్టిక్ వినియోగం కూడా చాలా పరిమితంగా ఉండేది. కానీ గత మూడు దశాబ్దాల్లో ప్లాస్టిక్‌తో తయారైన బొమ్మలు విపరీతంగా పెరిగాయి. వీటితో పాటు తక్కువ నాణ్యత గల గుడ్డతో నింపిన సాఫ్ట్ టాయ్స్, రోడ్డు పక్కన దొరికే ఆటవస్తువులు కూడా పెరిగాయి. ఇవి చిన్న పిల్లల ఆరోగ్యానికి, పరిశుభ్రతకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పరిమాణం పెరిగింది, కానీ నాణ్యత మాత్రం పెరగలేదు.

**బొమ్మల తయారీదారులు**

**అసలు విషయం మర్చిపోతున్నారా?**

బొమ్మల తయారీదారులు నిజంగా పిల్లల అభివృద్ధి, వారి ప్రవర్తనను అర్థం చేసుకోవడంపై కంటే మార్కెటింగ్ మానసిక శాస్త్రం, ఉత్పత్తి ఆకర్షణలపై ఎక్కువ పెట్టుబడి పెడుతున్నారా? అనే ప్రశ్న తలెత్తుతుంది. కొత్తదనం చూపించాలనే పోటీలో, దుకాణాలపై ఆధిపత్యం సాధించాలనే తపనలో, పిల్లలు నిజంగా ఇష్టపడేది సాదాసీదా వస్తువులేనన్న సత్యాన్ని మరిచిపోతున్నారా?

అమ్ముడయ్యేది ఏమిటో రూపకల్పన చేయడంలోనే సమయం, డబ్బు, సృజనాత్మకత ఖర్చవుతుందేమో గానీ, నిజంగా పిల్లలకు ఉపయోగపడేది ఏమిటో ఆలోచించడం తగ్గిందా? ఇవి ఆలోచనలకు దారితీసే ప్రశ్నలు. పిల్లల మనసును గౌరవించే పరిశోధన, పిల్లల కేంద్రిత దృక్పథం బొమ్మల రూపకల్పనలో అత్యవసరం.

**సరళతలోనే దాగిన ఆనందం**

చిన్న పిల్లలు ఉన్న ఏ తల్లిదండ్రులను అడిగినా ఒక విషయం చెబుతారు, ఖరీదైన సంగీత బొమ్మ మూలలో పడిపోతే, వంటగదిలోని చెక్క గరిటెతో పాత్రలను మోగిస్తూ లేదా ప్లాస్టిక్ గిన్నెలను ఒకదానిలో ఒకటి పెట్టుకుంటూ పిల్లలు గంటల తరబడి ఆడతారనే చెబుతారు. ఎందుకు? ఆ వయసులో ప్రపంచమే ఒక ఆటస్థలం. సాధారణమైనదే వారికి మాయాజాలం. మెరిసే గరిటె వెలుగును ప్రతిబింబిస్తుంది. ఒక కప్పు మరో కప్పులోకి సరిపోతుంది. ఒక అట్టపెట్టె లోపల కూర్చోవడానికి సరిపోతుంది. ఇవి యాదృచ్ఛికమైన ఆసక్తి కాదు, సృజనాత్మక అన్వేషణకు స్వచ్ఛమైన రూపాలు.

పిల్లలు బొమ్మను ధర చూసి గానీ, ప్యాకింగ్ చూసి గానీ తీర్పు ఇవ్వరు. స్పర్శ, శబ్దం, తమ చేతులతో మార్చగలగడం, ఇవే వారికి ముఖ్యమైనవి. వారికి వినోదం కాదు, పాల్గొనడం కావాలి. వారి అవసరాలు సులభమైనవే. మన పెద్దల ఆలోచనలే వాటిని క్లిష్టం చేస్తున్నాయి.

**పిల్లలకు స్వేచ్ఛను ఇద్దాం**

బహుశా విద్యాత్మక బొమ్మలు పిల్లలకంటే పెద్దలకే అవసరమేమో. పిల్లలకు "అన్నీ" ఇవ్వాలనే తొందరలో, వారికి నిజంగా అవసరమైనదాన్ని మరిచిపోతున్నామేమో. పిల్లలకు అన్వేషించే స్వేచ్ఛ, ఊహించే స్వేచ్ఛ, ముఖ్యంగా మన అంచనాల నుండి స్వేచ్ఛ కావాలి. అధికంగా, అతిగా ఉత్తేజపరిచే బొమ్మలతో వారి ప్రపంచాన్ని నింపితే, మన ఉద్దేశానికి విరుద్ధమైన ఫలితాలు రావచ్చు. దృష్టి, సృజనాత్మకత పెరగాల్సిన చోటును ప్లాస్టిక్, బ్యాటరీల దృష్టిభ్రమ లతో ముంచేస్తున్నాం. మనమే పిల్లల నుంచే నేర్చు కోవాల్సిన సమయం వచ్చింది. ఒక చెంచాను డ్రమ్‌స్టిక్‌లా మార్చడం, అట్టపెట్టెను కారు చేయడం, గుడ్డ ముక్కను టోపీలా కట్టుకోవడంలో వారికి కలిగే ఆనందం గమనించండి. వారు మనకు ఒక చెబుతున్నారు. ఆటకు బొమ్మతో పనిలేదు.. ఊహాశక్తి ఉంటే చాలు అనే గొప్ప సత్యాన్ని పిల్లలకు మనకు చెబుతున్నారు. దుకాణంలో మెరిసిపోతున్న కొత్త బొమ్మ మనల్ని ఆకర్షించినప్పుడు ఒక్క క్షణం ఆగి మనల్ని మనం ప్రశ్నించుకుందాం. ఈ బొమ్మను మన పిల్లల కోసం కొంటున్నామా? లేక పదిమంది ఎదుట మన హంగూ, ఆర్భాటాలను ప్రదర్శించుకుంటు న్నామా? అని. మళ్లీ అప్పటి సాదాసీదాతనానికి మనం తిరిగి రాగలమా? కొన్నిసార్లు పిల్లలకు నచ్చే ఆట వస్తువు రంగు రంగుల బొమ్మ పెట్టెలో ఉండదు, వంటగదిలో ఉంటుంది. ఆ వైపుగా ఆలోచిద్దామా?!



డా॥ జె.పి. భారతి కాజా
7989053047




# స్వరాజ్య ఉద్యమ సేవలో

**రాష్ట్రీయ స్వయంసేవక సంఘం ఆంగ్లేయుల చేతి కీలుబొమ్మ (స్టూజ్) అంటూ ఇందిరాగాంధీ నీచాతినీచమైన ఆరోపణకు సమాధానంగా బెంగళూరు నుండి వెలువడిన పుస్తకంలోని కొన్ని అంశాలను 'జాగృతి' 12.6.1972 సంచికలో సంఘ సంస్థాపకులు కీ.శే.పూజ్యశ్రీ హెడ్గేవారు స్వరాజ్య ఉద్యమంలో వహించిన పాత్రను వివరించింది. స్వరాజ్య ఉద్యమ సేవలో స్వయం సేవకలు పాత్రను ఈ సంచిక (26.6.1972)లో తెలియచేస్తోంది.**

పూర్ణ స్వరాజ్యం కోసం కాంగ్రెసు తీర్మానం చేయకముందే పూజ్యశ్రీ డాక్టర్‌జీ దుర్గాదేవి ఎదుట పూర్ణ స్వరాజ్య దీక్ష స్వీకరించి దేశసేవకు జీవితాన్ని అంకితం చేశారు. పూర్ణ స్వరాజ్యానికి సుసంఘటితం, శక్తిమంతం, క్రమశిక్షణాయుతమైన సమాజం ఆవశ్యకమని గుర్తించి అందుకుగాను వారు రాష్ట్రీయ స్వయంసేవక సంఘమును స్థాపించారు. ఇటు సంఘ కార్యంలో నిమగ్నులైయుండి, రెండవ ప్రక్క స్వరాజ్య ఉద్యమంలో పాల్గొనేవారు. తాము పాల్గొనడమేగాక పూర్ణ స్వరాజ్య ఉద్యమం లక్ష్యంతో అన్ని రకాల ఉద్యమాలకు సేవ చేయడం కర్తవ్యంగా స్వయం సేవకులకు ప్రబోధించేవారు.

ఒక ప్రక్క సంఘ కార్యంలో నిమగ్నులైయున్న స్వయంసేవకులు సమయ సమయాలలో స్వరాజ్య ఉద్యమానికి సేవకులుగా అండదండలిస్తుండేవారు.

విప్లవకారులు బ్రిటిష్‌వారి దారుణ దమన చర్యలకు గురిఅవుతూ నిలువ నీడలేక తిరుగుతున్న దశలో స్వయంసేవకులు వారికి అండగా నిలిచి పలు ప్రమాదాలను ధిక్కరించి వారికై ఆశ్రయములు నిర్వహిస్తుండేవారు. సత్యాగ్రహుల సేవలకు శిబిరాలు నిర్వహించేవారు. అలాంటి సేవలు స్వయం సేవకులొక ఘనకార్యంగా కాక సహజ కర్తవ్యంగా భావించేవారు.

1930లో గాంధీజీ శాసన ధిక్కార సత్యాగ్రహం ప్రకటించారు. డాక్టర్‌జీ మరి అనేకులు స్వయం సేవకులు అందు పాల్గొని జైలులో గడుపుతున్నారు.

వార్ధా సంఘచాలక్ శ్రీ అప్పాజీజోషి మహాత్మా గాంధీకి, జమ్నాలాల్ బజాజ్‌కు సన్నిహితులు. వారు ప్రాంత కాంగ్రెసు కార్యదర్శి కూడా. వారున్ను డాక్టరుజీతో సత్యాగ్రహానికి వెళ్లారు. అప్పట్లో సంఘం అఖిల భారత వ్యాప్తి చెందలేదు. అందువల్ల స్వయం సేవకుల సేవలు నాగపూర్ ప్రదేశానికే ఎక్కువగా పరిమితమై యుండేవి.

**త్రివర్ణ పతాక ఆవిష్కరణ**

1936లో ఫైజ్‌పూర్‌లో కాంగ్రెసు మహాసభ జరిగింది. శ్రీ నెహ్రూ త్రివర్ణ పతాకను ఎగురవేయ వలసి ఉంది. అది ధ్వజం మధ్యలో చిక్కుకు పోయింది. అంత సభలోనూ, ధ్వజస్తంభాన్ని ఎక్కి సరిచేసే సాహసం ఎవరికి లేకపోయింది. వెంటనే అక్కడ ఉన్న స్వయంసేవకులు ముందుకు దూకి దానిని సరిచేసి సకాలంలో ధ్వజారోహణం జరిపించారు. వారి చొరవను ప్రశంసిస్తూ డాక్టర్‌జీ ఆ స్వయం సేవకునికి ఒక బహుమానం ఇచ్చి 'జాతీయ ఉద్యమంలో వచ్చే ప్రతి అవరోధాన్ని అలాగే అధిగమించడం స్వయంసేవకుల లక్షణం కావాలి' అని ప్రబోధించారు.

1940లో డాక్టర్‌జీ దేహం చాలించే వరకు దేశసేవకు అంకితమై, స్వయంసేవకులను అంకితం కావల్సిందిగా ఉద్బోధించేవారు. వేలాది యువకులు వారి ప్రేరణతో యావజ్జీవిత దీక్షలు స్వీకరించారు. డాక్టర్‌జీ మరణానంతరం కూడా అదే స్ఫూర్తితో వ్యవహరిస్తున్నారు స్వయంసేవకులు.

**1942లో....**

1942 వచ్చింది. ఆంగ్లేయులు దేశం వదిలిపోవాలని గర్జించింది. జాతి, స్వయంసేవకులు రణరంగంలోకి దూకారు. లారీలు, బుల్లెట్లు ఎదుర్కొన్నారు. కొందరు జైళ్లల్లో మగ్గారు. సంఘ కార్యం మాత్రం యధావిధిగా సాగుతుండేది.

**అజ్ఞాత వీరులకు ఆశ్రయాలు స్వయంసేవకులు**

అజ్ఞాతవాసంలోకి వెళ్లిన ఉద్యమకారులకు అనాదున్న ఆశ్రయం ఒక సమస్య అయింది. స్వయం సేవకులు ఆ పనిని తీసుకువచ్చారు. ప్రతి ప్రముఖ కార్యకర్త నివాసము పలువురు ఉద్యమకారులకకు ఆశ్రయం అయింది.

**జయప్రకాశ్, అరుణా అసఫాలీలకు ఆశ్రయం**

ఢిల్లీ పంజాబు ప్రదేశ సంఘచాలకులు శ్రీ లాలా హంసరాజ్ గుప్త, ఆయన నివాసం ఎందరెందరికో ఆశ్రయమయింది. ఆయనవద్ద ఆశ్రయం పొందిన వారిలో జయప్రకాశ్ నారాయణ, అరుణాఅసఫాలీ ప్రభృతులు కొందరు ముఖ్యులు.

**అచ్యుత పట్వర్ధన్‌కు ఆశ్రయం**

మహారాష్ట్రలో ప్రముఖ విప్లవకారుడు శ్రీ నానాపాటిల్ పోటీ ప్రభుత్వం నెలకొలిపారు. ఆయనకు ఆశ్రయం కల్పించింది. ప్రఖ్యాత వేద పండితులు, ఔంధ్ సంఘచాలక్ శ్రీపాద దామోదర సాత్వలేకర్, వాయ్ సంఘచాలక్ శ్రీ దత్తోపంత్ గోఖ్లే శ్రీ కిసాన్‌వీర్ ప్రభృతులకు ఆశ్రయం కల్పించారు. ప్రఖ్యాత గాంధేయ రచయిత శ్రీ సానేగురూజీకి పూనా సంఘచాలక్ బాబూసాహెబ్ దేశముఖ్ ఆశ్రయం ఏర్పరిచారు. ప్రముఖ సోషలిస్టు నాయకుడు శ్రీ అచ్యుత పట్వర్ధన్ ఆశ్రయం పొందింది స్వయంసేవకుల ఇండ్లలో. ఇవన్నీ ఆంగ్లేయుల చేతి కీలుబొమ్మలైనవారు చేసే సేవలేనా?

**బుడతకీచు స్థావరాల విముక్తి**

స్వరాజ్య పోరాటం ఆంగ్లేయులు వైదొలగడంతో ముగిసిపోయింది. నెహ్రూ ప్రభృత కాంగ్రెసు వారికి, దేశంలోని ప్రతిభాగమూ పూర్ణ స్వరాజ్యం పొందాల నేది స్వయం సేవకుల కోరిక. అందుకే అఖండ భారత దృశ్యాన్ని వారు మనసున నింపుకొని ఆరాధిస్తారు.



# స్వయంసేవకులు...



అందువల్లనే ఫ్రెంచి బుడతకీచు స్థావరాల విముక్తికి తహతహలాడారు స్వయంసేవకులు. బుడతకీచు స్థావరాలైన గోవాలోని దాద్రానగర్ హవేలీలలో ప్రవేశించి బుడతకీచు పతాక స్థానంలో త్రివర్ణ పతాక నెగురవేసింది స్వయంసేవకులు. బుడతకీచు జైళ్లలో ఎందరు స్వయంసేవకులు మగ్గారో లెక్కలేదు. ఎందరెందరు సత్యాగ్రహంలో నిమగ్నులైనారో అంచనా లేదు. సత్యాగ్రహులకు ఆహార పానాది వసతులను కల్పించింది స్వయంసేవకులు. గోవా విముక్తికి అసువులనర్పించిన హేమంత సోమన్ సంఘ కార్యకర్త. ఇట్టి స్వయంసేవకులను ఆంగ్లేయుల గులాంలు అనడానికి నోరెలా వచ్చింది ఇందిరా గాంధీకి? ఈ ఘట్టంలో స్వయంసేవకులిలా రణరంగంలో నిలువగా నెహ్రూ, ఇందిరా గాంధీలు ఏమి చేస్తున్నారు అని అడుగ వచ్చునా?

**ఆర్ఎస్ఎస్ విషయంలో ఆంగ్లేయుల వైఖరి**

సంఘం విషయంలో ఆంగ్లేయుల వైఖరి ఏమిటో కూడా ప్రస్తావించ దగినది. దాని నుండయినా ఇందిరాగాంధీ సంఘ లక్షణాన్ని గ్రహించగలదేమో! 1925 సంఘం ఆరంభం కాగా, అప్పటి నుంచి ఐదారేండ్లలోనే ఆంగ్లేయులు కంగారు పడజొచ్చారు. ఏనాడైనా ఇది తమకు ప్రమాదమని భావింప జొచ్చారు. అది ఆదిలోనే దీనినంతమొందించాలని ప్రయత్నించారు.

**ఆంక్షలు... ఆంక్షలు**

ప్రభుత్వోద్యోగులెవరూ సంఘ కార్యకలాపాల్లో పాల్గొనరాదని సెంట్రల్ ప్రావిన్సెస్ ప్రభుత్వం 1932లోనే (డిసెంబరు 15న) ఆజ్ఞలు జారీచేసింది.

1963 నాటి గణతంత్ర వేడుకలలో స్వయంసేవకులు



చిత్రమేమిటంటే ఆనాటి బ్రిటిష్ ఉత్తర్వులనే ఈనాటికీ కాంగ్రెసు తన ఆజ్ఞలుగా ప్రకటించింది! ఆంగ్లేయుల అడుగుజాడలలో ఉన్నది ఎవరు?

1933లో బ్రిటిష్ ప్రభుత్వం సంఘానికి సంబంధించి మరొక ఉత్తర్వు చేసింది – స్థానిక సంస్థల ఉద్యోగులు కూడా సంఘంలో చేరరాదని. దానితో ప్రాంతమంతా ఆంగ్లేయుల ఎడ వ్యతిరేకత చెలరేగింది. ఎన్నో మున్సిపాలిటీలు, ప్రముఖులు ఈ ఆజ్ఞలకు గర్హించారు. చివరికి సమస్యపై ప్రాంత మంత్రి వర్గమే వైదొలగవలసి వచ్చింది!

**సంఘంపై ఆంగ్లేయుల రహస్య సర్క్యులర్**

1942లో ఆంగ్ల ప్రభుత్వం పోలీసులకు ఒక రహస్య సర్క్యులర్ పంపింది. 'ఆర్.ఎస్.ఎస్. కార్యకలాపాలపై నిఘా ఉంచండి. అది చాలా ప్రమాదకరమైన సంస్థ"అని అందులో పేర్కొంది.

సంఘమే గనుక ఆంగ్లేయుల గులాం అయితే ఇలాంటి సర్క్యులర్లు ఎందుకు వచ్చాయి? ఇందిరా గాంధీ గుండెమీద చేయివేసుకొని ప్రశ్నించుకొనవలసిన అంశమిది. ఆమె అలా చేయకపోతే ఆమెను నిగ్గదీసి ప్రజలడుగదగిన ప్రశ్న ఇది.

**1942లో ఈ కమ్యూనిస్టాదులు ఏమి చేశారు?**

నేడిందిరాగాంధీ కమ్యూనిస్టాదులతో చేతులు కలిపి సంఘంపై ఇంత అసహ్యకరమైన ఆరోపణలు చేస్తున్నది. స్వరాజ్య ఉద్యమ సమయంలో సంఘం ఏమి చేస్తున్నది? అని అడుగుతోంది. ఈ చరిత్ర అంతా ఆమెకు కనువిప్పు కల్గించుగాక! అయితే ఆమె సమాధానమీయదగిన ప్రశ్నలు మరికొన్ని ఉన్నాయి. స్వయంసేవకులిలా ఉద్యమకారులకు అండగా నిలిచి ఉండగా అదే 1942లో నేటి ఇందిర మిత్రులు కమ్యూనిస్టులు ఏమిచేస్తున్నారు? ప్రస్తుతం ఆమె మంత్రివర్గంలో కూడా చేరిన మోహనకుమార్ మంగళం ప్రభృతులు ఆనాడేమి చేస్తున్నారు? ఆనాడు ఆంగ్లేయుల ప్రక్కన చేరి ఉద్యమకారులను పట్టించిన రాజకీయ వర్గములు కమ్యూనిష్టులు కారా? ఆంగ్లేయులతో చేయి కలిపి సంఘంపై పోరాటం ఆరంభించింది కమ్యూనిష్టులు కారా? అట్టి కమ్యూనిస్టు లతోను, ఆంగ్లేయులతో లాలూచీ పడి దేశాన్ని ముక్క చెక్కలు చేసిన ముస్లింలీగ్‌తోను చేతులు కలిపిన – ఈ ముగ్గురు నేడు సంఘాన్ని కించపరచజూడడం జనవంచన కాదా?

**ఈ ఆరోపణ రుజువు చేస్తారా?**

సంఘం ఎడ ప్రస్తుత పాలకుల ప్రవర్తన ఆనాటి ఆంగ్లేయుల ప్రవర్తన కంటే హీనంగా ఉన్న విషయం స్పష్టం. సంఘంపై వీరు చేస్తున్న ఆరోపణలకు సంబంధించి బెంగుళూరు వారి ప్రచురణలో ఇలా అన్నారు.

'సంఘం ఆంగ్లేయుల చేతి కీలుబొమ్మ' అనే ప్రస్తుత ప్రభుత్వ నాయకుల ఆరోపణలో నిజమే ఉంటే దానిని నిరూపించవలసిన బాధ్యత వారిపై ఉంది. ఆంగ్ల పరిపాలనా రికార్డంతా ప్రస్తుతం వీరి చేతుల్లో ఉంది. తమ ఆరోపణకు రుజువుగా ఆ రికార్డు అంతటి నుండి ఒక్క రుజువునైనా ప్రజల ముందుంచ గల్గడం వారికి న్యాయం. వీరలా చేయలేకపోతే వారి ఆరోపణలన్నీ అసత్యాలనీ, నిరాధారాలని స్పష్ట మవుతుంది.'

**వృద్ధ విప్లవకారుని ప్రకటన**

అధికారంలోనున్న కాంగ్రెసు వారు సంఘంపై చేస్తున్న క్రూర విమర్శలకు బాధ చెందిన వృద్ధ విప్లవకారులు శ్రీ బాబూరావ్ హర్కారే (1972 ఫిబ్రవరి 19న) ఇలా అంటారు :

'నేను సంఘంలోగాని, జనసంఘంలోగాని సాధారణ సభ్యుడనైనాకాదని ముందు స్పష్టం చేయ దలుస్తున్నాను. రాజకీయ పక్షాలకు తమ సిద్ధాంతా లను, మ్యానిఫెస్టోలను ప్రచారం చేసుకొనడం అవసర మనేది నిజమే. అయితే అసత్యాలాడడం ఎవరికి తగిన పనికాదు. సంఘాన్ని స్థాపించిన డాక్టర్ హెడ్గెవార్ దేశం కోసం సర్వస్వం త్యాగంచేసిన మహితాత్ములు. దేశభక్తి వల్ల అధికారము, పేరు, ధనము లభించే రోజులు కావనే, కష్టాలు, కడగండ్లు అవమానాలు, హింసాకాండలు– ఇవే ఆనాటి దేశభక్తులకు లభించిన బహుమానాలు. డాక్టర్‌జీని బాల్యం నుండి ప్రభుత్వ గూఢచారులు వెన్నంటేవారు.




ఆయనకు ఇంట్లో కూడా భద్రత లేదు. కాంగ్రెసువారి ఉద్యమాలన్నిటిలోనూ ఆయన హృదయపూర్వకంగా పాల్గొనేవారు. వారితో నేనీ ఉద్యమాలనేకమైన వానిలో పాల్గొన్నాను. ఆయన, ఆయన సహచరులు విదేశీ పాలకులతో నిర్భయంగా పోరాడేవారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత కేవలం కాంగ్రెసుకు చెందదు. ఈ స్వరాజ్యాన్ని సంపాదించడానికి లక్షలాది మంది రక్తాన్ని అర్పించారనేది మనం మరువరాదు. నేడిలా అధికారంలో ఉన్నవారు విచ్చలవిడిగా సంఘంపై ఆరోపణలు చేస్తున్నారుగాని ప్రముఖులు పలువురు, సంఘాన్ని గురించి చెప్పిన మాటలు వారికి గమనార్హాలు.

**గాంధీజీ ప్రశంస**

12.2.47న మహాత్మాగాంధీ ఢిల్లీలోని భంగీ కాలనీ సంఘశాఖను సందర్శించి, ప్రసంగించారు. ఆ విషయం హిందూ పత్రిక ఇలా ప్రకటిం చింది. "గాంధీజీ అనేక సంవత్సరాల క్రితం, డాక్టర్‌జీ జీవించి ఉండగా సంఘ శిబిరాన్ని చూచారు. సంఘ క్రమశిక్షణ, అస్పృశ్యతా రాహిత్యం, నిరాండరత్వం వారినెంతగానో ఆకర్షించింది. నాటి తర్వాత సంఘం ఎంతగానో విస్తరించింది. సేవా, త్యాగాలపై నిర్మితమయ్యే ఏ సంస్థ అయినా అలా మహత్తరంగా బలపడు తుందని గాంధీజీ విశ్వాసం."

**అధికారంలోని కాంగ్రెసువారికి పటేల్ హెచ్చరిక**

అదే పత్రిక 7.1.1948 సంచికలో లక్నోలో సర్దార్‌పటేల్ ప్రసంగాన్ని ఇలా ప్రచురించింది. 'సంఘం స్వార్థంతో ప్రేరితమైన సంస్థ కాదని పటేల్ దృఢంగా నమ్మారు. అది ప్రస్తుతం ప్రభుత్వ హస్తాలను బలపరచాలని, శాంతిని నిలపడంలో సాయపడాలని వారి కోరిక. అధికారంలో ఉన్న కాంగ్రెసు వారికి ఆయన ఒక హెచ్చరిక కూడా చేశారు. 'తమ అధికారాన్ని ఉపయోగించి సంఘాన్ని అణచివేయవచ్చునని పదవుల్లో ఉన్న కాంగ్రెసువారు భావిస్తున్నారు. దండప్రయోగంతో మీరే సంస్థనూ అణచలేరు. దండప్రయోగం అనేది దొంగలకు దోపిడీదార్లకు ఉద్దేశింపబడినది. స్వయంసేవకులు దొంగలూ, దోపిడీదార్లు కాదు. వారు దేశాన్ని ప్రేమించే దేశభక్తులు'అని అన్నారాయన. దొంగతనాలు, దోపిడీచర్యలే రాజకీయాలుగా గల పార్టీలను, శక్తులను ప్రోత్సహించి వారితో చేతులు కలుపుతున్న ఇందిరా కాంగ్రెసు ఇలా దేశభక్తుల సంఘంపై దండ ప్రయోగానికి దిగాలని చూడడం కాలవైపరీత్యం!

**నెహ్రూ ఉవాచ...**

నెహ్రూ కూడా సంఘాన్ని వ్యతిరేకించాడు. పోరాటం చేశాడు. అసహ్యంగా నిషేధాలు కూడా చేయించాడు. కాని ఇందిర చేసినంత నీచమైన ఆరోపణ చేయలేదేమో. అయితే 1962లో చైనా దురాక్రమణ జరిగినప్పుడు స్వయంసేవకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సైనికులకు సహాయ సహకారాలనందించారు. అందువలన 1963 రిపబ్లిక్‌డే పారేడ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ రూట్‌మార్చ్‌ని కూడా ఆయన ఆనాటి ప్రదర్శనలలో జరిపించారు. దీనిని కొందరు విమర్శించే సరికి 'మీరు కూడా దేశభక్తులే' అని సద్దుమణిగించాడు.

**దేశ నాయకులను స్వయంసేవకులు రక్షించిన సంఘటనలు**

ఈ పుస్తకం మరొక విషయాన్ని గుర్తుచేసింది. స్వరాజ్యం వచ్చిన తొలి దినాలలో దేశంపై ముస్లిం లీగ్‌చే పెద్ద కుట్ర జరిగింది. 1947 సెప్టెంబరు 10వ తేదీన లీగర్లు భారత ప్రభుత్వ నాయకులందరినీ, హిందూ అధికారాలను, వేలాది హిందూ పౌరులను హత్యచేసి ఎర్రకోటపై పాకిస్థాన్ జండాను ఎగురవేయాలని, యావద్దేశాన్ని వశం చేసుకోవాలనే కుట్ర అది. ఈ కుట్రను పసిగట్టి, సకాలంలో సర్దార్‌పటేల్ ప్రభృతులకు తెలిపి, కుట్రను ఛేదించి, దేశాన్ని రక్షించింది స్వయంసేవకులు. ఈ విషయాన్ని గురించి భారతరత్న డాక్టర్ భగవాన్‌దాస్ 16.10.1949లో చేసిన ప్రకటన నొకదాన్ని ఈ పుస్తకం ఉదహరించింది. అందులో ఇలా ఉంది:

"మహోన్నత దృక్పథము, త్యాగనిరతి కలిగిన ఈ బాలకులే ఆనాడు నెహ్రూ, పటేళ్లకు సకాలంలో సమాచారం అందజేయకపోయి ఉంటే నేడు భారత ప్రభుత్వమే ఉండేది కాదు. లక్షలకు లక్షల మంది హిందువులు హతమై ఉండేవారు. మిగిలినవారు ఇస్లాంకు మార్చబడి ఉండేవారు. లేదా బానిస బతుకులో శేషించి ఉండేవారు."

**డాక్టర్ భగవాన్‌దాస్ హెచ్చరిక**

ఈ ప్రకటన ముగింపులో భగవాన్‌దాస్‌జీ ఇలా హెచ్చరించారు:'మన ప్రభుత్వం లక్షలాది ఆర్‌ఎస్‌ఎస్ యువకుల దేశభక్తియుత శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవాలేగాని వాని సృజన శక్తిని ధ్వంసం చేయరాదు.(Should utilize and not sterilise the Patriotic energles of RSS Youth).. ఈ మాటలు నాటి కన్న కూడా ఈనాడు మరింత ఎక్కువగా వక్కాణించదగి ఉన్నాయి.

**– 26.6.1972 జాగృతి సంచిక**

## వీళ్లతో ఎలా?

**మహాభారతంలో మహాప్రస్థానానికి ద్రౌపదితో కలిసి బయలుదేరిన పంచ పాండవులలో మార్గమధ్యంలో నలుగురు వీరులు, పాంచాలి రాలిపోయారు. ఒక శునకం యుధిష్ఠిరుడి వెంట స్వర్గానికి వెళ్లింది. శుని అంటే ఆడకుక్క. సారమేయం అనే శుని తనకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నది. ఇంద్రుడికి అది ప్రియమైన నేస్తం. ఇంద్రుడు అహల్య పొందులో ఉన్నప్పుడు అది బయట కాపలా కాసింది. కావలిగా ఉండడమ కాదు...అవసరమైతే ప్రాణాలు ఇస్తుంది. ప్రపంచంలో కుక్కకు విశ్వాసం కల జంతువు అన్న గౌరవం అలా దక్కింది.కానీ వర్తమానంలో ప్రాణాంతకంగా మారుతున్న వీధి, పిచ్చికుక్కలపై చర్యలకు ప్రతిఘటన బాధితులను విస్తుగొలుపుతోంది.**

స్వర్గారోహ పర్వంలో శునకం ధర్మానికి ప్రతీకగా ధర్మరాజుతోపాటు స్వర్గం వెళ్ల గలిగింది. అంతా బాగానే ఉంది. కాని, కనకపు సింహాసనం పైన శునకాన్ని కూచోబెట్టినా అది తన వెనుకటి గుణం మార్చుకోదని సామెత. కుక్కకాటుకు చెప్పు దెబ్బ అన్న సామెతా ఉన్నది. కుక్కను నీచ జంతువుగా పరిగణిస్తారు. ఉత్తమ జీవుడయిన మానవుడితో దాని సావాసం వింతేమీ కాదు, విచిత్ర విరోధాభాసం కూడా అని కొందరు వాపోతారు. కుక్కకు, మనిషికి మధ్యన ఒక తేడా ఉంది. కుక్క చచ్చే దాకా యజమానిని వదలిపెట్టదు. మనిషి తెలివి మీరినప్పుడు సాటివాడినే మోసగిస్తాడు. అందుకే కాబోలు, విశ్వాస ఘాతకుడు మరుజన్మలో కాకపోతే మరో జన్మలోనైనా శ్వానం కావడం తథ్యం అంటారు.

అసలు విషయం ఏమిటంటే, ఇటీవల ఎక్కువైన కుక్కల బెడదను ప్రచార మాధ్యమాలు విస్తృతంగా ప్రసారం చేస్తున్నాయి. ముఖ్యంగా వీధి కుక్కలు. వాటికి తిండి కరవై, తాగడానికి నీరు దొరకకపోతే పిచ్చిపడుతుంది. అలాంటప్పుడే అవి దాడులకు దిగుతుంటాయి.ఒంటికిగా బయటికి వెళితే అవి వెంటపడుతున్నాయని, శునకబాధ నుంచి కాపాడాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పురపాలక సిబ్బంది వీధి కుక్కలను పట్టి కడతేర్చడం అనాదిగా జరుగుతున్న తతంగమే. స్థానికులు పిచ్చి కుక్కల్ని కొట్టి చంపడం కన్నా, పొగ పెట్టిగాని, విషం

# శునక దాడులకు మద్దతా!?...

పెట్టిగాని అంతం చేయడం కాస్త నయం. బహుసంతాన జీవుల్లో కుర్కుర జాతికి మంచి స్థానం ఉన్నమాట నిజం.

పల్లెటూళ్ల మాట పక్కన పెడితే, బస్తీలోని జీవ కారుణ్య సంఘాలు రంగ ప్రవేశం చేసి శునక ప్రియుల పక్షాన శివమెత్తి పోరాడుతున్నాయి. న్యాయస్థానాల తలుపు తడుతున్నాయి. తెలంగాణలో మూడు జిల్లాలలో ఏకంగా ఐదువందల కుక్కలను చంపేశారని, రంగారెడ్డి సర్పంచి ఇద్దరు సహాయకులలో వంద కుక్కలను దారుణంగా చంపించారని, నేరస్తులను పట్టి చట్ట ప్రకారం శిక్షించాలని ముదవత్ ప్రీతి జంతు సంరక్షణ సంస్థానం పట్టుపడుతోంది. ఇటీవల కామారెడ్డిలో 244 కుక్కలు, జగిత్యాల, హనుమకొండలో పెద్ద సంఖ్యలో శునకాలు ఆహుతి అయ్యాయి. అయితే అరిచే కుక్కల్లో కరిచే కుక్కల్లో కొన్ని మాత్రమే కరుస్తాయని, సాకుతో అన్నిటిని మట్టుపెట్టడం సమంజసం కాదని ఒక జీవ కారుణ్యం సభ్యురాలు వ్యాఖ్యానించారు. వాటిని ఎలా పెంచాలో, ఎందుకు చంపకూడదో కూడా ఆంగ్లంలో సుదీర్ఘంగా ప్రసంగించారు.



తెలుగు రాష్ట్రాకు చెందిన మాజీ సినీతార, ఉత్తరప్రదేశ్ మాజీ రాజకీయ సినీతార, జీవకారుణ్య సంస్థల వనితా ప్రతినిధులు, ఆ ఘటనలను ఖండిస్తూ ఉద్యమాలు చేపట్టారు. శునక పీడితులు న్యాయ స్థానాలను ఆశ్రయించగా, వాటిని నిర్బంధించాలని న్యాయస్థానం చేసిన సూచన శునక ప్రేమికులకు నచ్చలేదు. గతంలో ఒక ఐ.ఏ.ఎస్ అధికారి దంపతులు తన పెంపుడు శునకం స్వేచ్ఛగా విహరించడానికి వీలుగా, అక్కడి వ్యాయామశాలను ఖాళీ చేయించడాన్ని బట్టి కుక్కల పెంపకం పట్ల ఎంత మక్కువో బహిర్గతమైంది(ఆ దంపతులు చర్య ఫలితంగా బదిలీకావడం వేరే విషయం). నేడు శునకాలు కన్నబిడ్డ కన్నా మిన్నగా అభిమానాన్ని చూరగొంటున్నాయి. ఒక చేతిలో చరవాణి, మరో చేతిలో కుక్క మెడకు కట్టిన గొలుసు పట్టుకుని విహారయాత్ర సాగించే వారి సంఖ్య పెరుగుతోంది.

శునక ప్రేమికుల గురించి ఆలోచించగా, రెండు ముఖ్య కారణాలు తళుక్కున మెరిశాయి. మన దేశంలో మధ్యతరగతి వర్గం అతి పెద్దది. వారిలోనూ పింఛనుదారులు, వృద్ధులు సింహభాగం కావడం మరో విశేషం. చాలా కుటుంబాలకు చెందిన పిల్లలు విదేశాలకు వలసపోయారు. భౌతికంగా అవసరానికి ఆదుకోలేకపోయినా, ధన సహాయానికి కొదువలేదు. ముసలి దంపతులు ఒంటరితనం, దొంగలదాడిని భరించలేక కుక్కలను సాకుతూ తృప్తిపడుతున్నారు. పక్షుల గూడు విడిచివెళుతున్నట్లు కడుపున పుట్టిన వారు సంపాదన కోసం వలస పోతుంటే, కుక్కలు చివరిక్షణం దాకా యజమానిని అంటి పెట్టుకొని ఉంటాయి. 'మనిషి కన్నా కుక్క నయం' అనే నినాదాన్ని బట్టి వాటిని కించపరచి మాట్లాడేవారు శిక్షలు ఎదుర్కొనవలసిన పరిస్థితి.

శ్రీమతి మానేకాగాంధీ 'భైరవం' గురించి రచించిన గంభీర వ్యాసాన్ని, ఉపన్యాసాన్ని జనవరి 20న ఉన్నత న్యాయస్థానం అభిశంసించింది. వీధి కుక్కలను నిర్బంధించాలన్న కోర్టు ఇచ్చిన ఉత్తరువు ఆచరణ యోగ్యం కాదన్న వాదనను తోసిపుచ్చింది. త్రిసభ్య పీఠం చీవాట్లు భరించలేక మనేకా తరపు న్యాయవాది 'అది రాజకీయ వాదపు నోటి దురద అని తేల్చివేయడం కొసమెరుపు. వీధి కుక్కల నియంత్రణ పట్ల కోర్టు జారీచేసిన ఫర్మానాను ఖాతరు చేయనందుకు ప్రభుత్వ సిబ్బందిని దుయ్యబట్టడం సమంజసమే.

కుక్కల వ్యవహారం ఇలా ఉంటే... చట్టోల్లంఘనంతోపాటు చట్టవిరుద్ధమైన చర్యలకు దిగడం ఇటీవల ఎక్కువైంది. వీధుల్లో విరగబడడం, విధ్వంసం సృష్టిచేయడం సర్వసాధారణం అయింది. నోటికి వచ్చిందల్లా మాట్లాడడం, చేతికి దొరికిందల్లా విరచడం ఈనాటి సత్యాగ్రహపు కొత్త అవతారం. అమాయకులను నిందితులుగా నిలబెట్టి కొట్టి కాల్చి చంపడంలాంటి అమానుష చర్యల ముందు కుక్క చావుకు ఎక్కడ లేని సానుభూతి చూపడం విచిత్ర పరిణామం.

– నిరామయ



కథ

# చివరి

విహారి

రాత్రి మూడవజాము జరుగుతోంది.

పన్హాలా దుర్గం. ముఖద్వారం దగ్గరి కావలి తావులో రెండు గంటలు మోగాయి.

ఉలిక్కిపడి లేచాడు శంభాజీ.

ఏదో పీడకల. కొంత స్పష్టంగానే ఉంది. కళ్లు నులుముకున్నాడు. మందిరం మధ్యగా కాచదీపం వెలుగుతోంది. ఓ పక్కన పల్చటి చీకటి.

అలతిదూరంలో భార్య యశూబాయి. పక్కన పాప భవాని. ఇద్దరూ పక్కమీద మసలుతున్నారు.

లేచి, మందిరం బయటకు వచ్చాడు. బయట వాతావరణం ప్రసన్నంగానే ఉన్నది. సహ్యాద్రి పర్వత పంక్తుల నుండి దూరప్రయాణం చేస్తూ వస్తున్నా, గాలి చల్లగానే దేహాన్ని స్పృశిస్తున్నది. వివరంలేని సవ్వడుల్ని వినిపిస్తున్నది ప్రకృతి. తన మనస్సులోనే అలజడి.

స్వప్న స్మృతిలోని పీడకల దృశ్యం కలత పెడుతోంది. తండ్రి ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆకారం–ఆకురాల్చిన చెట్టులా దీనంగా కనిపించింది! అసలు రాయగడలో ఏం జరుగుతోంది? ఏడాదిపైనే అయింది. తండ్రి ప్రత్యేకంగా తనను చూడాలని వచ్చారు. ఆంతరంగిక సమావేశం. మనసులు విప్పి మాట్లాడుకున్నారు.

"మూడేళ్లయింది నిన్ను చూసి శంభూ!" అన్నారు, ప్రభువు – కళ్లల్లోనే ఉద్వేగాన్ని వ్యక్తం చేస్తూ. తాను పాదాభివందనం చేస్తే, లేపి అక్కున చేర్చుకున్నారు. ఆ తర్వాతి సంభాషణలో తాను నిష్ఠుర వాస్తవాల్నే ప్రస్తావించాడు. 'మంత్రుల దుష్ప్రవర్తనని ఉపేక్షిస్తూ, వారు నా మీద మోపుతున్న దురభియోగాల్ని నమ్ముతున్నారు మీరు'అని నిష్కర్షగానే చెప్పాడు. ప్రభువుగా, కన్నతండ్రిగా తన బాధ్యతల్ని ఎన్నడూ విస్మరించనని స్పష్టం చేశారు మహారాజు. తన వైపు వాత్సల్యంగా చూస్తూ, "భావి హిందూరాజ్య పరిరక్ష ణకు నీవే చాలినవాడివి శంభూ! కవిగా, పండితునిగా, పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని సాధించుకున్నావు. నీ ధైర్య సాహసాలు గడ్డకెక్కాయి. మన లక్ష్యసాధనకు నీకంటే తగిన వారెవరున్నారు చెప్పు" అని "నీ మీద నాకే దురభిప్రాయమూ లేదు. గతం గతః" అంటూ కరచాలనంతో చల్లనిమాట చెప్పారు. ఆ తర్వాత రాజనీతి గురించీ, రాజధర్మాల్ని గురించీ కూడా ప్రబోధించారు. తనకు గుండెలోని ఆవేదన బరువుతీరింది.

అయితే, ఇప్పుడీ పీడకల-- కలేనా?

– ఆలోచనల్లో మునకలు వేస్తున్న శంభాజీ భుజం మీద మెత్తని కరస్పర్శ! భార్య యశూబాయి!

"నిద్రాభంగమైందా మా వలన?" అంటూ చేయిపట్టుకుని పక్కనున్న పీఠిక మీద కూర్చోబెట్టింది. తానూ కూర్చుంది.

"అదేం కాదు" ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

"మనసులో కలతని ముఖం దాచలేదు ప్రభూ" అని "నాకు తెలుసు. తమ్ముడు రాజారాము వడుగుకి మీ సవతితల్లి, అతని తల్లి – సోయరాబాయి – మిమ్మల్ని ఆహ్వానించలేదని మీ మనసు వ్యథపడుతున్నది"

" ఆ సంగతిని పక్కన పెట్టాను" అని,

"అసలు ప్రధానమంత్రి, ఆమె విధేయుడు– అణ్ణాజీదత్తుకు నా మీద కోపం ఎందుకూ?"

శంభు తన మాటలు పూర్తి చేయకముందే రక్కున అందుకుంది యశూ. "ఎందుకంటే – పన్నుల వసూళ్లలో ఆయన చేతివాటాన్ని మీరు గమనించారనీ, అమాయకుల్నీ, ఆ పన్నుల్నీ అవినీతితో పీడిస్తుంటే హెచ్చరించారనీ..." అని "సోయరాబాయి అత్త స్వభావం తెలియనిదేం ఉంది. ఆమెవి కైక లక్షణాలు. తన కొడుకు ఛత్రపతి కావాలి! శివాజీ ప్రభువుకేమో – ఆమె పట్ల దశరథ మహారాజుకి కైక పట్ల కంటే ఎక్కువ ప్రేమానురాగాలు! అయినా, మీకు చెప్పగలిగిన దాన్నా నేను? కాచిన చెట్టుకే కదా రాళ్లదెబ్బలు" అన్నది. నిర్లిప్తంగా ఆమె వైపు చూశాడు.

పాప ఏడుపు వినిపించింది. లేచి చకచకా లోపలికి అడుగులు వేసింది యశూ. వెళ్లి భవానీని సముదాయిస్తూ పడుకున్నది. కానీ, ఆమె ఆలోచనలు మాత్రం శంభు చుట్టూ తిరుగుతున్నై. ధైర్య సాహసాల్లో వరపుత్రుడు. 'మల్లఖంబ్' పోటీలో శారీరక దారుఢ్యాన్ని ప్రదర్శించి ప్రజల్ని అబ్బుర పరచిన ఘనుడు. బహుభాషా కోవిదుడు. కవి. వ్రజభాషలో తాను రాసిన 'నఖశిఖ' గ్రంథంలో రాధాకృష్ణుల ప్రణయ తత్త్వాన్ని రసవత్తరంగా చెప్పి పెద్దల ప్రశంసల్ని పొందిన వాడు. అందునా ఆ గ్రంథంలో రాధ కేశవర్ణన అపూర్వమని ఎందరో పొగడుతుంటే విన్నది తాను. అలాంటి ప్రతిభామూర్తి ఇటీవల బాగానే జంకాడు. తండ్రికి తనమీద అనుమానమనే భావన కూడా మనసును కలత పెడుతోంది.

శంభు లోపలికి వచ్చి తన పక్కమీద నడుం వాల్చేడు. గమనించింది. పిల్ల నిద్రపోయింది.

యశూ వచ్చి భర్త పక్కన కూచుంది. జరిగి చోటిచ్చాడు. "రాజారామ్ వడుగు సంగతి వదిలేశారు. బాగుంది. ప్రభువులు మీ పట్ల అభిమానంతోనే ఉన్నారు. లేకుంటే –మీకు పన్హాలా, దభోల్, ప్రభావళి ప్రాంతాల పాలన బాధ్యతల్ని ఇచ్చేవారా – ఆలోచించండి. అసలు తల్లి లేని పిల్లవాడిని తన తల్లి జిజియాకి ఒప్పజెప్పేననీ, ఆ తర్వాత, పుత్తలీబాయి సంరక్షణకు వదిలేశాననీ – మహా రాజుకు అపరాధభావం ఉన్నదని నాకు నమ్మకం. ఇటు చూస్తే మల్హోజీ గోర్పడే –పన్హాలా సైన్యాధిపతి, విఠల్ మహద్కర్ కోటకు అధిపతి; అటు జనార్దన మహంతి కొల్హాపురిలో అశ్వదళాధిపతి, హీరోజీ కోశరక్షకుడు – వీరంతా మీరంటే ప్రాణం పెడతారు కదా. కారణం మహారాజు కాదూ?"

భార్య మాటలకు శంభు మనసు ఉద్విగ్నమైంది. ఆమె నడుంపై చెయివేసి ముందుకు కదల్చేడు. ఆమె మొహంలోకి చూశాడు. పరమ ప్రసన్నంగా వుంది. 'ముగ్ధమోహన సౌందర్యం ఈమెది' అనుకుని మురిశాడు. "నీకూ రాచకార్యాలపై పట్టూ, మనుసుల ఆంతర్యాలూ బాగా తెలుస్తున్నాయి" అని చుబుకం మీద వేలుని తాటించాడు.

యశూ సన్నగా నవ్వింది.

బయట మూడవ గంట మోగింది. "కొద్దిసేపన్నా కునుకు పట్టించుకోండి" అంటూ లేచి తన శయనం వైపు నడిచింది. తనలో తను నవ్వుకున్నాడు శంభు.

* * *

'తలచిన దెందము కందును...' అన్నట్టు బయట ఎండ కాస్తోంది. లోపల గాలి స్తంభించిన వాతావరణం. శంభు, ఆంతరంగిక మిత్రుడు



కవికలశుడు, ఆ పక్కగా యశూబాయి. ముగ్గురూ మౌన మూర్తులుగా కూర్చుని వున్నారు.

శంభు చేతిలో పుతలీబాయి పంపిన కమ్మ. మనసు తెర పైన జరిగిన ఘటనల దృశ్యాలు....

* * *

జల్నా ప్రాంతంలో మొగలుల విజృంభణ ఎదుర్కోవటానికి సమాయత్తమై ససైన్యంగా వెళ్లాడు ఛత్రపతి శివాజీ. అక్కడ ధనాన్ని కొల్లగొట్టి రాయగడ తిరిగి వస్తున్నాడు. పక్కన తానాజీ వంటి సిద్దోజీ నింబోల్కర్. వీరందరినీ అపరిమిత సైన్యంతో ప్రతిఘటించారు మొగలు వీరులు. పోరు భీకరమైంది. ఛత్రపతి సైన్యంలో రెండువేల మంది వరకూ సైనికులు నిహతులైనారు. సిద్దోజీని వధించారు శత్రువులు. శివాజీ పరిస్థితిని గమనించి, ఐదువందల మంది సైనికవీరుల రక్షణతో తప్పించుకొని రాయగడ చేరేడు. కానీ, అటు సిద్దోజీ మరణఖేదం, ఇటు తన ఆరోగ్యం క్షీణించటం వలన శివాజీ జ్వరంతో, రక్త గ్రహణితో మంచం పాలైనాడు. వారం చివరలోనే స్పృహ కోల్పోయాడు. మరోవారంలో దుర్దినాన కాలధర్మం చెందాడు.

సోయరాబాయి, ప్రధానమంత్రి అణ్ణాజీ – తండ్రి మరణవార్తను శంభుకు తెలియనీయకూడదని కుట్ర చేశారు. ఆమె తన సోదరుడు, సైన్యాధిపతి హంబీరరావు మోహితేని పిలిపించి, రాజారామ్‌కు ఛత్రపతి పట్టం కట్టాలనే కోరికను ఆజ్ఞగానే తెలిపింది. హంబీరరావు ఆశ్చర్యపోయాడు. ఆమె కోరికను అంగీకరించలేదు. హైందవరాజ్య క్షేమం దృష్ట్యా ప్రమాదకరమైనదని మందలించాడు. ఈ విషయం తెలిస్తే ఔరంగజేబు రేపే అపార సేనావాహినితో దండయాత్ర చేసి మరాటా రాజ్యాన్ని నామరూపాలు లేకుండా చేస్తాడని హెచ్చరించాడు.

ఈ ఘర్షణ మధ్యలోనే ఆమె శివాజీ అంత్య క్రియల్ని – రాజారామ్ కర్తగా 'సబజీభోన్‌స్లే' అనే వంశీకుడి చేత జరిపించేసింది.

ఈ పరిణామాలకు గుండెలు మండించుకుని పుతలీబాయి తన ఆంతరంగికుడైన గూఢచారి ద్వారా 'కమ్మ'ను శంభుకు పంపించింది. తక్షణం రాయగడ వచ్చి రాజ్యరక్షణ భారం వహించమని సూచించింది.

* * *

ఉత్తరాన్ని మరోసారి చదువుకుని గద్గదికంగా

# తీర్పు



అన్నాడు శంభు, "ఈ దుర్ఘటనలకు మాతాశ్రీ ఎంతగా తల్లడిల్లిపోయిందో" కళ్లనీళ్లు తిరిగినై శంభుకు.

భర్త పక్కకు చేరి ఊరడిస్తూ అన్నది యశూ, "తండ్రి చనిపోతే కుమారునికి తెలియజేయకుండా, అంతటి వీరశివాజీ ప్రభువుకు చివరకు-అనాథ కులము వాడు చేసే 'బాటాగ్ని' చితిని కల్పించటం ఎంత దారుణం"

"దారుణం కాదు ఘోరం. స్వార్థం, దుర్మార్గం. ఆమె స్వార్థానికీ, అహంకారానికీ రుజువు" అన్నాడు కవికలశుడు.

ఇద్దరినీ చూస్తూ "ఇంతటి దుఃఖాన్నీ సహించి నేనొక మౌనిలా తలవంచుక్కూచోవాలా?" అన్నాడు శంభాజీ. పిడికిలి బిగిసింది. పెదవులు వణికినై.

"కాదు. ఆ మహారాణి, మహాతల్లి పుతలీబాయి సూచనని కర్తవ్యంగా భావించి కదలటమే" అన్నాడు కవికలశుడు.

చాలా సమయం గడిచింది.

నిర్ణయం దిగ్దర్శనం చేసింది. లేచారు.

✻ ✻ ✻

హంబీరరావుకు వార్త వెళ్లింది.అటు శంభాజీ మామగారు పిలాజిషిర్కె ఐదువేల సైన్యంతో రాయగడకు బయల్దేరాడు. ఐదువేల సైన్యాన్ని సిద్ధపరచాడు హంబీరరావు. సోయరాబాయి అనుచరులైన మంత్రుల్ని చెరసాలలో బంధించాడు.

రెండువేల సైనికులతో శంభు కదిలాడు. దారి పొడువునా శంభాజీకి ప్రజలు, హాలికులు, సైనికులు, శ్రామికులు, స్త్రీ బాలవృద్ధులు విజయధ్వానాలతో హారతులు పట్టారు. రాయగడలో ఛత్రపతిగా పట్టాభిషిక్తుడైనాడు శంభాజీ! 'హైందవీ రాజ్యవర్ధన' 'ధర్మవీర' 'విద్వత్కవి' 'మహావీర' అంటూ కొలువులో జయధ్వానాలు మిన్నంటాయి.

✻ ✻ ✻

ఛత్రపతి శంభాజీ గద్దెనెక్కిన తర్వాత తొలిసారి కొలువు దీరే రోజు – రేపే!

క్షణం ఆలోచించాడు శంభాజీ. "మిమ్మల్ని క్షమిస్తున్నాము. వెళ్లండి. మీ కుమారుడు నీలకంఠోజీ నియమశీలి. అతను మాకు పీష్వాగా ఉంటాడు" అని ప్రకటించాడు. సభ హర్షధ్వానాన్ని వినిపించింది. విత్తమంత్రిగా కోశాగారాన్ని సగం సొంతానికి మరలించిన అణ్ణాజి, ఆ తర్వాత ఇతరమంత్రులు అందరికీ క్షమాభిక్షనే పెట్టాడు శంభాజీ మహరాజ్. నేరస్థులందరికీ స్వేచ్ఛ లభించింది. శంభాజీ తీర్పును మెచ్చిన వారు మెచ్చారు. నచ్చని వారు బాధపడుతూ మౌనం వహించారు. యశూబాయి మాత్రం 'పాముకు పాలు పోసి వదిలేశా'రని తన నిరసనని తెలిపింది.

ఆ రోజే – మంత్రులతో సహా అపరాధులందరి విచారణ.

రాత్రి గడుస్తున్నది. శంభూకి నిద్రలేదు. మనసంతా ఆందోళనతో నిండి వుంది.

నేరాలు రుజువయ్యే ఉన్నాయన్నాడు మోహితే. అయితే, ఏ శిక్షలు విధించాలి? ఇదీ శంభుని వేధిస్తున్న ప్రశ్న!

అష్టప్రధానుల్లో ప్రతిఒక్కరూ మొన్నమొన్నటి వరకూ శివాజీ ప్రభువును వినయంతో సేవించినవారే. రాజ్యక్షేమానికి తొలి నుంచీ పాటుబడినవారే. కానీ, బలహీన మనస్కులై సోయరాబాయి ప్రలోభాలకు లొంగిపోయారు. క్షేత్రస్థాయిలో అవినీతికి పాల్పడి ప్రజల్ని – ప్రత్యేకించి హాలికుల్నీ, వృత్తిపరుల్నీ రాపాడి ఇక్కట్ల పాలు జేశారు. ఆ నేరస్థుల్ని పూర్వ ప్రవర్తన రీత్యా మందలించి క్షమించి వదిలేయటమా? లేక కఠినంగా శిక్షించటమా? ఏది సమంజసం? ఏది రాజ్యశ్రేయస్సుకి దోహదం చేస్తుంది? పాలకునిగా ఏది తన కర్తవ్యం?

మనస్సులో సంకుల సమరమే చేస్తున్నాడు శంభాజీ మహరాజ్!

– తెలతెలవారబోతున్నది!

✻ ✻ ✻

ఛత్రపతి శంభాజీ కొలువు. మాన్యులతో, సామాన్యులతో సభ కిటకిటలాడుతోంది. మంత్రుల్ని సభలో ప్రవేశపెట్టారు.

ముందుగా మోరోపంతుని పిలిచారు. "వయసులో పెద్దలు మీరు. ప్రధానుల్లో ప్రధానిగా శివాజీ ప్రభువుని కొలిచిన వారు. ఎందుకిలా నేరస్థులైనారు?" అని బాధతోనే ప్రశ్నించాడు శంభు. "మోమోటముతో ఈ లంపటంలో దిగబడినాను. క్షమించండి" అన్నాడు పంతు చేతులు కట్టుకుని, తలవంచుకుని.

క్షణం ఆలోచించాడు శంభాజీ. "మిమ్మల్ని క్షమిస్తున్నాము. వెళ్లండి. మీ కుమారుడు నీలకంఠోజీ నియమశీలి. అతను మాకు పీష్వాగా ఉంటాడు" అని ప్రకటించాడు. సభ హర్షధ్వానాన్ని వినిపించింది.

విత్తమంత్రిగా కోశాగారాన్ని సగం సొంతానికి మరలించిన అణ్ణాజి, ఆ తర్వాత ఇతరమంత్రులు అందరికీ క్షమాభిక్షనే పెట్టాడు శంభాజీ మహరాజ్. నేరస్థులందరికీ స్వేచ్ఛ లభించింది.

శంభాజీ తీర్పును మెచ్చిన వారు మెచ్చారు. నచ్చని వారు బాధపడుతూ మౌనం వహించారు.

యశూబాయి మాత్రం 'పాముకు పాలు పోసి వదిలేశా'రని తన నిరసనని తెలిపింది.

"శంభూ– నీ మంచితనం నిన్ను కాటేయకుండా సదా అప్రమత్తుడవై ఉండాలి. జాగ్రత్త" అని మిత్రవాక్యాన్ని పలికాడు కవికలశుడు.

"మొగలాయీల నిత్యకృత్యాల్లో ప్రధాన వ్యూహం శత్రువర్గంలోని బలహీన మనస్కుల్ని డబ్బు ఎరవేసి బయటకు లాగటమే. కానీయండి. ధర్మపాలనకు అంకితమైన మీకు అంతా శుభమే జరగాలి" అని ఆశాభావాన్నీ, శుభాకాంక్షనీ పలికాడు హంబీరరావు.

✻ ✻ ✻

తొమ్మిదేళ్ల శంభాజీ పాలనలో తాను సుఖపడిన రోజులు వేళ్లమీద లెక్కించటానికే తక్కువవుతాయి. 'ఉపకారికి అపకారం' నిజమైంది. 'క్షమ' తిరగబడింది.

కడకు కాలప్రభావం, దుర్విధిలీల – రెండూ అనుల్లంఘనీయమని చరిత్ర రుజువు చేస్తూనే వున్నది.

హైందవధర్మపాలనకూ, పరిరక్షణకూ, లక్ష్యశుద్ధికి శంభాజీ చెల్లించిన మూల్యం – ఔరంగజేబు క్రూర, కర్కశ చిత్రహింస, నలభై రోజుల మరణయాతన!

వీరశంభాజీ సాహసౌదార్యాలకు దక్కింది ఆచంద్రార్కమైన కీర్తి, ప్రజలకు మిగిలింది ఛత్రపతి శంభాజీ దేశభక్తి స్ఫూర్తి!! ★






2026 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ సమరానికి ప్రస్తుత చాంపియన్ భారత్, శ్రీలంక దేశాల సంయుక్త ఆతిథ్యంలో రంగం సిద్ధమయ్యింది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకూ జరిగే ఈ ధూమ్ ధామ్ పోరు ఆతిథ్య భారత్ సత్తాకు సవాలు కానుంది. రెండేళ్ల క్రితం రెండోసారి నెగ్గిన ప్రపంచకప్‌ను నిలుపుకోవాలని ఓ వైపు భారత్ పట్టుదలతో ఉంటే, మరోవైపు మాజీ చాంపియన్లు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, వెస్టిండీస్‌తో పాటు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లు ట్రోఫీని తన్నుకుపోవాలని చూస్తున్నాయి.

# టీ-20 ప్రపంచకప్‌లో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించేనా?

గత ప్రపంచకప్ విజయంతో దిగ్గజ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కొహ్లీ టీ-20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో మిస్టర్ 360 హిట్టర్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత యువజట్టు వరుసగా రెండో ప్రపంచకప్ నెగ్గాలన్న పట్టుదలతో పోటీకి సిద్ధమయ్యింది. గ్రూప్ -ఏ లీగ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తో పాటు నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా జట్లతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. గ్రూప్-బీ లీగ్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంక, ఐర్లాండ్, ఒమాన్ జట్లు తలపడనున్నాయి. గ్రూప్- సీ లీగ్‌లో ఇంగ్లండ్, వెస్టిండీస్, బాంగ్లాదేశ్, నేపాల్, ఇటలీ, గ్రూప్-డీ లీగ్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్ఘనిస్థాన్,కెనడా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

మొత్తం నాలుగు గ్రూపుల్లో తలపడే 20 జట్ల నుంచి కేవలం 8 అత్యుత్తమజట్లకు మాత్రమే సూపర్-8 రౌండ్ చేరే అవకాశం ఉంది. గ్రూపు దశలో ఒక్కోజట్టు నాలుగేసి మ్యాచ్‌లు ఆడనుంది. గ్రూపులో మొదటి రెండుస్థానాలలో నిలిచిన జట్లు సూపర్-8 రౌండ్లో తలపడతాయి. సూపర్-8 రౌండ్ నుంచి నాకౌట్ రౌండ్ కు చేరిన నాలుగుజట్లకు మాత్రమే టైటిల్ రేస్‌లో నిలిచే అవకాశం ఉంటుంది.

**టీ-20 ప్రపంచకప్‌లో బాంగ్లా తుపాను!**

గ్రూపు-సీ లీగ్‌లో తలపడాల్సిన బాంగ్లాదేశ్ జట్టు భారత్ వేదికగా ఆడాల్సిన నాలుగుమ్యాచ్‌లు ఆడేది లేదని, భారత్‌లో తమ జట్టు సభ్యులకు భద్రత లేదనీ, శ్రీలంక తటస్థ వేదికగా తాము మ్యాచ్‌లు ఆడతామంటూ వివాదానికి తెరలేపింది. అయితే జే షా నేతృత్వంలోని ఐసీసీ మాత్రం బంగ్లా 'తటస్థ' ప్రతిపాదనను తిరస్కరించింది. బాంగ్లాజట్టు భద్రతకు వచ్చిన ముప్పు ఏమీలేదని, భారత్ వేదికగా మ్యాచ్‌లు ఆడాల్సిందేనంటూ తేల్చి చెప్పింది. ఒకవేళ బాంగ్లాజట్టు ప్రపంచకప్‌ను బహిష్కరించాలని అనుకొంటే, ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ప్రపంచకప్ బరిలో నిలిచే అవకాశం కల్పిస్తామంటూ హెచ్చరించింది. ఐసీసీ దెబ్బతో బాంగ్లా క్రికెట్ పరిస్థితి గాల్లో దీపంలా మారింది.

**ఇవీ భారత గెలుపు గుర్రాలు**

2007 ప్రారంభ ప్రపంచకప్‌ను తొలి ప్రయత్నం లోనే గెలుచుకొన్న భారత్ రెండోసారి విజేతగా నిలవడానికి 13 సంవత్సరాలపాటు వేచిచూడాల్సి వచ్చింది. అయితే మొత్తంమీద మూడోసారి, వరుసగా రెండోసారి ప్రపంచకప్ నెగ్గాలన్న పట్టుదలతో ఉన్న భారత్ భారమంతా నవతరం క్రికెటర్ల పైనే మోపింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం లోని భారతజట్టులో సంజు శాంసన్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, తిలక్ వర్మ, హార్థిక్ పాండ్యా, శివం దూబే, అక్షర పటేల్, హర్షిత్ రాణా, జస్ ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, ఇషాన్ కిషన్‌లతో కూడిన మెరికల్లాంటి ఆటగాళ్లున్నారు.

గ్రూప్ లీగ్ దశ నుంచి సూపర్-8 రౌండ్ చేరడం భారత్‌కు నల్లేరుమీద బండి నడకలాంటిదే. అయితే సూపర్-8 నుంచి నాకౌట్ రౌండ్ వరకూ అసలుసిసలు పోటీ ఎదురుకానుంది. 2007 నుంచి 2024 ప్రపంచకప్ వరకూ జరిగిన తొమ్మిది టోర్నీలలో భారత్ రెండుసార్లు మాత్రమే విజేతగా నిలువగలిగింది. ప్రపంచకప్‌కు ఆతిథ్యమిచ్చిన ఏ దేశమూ ఇప్పటి వరకూ ప్రపంచకప్ విజేతగా నిలువలేకపోడం విశేషం.

**భారత్‌లో 5, శ్రీలంకలో 3 వేదికల్లో**

ప్రపంచకప్ గ్రూపు లీగ్ దశ నుంచి నాకౌట్ ఫైనల్స్ వరకూ జరిగే మ్యాచ్‌ల కోసం భారత్‌లో ఐదు ( అహ్మదాబాద్, కోల్‌కతా, ఢిల్లీ, ముంబై, చెన్నై), శ్రీలంకలో మూడు (కొలంబో ప్రేమదాస, సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్, పల్లెకెలీ అంతర్జాతీయ స్టేడియాలు) వేదికలను ఎంపిక చేశారు. ఫిబ్రవరి 7 నుంచి గ్రూప్ లీగ్ సమరం, మార్చి 4, 5 తేదీలలో సెమీఫైనల్స్ నాకౌట్ పోటీలు, మార్చి 8న టైటిల్ పోరు నిర్వహిస్తారు. మొత్తం 53 మ్యాచ్‌ల ఈ ప్రపంచకప్ సందడి కోసం విశ్వవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులు ఎదురుచూస్తున్నారు.

విజేతగా నిలిచిన జట్టుకు ఐసీసీ ట్రోఫీతో పాటు 2.45 మిలియన్ డాలర్లు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 1.28 మిలియన్ డాలర్లు, సెమీఫైనల్లో పరాజయాలు చవిచూసిన జట్లకు 7,87,500 డాలర్లు చొప్పున ప్రైజ్ మనీగా ఇస్తారు.

**భారత్ రికార్డుల మోత**

టీ-20 ప్రపంచకప్ చరిత్రలో కనీసం ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా వరుస విజయాలతో చాంపియన్‌గా నిలిచిన తొలిజట్టుగా గత ప్రపంచ కప్‌లో భారత్ రికార్డు నెలకొల్పింది. గ్రూప్ లీగ్ దశలో మూడు, సూపర్-8 రౌండ్లో మూడు విజయాలు చొప్పున సాధించిన రోహిత్ సేన నాకౌట్ రౌండ్ సెమీస్, ఫైనల్స్ నెగ్గడం ద్వారా అజేయంగా నిలవడంతో రికార్డు సాధించింది. ప్రస్తుత ప్రపంచ కప్‌లో సైతం భారత్ విజేతగా నిలవడం ద్వారా సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాలని కోరుకొందాం.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

సింగరేణి బొగ్గు బ్లాకుల టెండర్లు, ప్రధానంగా సింగరేణి అధీనంలోని ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ వ్యవహారం ప్రధాన రాజకీయ పార్టీల మధ్య తీవ్ర దుమారం రేపుతోంది. ఈ బొగ్గు బ్లాకుకు సంబంధించి గత కొద్దిరోజులుగా ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు కేటాయించే అంశంలో రాజకీయ ప్రలోభాలు ఉన్నాయన్న విమర్శలు రాజకీయ ప్రకంపనలు రేపుతున్నాయి. ఇలాంటి పరిణామాలతో కార్మికుల ప్రయోజనాలు దెబ్బతింటాయని, సింగరేణిని ప్రైవేటుపరం చేస్తున్నారని మరోవైపు ఆందోళన వ్యక్తమవుతోంది.అధికార విపక్షాలు కాంగ్రెస్, బీఆర్ఎస్ దీనిని అస్త్రంగా చేసుకొని విమర్శలు ఎక్కుపెడుతున్నాయి.ఈ అంశం..ముఖ్యంగా ఉత్తర తెలంగాణ కోల్ బెల్ట్ ప్రాంతంలో రాజకీయ రణరంగాన్ని తలపిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో మొత్తానికి నైని బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేయించింది.




# రాజకీయ

సుమారు 136 సవంత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి గనుల సంస్థ తొలిసారి రాష్ట్రం వెలుపల ఉన్న బొగ్గుగనుల వేలంలో కూడా పాల్గొని ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకును సొంతం చేసుకుంది. ఇది ఆహ్వానించదగిన, గర్వించ దగిన పరిణామమే అయినా, ఈ బొగ్గు గని వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. సింగరేణి అక్కడ సరికొత్త ప్రయాణం మొదలుపెట్టిన తొలినాళ్లలోనే నైనీ బొగ్గు బ్లాక్ టెండరు రద్దు ఆ సంస్థను గందరగోళంలో పడేసింది. విధాన పరమైన నిర్ణయాలు, గనుల కేటాయింపుల్లో ఆరోపణల మధ్య ఈ టెండర్లు రద్దు కావడం సింగరేణి చరిత్రలో అత్యంత తీవ్రమైన వివాదాల్లో ఒకటిగా నిలిచింది.



2015లో జరిగిన వేలంలో ఒడిశాలోని అంగూల్ జిల్లాలోని నైనీ కోల్ బ్లాక్‌ను సింగరేణి సంస్థ దక్కించుకుంది. ఈ బ్లాక్ 2,200 ఎకరాల్లో విస్తరించి ఉంది. 200 ఎకరాల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు టెండర్లను ఓ ప్రైవేటు సంస్థ దక్కించు కుంది. మిగతా 2 వేల ఎకరాల్లో బొగ్గు వెలికితీతకు సంబంధించి 'మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్' విధానంలో గతంలో టెండర్లు పిలిచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పాత టెండర్లను రద్దుచేసి, కొత్తగా టెండర్లను పిలిచారు. అక్కడి బొగ్గును మన రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సింగరేణి ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్ కేంద్రానికి తరలించాలి. నైనీ బ్లాక్ హై-గ్రేడ్ థర్మల్ బొగ్గు కలిగి ఉంది. లీజు ప్రాంతంలో 85శాతం కంటే ఎక్కువ అటవీ భూమి ఉండడం వల్ల ఈ బ్లాక్‌ను కేటాయించి చాలా సంవత్సరాలైనా అటవీ అనుమ తుల్లో ఆలస్యంతో బొగ్గు వెలికితీత కూడా ఆలస్య మైంది. 2021లో దశ–10 కింద అటవీ,పర్యావరణ అనుమతులు, త 2023లో దశ–20 కింద అటవీ అనుమతి లభించింది. 643 హెక్టార్ల అటవీ భూమిని అప్పగింతకు ఎట్టకేలకు 2024లో ఆమోదం లభించింది. ఆ తర్వాత ఒడిశా ప్రభుత్వం నుంచి కూడా అనుమతి లభించడం, మైనింగ్ ప్రణాళికలు, భూగర్భ జలాల తొలగింపు, కాలుష్య నియంత్రణ ఆమోదాలు అమలులోకి రావడంతో ప్రాజెక్టు కార్యాచరణ దశకు చేరుకుంది. దీంతో, బొగ్గు బ్లాక్‌ను పొందిన పదేళ్ల తర్వాత అంటే.. 2025 ఏప్రిల్ 16వ తేదీన అధికారికంగా మైనింగ్ ప్రారంభమైంది. ప్రారంభంలో సింగరేణి సంస్థ తన సొంత యంత్రా లను ఉపయోగించి ఓవర్ బర్డెన్ తొలగింపు, ప్రాథమిక తవ్వకాలను కొనసాగించింది. తెలంగాణ గనుల నుంచి బ్రిడ్జ్ లింకేజీలపై ఆధార పడి బొగ్గును తరలించాల్సి రావడంతో 2025 జూలై నుంచి బొగ్గు సరఫరా ప్రారంభం అవుతుందని భావించారు. నైనీ నుంచి జైపూర్‌కు రైలు మార్గం లేకపోవడం, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తరలిస్తే గిట్టుబాటు కాకపోవడంతో బొగ్గు గుట్టలుగా పేరుకుపోయింది.

ఈ నేపథ్యంలో... సింగరేణి సంస్థ మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్ పద్ధతిలో ఈ బ్లాక్‌ను ప్రైవేటు సంస్థలకు కేటాయించేందుకు నిర్ణయించింది. అంటే.. గని అభివృద్ధి, ఆపరేటర్ విధానంపై మొగ్గు చూపింది. దీని ప్రకారం తవ్వకం, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, బొగ్గు నిర్వహణ,పునరుద్ధరణ పనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయమైంది. దీర్ఘకాలిక ఒప్పందం ప్రకారం దీని విలువను వచ్చే 25 సంవత్స రాలలో రూ.1604 కోట్లుగా అంచనా వేశారు.

నైనీ బ్లాక్ కోసం 2025 చివరలో మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్‌లను నియమించడానికి సింగరేణి సంస్థ టెండర్లను ఆహ్వానించింది. అయితే, అసలు వివాదం అక్కడే మొదలయ్యింది. తప్పనిసరి ప్రీ-బిడ్ సైట్ సందర్శన,ధ్రువీకరణ నిబంధనపై పలువురు బిడ్డర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా ఉన్నవాళ్లకే ఈ అవకాశం కల్పించారనీ ఆరోపణలు చెలరేగాయి. అయితే ఇదే అంశం గతేడాది డిసెంబర్ నాటికి రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. వ్యాపార యుద్ధం జరుగుతుందని రాష్ట్ర మంత్రి వర్గంలోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ల బంధువులు ఇందులో భాగస్వామ్యం అవుతున్నారని, టెండర్లను తమవారికి ఇప్పించు కునేందుకు కొందరు ప్రభుత్వ పెద్దలు ప్రయత్నాలు చేసినట్టు, మంత్రులు వేర్వేరు కంపెనీలకు మద్దతుగా నిలుస్తున్నట్లు పుకార్లు వచ్చాయి. ప్రభుత్వంలోని ఇద్దరు




# సుడిలో 'నైనీ' టెండర్లు

ముఖ్యనేతలు తమ వారికే ఈ కాంట్రాక్టు దక్కాలని పట్టుబట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో టెండర్లలో నిబంధనలను ఒకరికి అనుకూలంగా మార్చారనేది ప్రధాన ఆరోపణ. 'సైట్ విజిట్' నిబంధనను సాకుగా చూపి అర్హత ఉన్న సంస్థలను తప్పించారన్న వాదనలు వినిపించాయి. తమకు కావాల్సిన కంపెనీలకే టెండర్ దక్కేలా నిబంధనలను అడ్డం పెట్టుకుని ఇతరులను పోటీ నుంచి తప్పించారని ప్రతిపక్షాలు, కొన్ని సంస్థలు గళమెత్తాయి. అయితే, టెండర్లలో అక్రమాలకు తావిచ్చేలా ఉన్న 'సైట్ విజిట్' నిబంధనపై ప్రభుత్వం స్పష్టతనిస్తూ, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని, బీఆర్ఎస్ హయాం నుంచే ఈ నిబంధన అమల్లో ఉందని వెల్లడించింది. ఇక, ఈ అంశం మీడియా సంస్థల మధ్య కూడా ఆరోపణలు, ప్రత్యారోపణలకు దారితీసే పరిస్థితులు తలెత్తడం, ప్రభుత్వ పెద్దల మెడకు చుట్టుకుంటుండటంతో.. టెండర్లను రద్దుచేసినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో రాష్ట్రానికి రావాల్సిన బొగ్గు సరఫరాలో జాప్యం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోన్న కేంద్ర ప్రభుత్వం.. నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించిన టెండర్ వివాదంపై కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేందుకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ అండర్ సెక్రటరీ ప్రదీప్ రాజ్ నయన్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, తన ఆదేశాల మేరకే ఈ కమిటీ ఏర్పాటైనట్లు ఆ శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, డైరెక్టర్ మరపల్లి వెంకటేశ్వర్లుతో కూడిన కమిటీ హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో రెండు రోజుల పాటు విచారణ చేపట్టింది. కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీకి చెందిన ఇద్దరు సభ్యులతో కూడిన సాంకేతిక కమిటీ హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో విచారణ చేపట్టింది. మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్‌ను ఎంపికకు సంబంధించి 2025 నవంబర్ 28న జారీ అయిన టెండర్‌ను ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందన్న అంశంపై కమిటీ విచారించింది. ఈ టెండర్ నోటీసులోని నిబంధనలు, విధానాల అమలు, టెండర్ ప్రక్రియలో తలెత్తిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించింది. సేకరించిన ఫైల్స్, ఆధారాలను తమ వెంట తీసుకెళ్లిన ఆ కమిటీ–సింగరేణి సంస్థలో అమలవుతోన్న టెండర్ విధానాలను, కోల్ ఇండియా సహా ఇతర ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీలు అనుసరిస్తున్న ఎండీఓ, అవుట్ సోర్సింగ్ విధానాలతో పోల్చి కమిటీ అధ్యయనం చేస్తుంది.

> **కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీకి చెందిన ఇద్దరు సభ్యులతో కూడిన సాంకేతిక కమిటీ హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో విచారణ చేపట్టింది. మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్‌ను ఎంపికకు సంబంధించి 2025 నవంబర్ 28న జారీ అయిన టెండర్‌ను ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందన్న అంశంపై కమిటీ విచారించింది.**

మరోవైపు..కిషన్ రెడ్డి ఈ అంశంపై ఘాటుగా స్పందిస్తూ, సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం బంగారు బాతులా వాడుకుంటోందని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సింగరేణి కార్మికుల రక్తం తాగుతున్నాయని, బీఆర్ఎస్, అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కుటుంబమంతా సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. బ్యాంకుల నుంచి అప్పు తెచ్చి కార్మికులకు జీతాలిచ్చే పరిస్థితికి బీఆర్ఎస్ అవినీతి పాలనే కారణమని విమర్శించారు. ఫుట్ బాల్ ఆటగాడు మెస్సీ వస్తే 10 కోట్ల రూపాయలు సింగరేణి నుంచి ఖర్చు పెట్టారని,ఫుట్ బాల్‌కు, సింగరేణికి ఏం సంబంధమని ప్రశ్నించారు. సంస్థకు చెందిన 51 కోట్ల రూపాయలను ప్రభుత్వం వాడుకొని తిరిగి ఇవ్వకపోవడంతో సింగరేణి ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ జరుగుతోందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అది ఎప్పటికీ జరగదని అన్నారు. సింగరేణిలో ఖర్చు తగ్గించుకుని, ఉత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నైనీ బొగ్గు బ్లాకు అంశం పెద్ద సమస్య కాదని, దానిని పరిష్కరిస్తామని, రాజకీయాలను పక్కన పెట్టి సింగరేణి ప్రయోజనాల కోసం పని చేస్తామని స్పష్టం చేశారు.

అయితే, సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక టెండర్ రద్దుతో ముగిసేలా కనిపించడం లేదు. 2014 నుంచి జరిగిన కేటాయింపులపై విచారణకు ప్రభుత్వం సిద్ధమని ప్రకటించింది. మరోవైపు, ఈ వివాదంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం పరిస్థితిని మరింత ఉత్కంఠగా మార్చింది.

సింగరేణికి కేటాయించిన బ్లాకుల్లో తవ్వకాల్లో జాప్యం చేసినా, అక్రమాలకు పాల్పడినా, ఆ గనులను వెనక్కి తీసుకోవడమే కాకుండా సింగరేణి నిర్వహణను కేంద్రమే చూసుకోవాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. ఇందులో భాగంగా, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నైనీ బొగ్గు బ్లాక్ వ్యవహారంపై విచారణ జరిపించగా.. సీబీఐ విచారణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం నైనీ కోల్ బ్లాకుల వేలం నిర్వహించలేకపోతే, కేంద్రానికి అప్పగిస్తే పారదర్శకంగా వేలం నిర్వహించి సింగరేణికి కేటాయించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇదే జరిగితే.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణిలో జరిగిన పరిణామాలు, అవినీతి, అక్రమాలు, ప్రభుత్వాల బండారం కూడా బయటపడే అవకాశం ఉంది. మొత్తానికి, సింగరేణి బొగ్గు గనుల సెగ తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కిస్తోంది.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## హరిదాస్



బెంగాల్ ప్రాంతంలోని జషోర్ జిల్లా బుర్హన్‌లో జన్మించిన హరిదాస్ చిన్నతనంలోనే కన్నవారిని కోల్పోయాడు. పుట్టుకతో మహ్మదీయుడైనా నామస్మరణ వైభవాన్ని చాటిన వారిలో అగ్రగామిగా నిలిచారు. నిరంతరం హరినామ స్మరణలో భిక్షాటనతో జీవనం సాగించారు. ఆయన ఆధ్యాత్మిక చింతనకు వస్తున్న ప్రజాదరణ కొందరికి కంటగింపైంది. గోరాయ్ అనే కాజీ, ఆయనపై రాజుగారికి ఏవేవో చెప్పి శిక్ష వేయించాడు. సేవకులు కొరడాతో కొట్టినా హరిదాస్ చలించలేదు. ఆయనను నదిలో పారేసినా ఒడ్డుకు చేరడంతో, తప్పు తెలుసుకున్న గోరాయ్ పశ్చాత్తాపంతో కాళ్ల మీద పడ్డాడు. హరిదాస్‌ను అపఖ్యాతి పాలు చేసేందుకు రామచంద్ర ఖాన్ అనే భూస్వామి ఒక వేశ్యను ప్రయోగించగా, ఆమె హరేరామ మంత్ర జపంతో భక్తురాలైంది. 'మౌనజపం ఒక్కరికే శ్రేయస్కరం... పైకి పాడడం అందరికి మేలు చేస్తుంది' అని బోధించేవారు. శేష జీవితాన్ని నవద్వీపంలోని చైతన్యప్రభువుల సన్నిధిలో గడిపారు.

## కథ | తెలివి తక్కువ కోతి




మహారాజు గారికి ఒక కోతితో ఎక్కువ చనువు ఏర్పడింది. రాజుగారంటే దానికి కూడా ఎక్కువ ప్రేమ.

ఆయన దాంతోనే ఎక్కువగా కాలక్షేపం చేస్తుండేవారు. ఆ కోతి కూడా రాజు గారికి ఏ హానీ కలగకుండా కంటికి రెప్పలా కాపాడుతుండేది.

దాని అభిమానానికి మెచ్చి రాజుగారు దానికొక ఖడ్గం కూడా బహుమతిగా ఇచ్చి దానినే తన అంగరక్షకునిగా నియమించుకున్నారు.

ఒక రోజున రాజుగారు గాఢ నిద్రలో ఉన్నారు. ఇంతలో హఠాత్తుగా ఎక్కడి నుండి వచ్చిందో ఒక కందిరీగ రాజుగారి ముఖం చుట్టూ తిరుగుతూ 'ఝుమ్మ్' అని ధ్వనించడం మొదలుపెట్టింది.

కోతి దాన్ని చూసి చేతితో అదిలించింది. అయితే, అది పోయినట్టే పోయి మళ్లీ వచ్చి గోల చేయసాగింది.

ఎంత అదిలించినా మళ్లీ మళ్లీ

## పద్యం

హీనుడెన్ని విద్యలు నేర్చినగాని
ఘనుడుగాడు హీనజనుడె కాని
పరిమళములు మోయ ఖరము తా గజమౌనె
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** నీచుడైన వ్యక్తి ఎన్ని గొప్ప చదువులు చదివినా అతడు గొప్పవాడు కాలేడు. సుగంధ ద్రవ్యాలు మోసినంత మాత్రాన గాడిద ఏనుగు కాలేదు.

## శ్లోకం

షడేవతు గుణాః పుంసా న హాతవ్యాః కదానిచ
సత్యం దాన మనాలస్యం అసూయా క్షమా ధృతిః

**భావం :** సత్యం, దానం, సోమరితనం లేకపోవడం, అసూయ లేకపోవడం, ఓర్పు, ధైర్యం అనే ఆరు గుణాలను మనిషి ఎన్నడూ విడనాడకూడదు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| చోద్యం | ప్రతిన |
| పశువు | సోదెము |
| ప్రతిజ్ఞ | చట్టము |
| బంధువు | పసరము |
| శాస్త్రము | బందుగు |

జవాబులు : చోద్యం–సోదెము, పశువు–పసరము, ప్రతిజ్ఞ–ప్రతిన, బంధువు–బందుగు, శాస్త్రము–చట్టము.

## శాస్త్రవేత్తలు

### అన్నా మణి



భారతదేశానికి చెందిన ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, వాతావరణ శాస్త్రవేత్త. ఆగస్ట్ 23, 1918న జన్మించారు. పుణేలోని భారత వాతావరణ శాఖ డిప్యూటీ డైరక్టర్ జనరల్‌గా సేవలందించారు. వాతావరణ పరికరాల అభివృద్ధిపై విశేష కృషిచేయడంతో పాటు సౌరశక్తి, పవన శక్తి, ఓజోన్ పొరలపై అనేక పరిశోధనలు చేసి ఎన్నో పరిశోధనా పత్రాలను ప్రచురించారు.



వస్తోంది. చివరకు అది ఎగురుతూ వచ్చి రాజుగారి ముక్కుపైన కూర్చొంది.

దాన్ని చూడగానే కోతికి చాలా కోపం వచ్చింది. తన కత్తితీసి ఒక్కవేటుతో దాన్ని చంపేసింది.

అయితే, కందిరీగతో పాటు రాజుగారి ముక్కు కూడా తెగి కిందపడింది.

రాజు బాధతో మూల్గుతూ లేచి కోతి తప్పు వల్లే ఇలా జరిగిందని దాని కత్తిని, దాని ఉద్యోగాన్ని పీకేసి తోటలోకి తరిమేయమని భటుల్ని ఆదేశించారు. ★

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలో అత్యంత ఎత్తైన విగ్రహం ఏది?
2. ఉసిరి, నిమ్మ, నారింజ పండ్లలో ఏ విటమిన్ ఎక్కువగా లభిస్తుంది?
3. C.B.I. విస్తరించండి?

సమాధానాలు :1. స్టాట్యూ ఆఫ్ యూనిటీ (గుజరాత్); 2. విటమిన్ 'సి'; 3. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్.

## మెదడుకు మేత

ఇంటి ముందు
బీగాలు వేసేవారేగాని
తీసేవారు లేరు.
ఏమిటది?

జవాబు : ముగ్గు

## మంచిమాట

గెలిచేవాడు ఎప్పుడూ వదిలిపెట్టడు, వదిలిపెట్టే వాడు ఎప్పుడూ గెలవలేడు.



# వారఫలాలు

02 -08 ఫిబ్రవరి 2026




సింహంభట్ల సుబ్బారావు

6300674054




**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

సమాజంలో ప్రతిభావంతులుగా మంచి గుర్తింపుతో పాటు, విశేష ఆదరణ పొందుతారు. వాహనాలు, స్థలాలు వంటివి కొనుగోలు చేస్తారు. పరిచయాలు విస్తృతమవుతాయి. ఉద్యోగులకు శ్రమ ఫలించి ఉన్నత పోస్టులు సాధిస్తారు. సాంకేతిక నిపుణులు, రాజకీయవేత్తలకు సంతోషకరమైన విష యాలు తెలుస్తాయి. 3,4 తేదీల్లో మానసిక ఆందోళన. కుటుంబంలో చికాకులు. గణేశాష్టకం పఠించండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

రాబడి గతం కంటే సంతృప్తినిస్తుంది. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా పూర్తి చేస్తారు. వాహన, కుటుంబసౌఖ్యం. శుభకార్యాల నిర్వహణలో పాలు పంచుకుంటారు. బంధువులు, కుటుంబసభ్యుల సూచనలతో నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగులకు మరింత అభివృద్ధి కనిపిస్తుంది. రాజకీయవేత్తలకు పదవీయోగం. కళాకారులు, రచయితలకు అన్ని విధాలా అనుకూలం. 5,6 తేదీల్లో వ్యయప్రయాసలు. ఆరోగ్య సమస్యలు. శివారాధన మంచిది.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆదాయం తగ్గి అప్పుల కోసం యత్ని స్తారు. కొన్ని సమస్యలు మీ సహనాన్ని పరీక్షించే విధంగా ఉంటాయి. కొన్ని వ్యవహారాలలో అంచనాలు తప్పుతాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు. రాజకీయవేత్తలు, కళాకారులకు ఒడుదుడుకులు. రచయితలు, వైద్యులకు కొంత అనుకూల పరిస్థితి. కొంత అనుకూల ప్రభావం ఉంటుంది. 4,5 తేదీల్లో శుభవార్తలు, ఆకస్మిక ధనలబ్ధి. శ్రీరామ స్తోత్రాలు పఠించండి



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

పట్టుదల, నేర్పుతో కొన్ని సమస్యల నుంచి గట్టెక్కుతారు. వాహనయోగం. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలకు కొత్త పదవులు దక్కుతాయి. రచయితలు, క్రీడాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. 7, 8 తేదీల్లో ఖర్చులు అధికం. ఆకస్మిక ప్రయాణాలు. శివస్తోత్రాలు పఠిం చండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. శుభకార్యాల నిర్వహణపై దృష్టి సారిస్తారు. వ్యాపా రులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. విస్తరణ యత్నాలు. ఉద్యోగులు బాధ్యతలు సక్రమంగా నిర్వ హించి సత్తా చాటుకుంటారు. పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానాలు అందుతాయి. వైద్యులు, పరిశోధకులకు ఆహ్వానాలు. 2,3 తేదీల్లో వృథాఖర్చులు. దూర ప్రయాణాలు. హనుమాన్‌ఛాలీసా పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆస్తి వ్యవహారాలలో చిక్కులు తొలగుతాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడతారు. కొద్దిపాటి రుగ్మతలు చికాకు పర్చినా చివరికి ఉపశమనం లభిస్తుంది. వ్యాపారులకు అనుకున్న లాభాలు దక్కు తాయి. కళాకారులకు నూతనోత్సాహం. క్రీడా కారులు, పరిశోధకులకు అవకాశాలు పెరుగుతాయి. 6,7 తేదీల్లో మానసిక వేదన, కుటుంబంలో ఒత్తిళ్లు. ఆదిత్యహృదయం పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కుటుంబంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెల కొంటుంది. దూరపు బంధువులను కలుసుకుంటారు. వ్యాపారులు లాభాల దిశగా సాగుతారు. కొత్త పెట్టు బడులు సమకూరతాయి. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు తథ్యం. కళాకారులకు కొత్త అవకాశాలు దక్కుతాయి. రచయితలు, పరిశోధకులకు నూత నోత్సాహం. 5,6 తేదీలలో అనారోగ్యం. స్నేహితు లతో తగాదాలు. గణపతిని అర్చించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

విద్యార్థులు కోరుకున్న అవకాశాలు దక్కించు కుంటారు. ఉద్యోగయత్నాలు సానుకూలం. సేవా కార్యక్రమాలలో కీలక పాత్ర పోషిస్తారు. వ్యాపారు లకు ఎదురులేని పరిస్థితి. ఉద్యోగులకు ఊహించని ఆదరణ. రాజకీయవేత్తలు, కళాకారుల ప్రయత్నాలు ఫలిస్తాయి. రచయితలు, క్రీడాకారులకు నూతన నోత్సాహం. 7,8 తేదీల్లో చిక్కులు, వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. దుర్గామాతను పూజించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఇంటి నిర్మాణాల్లో అవ రోధాలు తొలగుతాయి. వ్యాపారులకు లాభసాటిగా ఉండడమే కాకుండా పెట్టుబడులు సైతం సమకూరతాయి. ఉద్యోగులకు అనుకూల వాతావరణం. పారిశ్రామికవేత్తలు అనుకున్న ఆశయాలు సాధిస్తారు. క్రీడాకారులు, పరిశోధకులకు శుభవార్తలు. 3,4 తేదీల్లో మానసిక అశాంతి. అనారోగ్యసూచనలు. ఆంజనేయ దండకం పఠించండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

విద్యార్థులకు ఫలితాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలలో పురోగతి కనిపిస్తుంది. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు అనుకున్న పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులు ఒత్తిళ్లు అధిగ మిస్తారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. రచయితలు, పరిశోధకులకు శుభవార్తలు. 6,7 తేదీల్లో బంధు విరోధాలు. మనశ్శాంతి లోపిస్తుంది. శ్రీ నరసింహ స్తోత్రాలు పఠించండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. విద్యార్థులకు శుభవార్తలు. సోదరులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. వ్యాపారులకు మరింత అనుకూల సమయం. ఉద్యోగులకు ప్రమోషన్లు ఊరి స్తాయి. కళాకారులు, పారిశ్రామికవేత్తలకు నూత నోత్సాహం. రచయితలు, క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం. 7,8 తేదీల్లో మానసిక ఆందోళన. కుటుంబసమస్యలు. దత్తాత్రేయుని పూజించేండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆశించిన ఆదాయం సమకూర్చుకుంటారు. బంధువుల తాకిడితో ఉత్సాహంగా గడుపుతారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. వ్యాపారులకు అనుకున్న లాభాలు తథ్యం. నూతన పెట్టుబడులతో విస్తరిస్తారు. ఉద్యోగులుబాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి మెప్పు పొందుతారు. పారిశ్రామికవేత్తలకు మరింత సంతోషకరంగా ఉంటుంది. రచయితలు, క్రీడా కారులకు అంచనాలు నిజం. 2,3 తేదీల్లో వృథా ఖర్చులు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

# పదరసం-549



## ఆధారాలు

**అడ్డం**

1. నక్షత్రం (2)
2. నిందించు, పరిహసించు (3)
4. అలనాటి సాహిత్య పత్రిక, సరస్వతి (3)
6. భ్రమరం (3)
7. వేగం, సత్తువ (2)
8. నెలంతా పనిచేస్తే వచ్చేది (2)
10. ఆజ్ఞ, ఆదేశం (2)
11. పెద్దకుండ (2)
12. సౌమ్యవారం (2)
14. పవనసుతుడు (3)
15. మానవుల్లో శ్రేష్ఠుడు (4)
17. మూల్యం, వెల (3)
19. గొంతు, కుత్తుక ..అటు నుంచి (2)
20. వింటి అల్లెతాడు (2)
21. ఛాయ, ఆశ్రయం (2)
22. పన్నెండు...ఓ కొలమానం (3)
24. అణకువ (3)
28. ముత్తయిదువ (4)
29. సంతోషం (2)
31. వేణువు (3)
32. కూతురు (3)

**నిలువు**

1. తాతను గౌరవిద్దాం (3)
2. మలయమారుతం (3)
3. పురాణ పురుషుల ఒక ఆయుధం (2)
4. అర్థం (4)
5. మధురిమ (3)
7. అమ్మ, అంబ (3)
9. తంత్రీవాద్యం (3)
10. అటువైపు (3)
11. అక్కల భర్తలు (3)
13. శ్వేతవర్ణం (3)
15. వెన్న (4)
16. గొడవ, వివాదం (3)
17. అధికం. ఎటు చదివినా ఒకటే (3)
18. కుండలాకారం, గుండ్రం (3)
23. ప్రజలే (3)
25. నేత్రం (3)
26. జాతీయ పతాక రూపకర్త ఇంటి పేరు (3)
27. భూమి, నేల (3)
28. యంత్రం (2)
30. నమస్కారం, కర్ర (2)

## పదరసం - 548 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మే | నా | | 2 అం | కు | 3 శం | | 4 ఆ | కాం | 5 క్ష |
| డా | | 6 పం | బ | | 7 క | డ | వ | | మ |
| 8 రం | 9 భ | | రం | | రి | | 10 డ | 11 జ | |
| | 12 ర | వం | | 13 ఆ | | 14 న్న | | 15 గ | తం |
| 16 టో | ణి | | 17 పా | ప | | 18 సు | 19 మ | తి | |
| ధి | | 20 సం | పా | ద | న | | హి | | 21 అం |
| | 22 వా | త | | లు | | 23 స | | 24 పం | కం |
| 25 వా | | 26 కం | 27 చి | | 28 దు | బా | 29 సి | | |
| 30 ర | ధి | | గు | | రా | | 31 పా | త | 32 కం |
| ధి | | 33 చా | రు | | శ | | యి | | త |







**కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లోని వ్యక్తులు నిస్వార్థంగా చేస్తున్న సేవలను గుర్తించి వారికి పట్టం కట్టడంలో తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటోంది. సమాజంలో వారికున్న హోదాకు ప్రాధాన్యం ఇవ్వకుండా పద్మ పురస్కారాలకు ఎంపిక చేస్తోంది. అలా ఈ యేడాది కూడా 131 మందికి పద్మ పురస్కారాలను ప్రకటించింది. అందులో 113 మందికి పద్మశ్రీ, 13 మందికి పద్మభూషణ్, ఐదుగురికి పద్మ విభూషణ్ పురస్కారాలు ఇవ్వబోతున్నట్టు తెలిపింది.**

# సినీ ప్రతిభావంతులకు పద్మ పురస్కారాలు!

హిందీ చిత్రసీమలో మేచోమేన్ అనగానే టక్కున గుర్తొచ్చే పేరు ధర్మేంద్ర. ఆయనను మరణానంతరం దేశంలోనే రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్‌కు కేంద్రం ఎంపిక చేసింది. పంజాబ్‌లోని మారుమూల గ్రామంలో జన్మించిన ఆయన ముంబై మహానగరానికి చేరి, చిత్రసీమలో స్టార్ హీరోగా ఎదిగారు. ఆరు దశాబ్దాల పాటు సినిమా రంగంలో తనదైన ముద్రను వేశారు. పలు చిత్రాలను నిర్మించారు. దాదాపు 300 చిత్రాలలో నటించిన ధర్మేంద్ర తుది శ్వాస వరకూ సినిమాలు చేస్తూనే ఉన్నారు. ఆయన చివరి చిత్రం 'ఇక్కీస్' ఈ యేడాది జనవరి 1న విడుదలైంది. రాజకీయ నాయకుడిగానూ ధర్మేంద్ర సత్తా చాటారు. 2004లో రాజస్థాన్ లోని బికనీర్ పార్లమెంట్ నుండి పోటీ చేసి గెలిచారు.

మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టిని కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసింది. న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించిన మమ్ముట్టి నటుడిగా మారి దాదాపు 400 చిత్రాలలో నటించారు. ఇప్పటికీ హీరోగా కొనసాగుతున్నారు. మూడుసార్లు జాతీయ ఉత్తమ నటుడిగా ఎంపికైన మమ్ముట్టి కెరీర్ లో ఎన్నో గొప్ప చిత్రాలున్నాయి. 74 సంవత్సరాల వయసులోనూ యువ నటులతో పోటీ పడి నటిస్తున్నారు. తెలుగులో కె. విశ్వనాథ్ దర్శకత్వంలో 'స్వాతికిరణం' చిత్రంలో సంగీత విద్వాంసుడి పాత్రకు ప్రాణం పోశారు. అలానే 'సూర్య పుత్రులు' సినిమాలోనూ నటించారు. ఆ మధ్య 'యాత్ర' సినిమాలో వై.యస్. రాజశేఖర్ రెడ్డి పాత్రను పోషించి మెప్పించారు. విశేషం ఏమంటే ఇటీవల నటించిన 'భ్రమయుగం' సినిమాకు గానూ ఉత్తమ నటుడిగా మరోసారి కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డును ఆయన అందుకున్నారు.

హిందీ చిత్రసీమలో లతా మంగేష్కర్, ఆశా భోంస్లే తర్వాత ఎక్కువ పాటలు పాడిన గాయనిగా పేరు తెచ్చుకున్నారు అల్కా యాగ్నిక్. కోల్‌కతాలో జన్మించిన అల్కాయాగ్నిక్ తన తల్లి బాటలోనే సాగుతూ శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసించారు. పదేళ్ళ వయసులో ముంబై చేరిన అల్కా యాగ్నిక్ సూపర్ డూపర్ హిట్ సినిమాలకు పాటలు పాడి స్టార్ సింగర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. భారతీయ సినీ సంగీత వైభవానికి ఓ గాయనిగా ఆమె అందించిన సహకారానికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఇక భారతీయ వాణిజ్య ప్రకటనల విభాగంలో తనదైన ముద్ర వేసిన పీయూష్ పాండేను కూడా మరణానంతరం పద్మభూషణ్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వాణిజ్య ప్రకటనల్లో భారతీయతను తీసుకురావడానికి పీయూష్ విశేషంగా కృషి చేశారు.

ఈసారి తెలుగు సినిమా రంగానికి చెందిన ఇద్దరు ప్రముఖ నటులు పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. అందులో ఒకరు మురళీమోహన్ కాగా, మరొకరు రాజేంద్ర ప్రసాద్. ఐదు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రయాణంలో మురళీమోహన్ వైవిధ్య భరితమైన పాత్రలు ఎన్నో చేశారు. ప్రముఖ నిర్మాత అట్లూరి పూర్ణ చంద్రరావు, మురళీమోహన్‌ను 'జగమే మాయ' సినిమాతో చిత్రసీమకు పరిచయం చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ అప్రతి హతంగా మురళీమోహన్ సినిమాల్లో నటిస్తూనే ఉన్నారు. నిర్మాతగానూ ఎన్నో చిత్రాలను నిర్మించారు. తెలుగు దేశం పార్టీ నేతగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి లోక్ సభ స్థానానికి పోటీ చేశారు. 2009లో ఓడిపోయిన ఆయన, 2014లో ఎం.పీ.గా రాజ మండ్రి నుండి గెలిచారు.

'నటకిరీటీ' రాజేంద్రప్రసాద్ సినిమా ప్రస్థానం సైతం సుదీర్ఘమైంది. నిమ్మకూరులో పుట్టిన ఆయన నటన మీద మక్కువతో చెన్నయ్ అడయార్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుని సినిమాల్లోకి వచ్చారు. నటుడిగానే కాకుండా డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానూ కెరీర్ ప్రారంభంలో తన సత్తాను చాటారు. తెలుగు సినిమా రంగంలో కామెడీ స్టార్ హీరోగా దశాబ్దాల పాటు కొనసాగారు. 'ఆ నలుగురు' సినిమా తర్వాత తన పంథాను మార్చి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పలు భిన్నమైన పాత్రలను పోషిస్తున్నారు. కొన్ని చిత్రాలను నిర్మించారు. విశేషం ఏమంటే పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన ఈ ఇద్దరూ కూడా గతంలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా సేవలు అందించారు. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన మరో నటుడు ఆర్. మాధవన్. ఈయన నటించిన పలు తమిళ చిత్రాలు తెలుగులోనూ డబ్ అయ్యి విడుదలయ్యాయి. మంచి విజయాన్ని అందుకున్నాయి. ఆ రకంగా ఆయన తెలుగువారికీ సుపరిచితులే. నవదీప్, కాజల్ మూవీ 'ఓంశాంతి'లోనూ, నాగచైతన్య 'సవ్యసాచి'లోనూ నటించారు. ప్రముఖ సైంటిస్ట్ నంబినారాయణ్ బయోపిక్ 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'లో టైటిల్ రోల్ పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఆయన ప్రతిభకు తార్కాణంగా నిలిచింది. అంతేకాదు పద్మశ్రీ పురస్కారానికీ కారణమైంది.

హిందీ సినిమాల్లోనూ, బుల్లితెర ధారావాహికల్లోనూ కీలక పాత్రలు పోషించిన సతీశ్ షాను మరణానంతరం పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆయన 'యే జో హై జిందగీ' సీరియల్ ద్వారా యావత్ భారతావనికీ పరిచయమయ్యారు. అలానే సూరజ్ బర్జాత్య తెరకెక్కించిన సినిమాల్లో కీలక పాత్రలను పోషించారు. ఇదే కోవలో బాలీవుడ్ నటులు అనిల్ కుమార్ రస్తోగి, అరవిందో వైద్య, బెంగాలీ నటుడు ప్రసేన్ జిత్ ఛటర్జీని పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేశారు. విశేషం ఏమంటే... తెలుగు నటులైన మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేశారని తెలియగానే చిరంజీవి వారి ఇంటికి వెళ్ళి స్వయంగా అభినందనలు తెలియచేసి, సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు












వెల : ₹.250/- | వెల : ₹.100/- | వెల : ₹.400/- | వెల : ₹.300/- | వెల : ₹.151/-










వెల : ₹.800/900 : 999/1200 | వెల : ₹.100/- | వెల : ₹.150/- | వెల : ₹.99/-












వెల:₹.1598/- సెట్ | వెల:₹.449/- | వెల :₹.450/- | వెల : ₹.400/- | వెల : ₹.145/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 16




# జాగృతి TV

## చేరండి

మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి · మెచ్చండి · పంచండి